శుక్రవారం
2•2•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 236
• పేజీలు : 16 + (20/16)

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

బడ్జెట్ 2018-19

సాదాసీదా బడ్జెట్

ఆరోగ్యబీమా, రైతుకు ఊరట మాత్రమే మినహాయింపు

మార్పులేని ఆదాయంపన్ను శ్లాబులు ■ వేతన ఉద్యోగులకు లభించని ఊరట

నాలుగు శాతానికి పెరిగిన విద్య, వైద్య సెస్సు ■ సామాజిక సంక్షేమ సర్‌చార్జి పది శాతం

ఆదాయ వనరులపై అస్పష్టత; ద్రవ్యలోటు పరిమితి పెంపు ■ మరింత ప్రియం కానున్న దిగుమతి వస్తువులు

లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్‌పై 14 ఏండ్ల తర్వాత మళ్లీ పన్ను

ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ ఆదాయంపై 10 శాతం పన్ను





ఎన్నికల పులి ప్రసన్నం కోసం జైట్లీ యత్నం

బడ్జెట్ స్వరూపం

2018-19 బడ్జెట్ అంచనాలు (రూపాయలు కోట్లలో)

రెవెన్యూ వసూళ్లు:	17,25,738
క్యాపిటల్ వసూళ్లు:	7,16,475
మొత్తం వసూళ్లు:	24,42,213
మొత్తం వ్యయం:	24,42,213
ఆదాయ లోటు:	4,16,034
ద్రవ్యలోటు:	6,24,276
ప్రాథమిక లోటు:	48,481

పెద్ద నోట్ల రద్దు సృష్టించిన సమస్యలతో సామాన్యుల్లో పేరుకుపోయిన ఆగ్రహం.. జీఎస్టీ కారణంగా వ్యాపారవర్గాల్లో నెలకొన్న అసంతృప్తి.. పంటలకు ధరలు లేక రోడ్లమీదికొచ్చిన రైతన్నల కోపం.. మధ్యతరగతిలో, పట్టణప్రాంతాల్లో వీస్తున్న ప్రభుత్వ వ్యతిరేక పవనాలు.. మరోవైపు, తరుముకొస్తున్న ఎన్నికలు.. ఈ నేపథ్యంలో ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ గురువారం లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఎన్నికల పులి మీద స్వారీచేస్తూ ఒకింత ఆగ్రహంగా దూసుకొస్తున్న భారతీయ ఓటరును ప్రసన్నం చేసుకునే లక్ష్యంతో బడ్జెట్‌కు రూపకల్పన చేశారు. కానీ, అంకెల ఘనమే తప్ప ఆచరణపై స్పష్టత లేదు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య బీమా పథకాన్ని పేదల కోసం తీసుకొస్తామన్నారు. వానకాలం పంటలకు ఉత్పత్తి వ్యయం కన్నా 150 శాతం అధికంగా మద్దతుధర ఇస్తామన్నారు. ఇతర రంగాలకూ భారీ ఎత్తున నిధులను ప్రకటించారు. కానీ, వాటినెలా సమీకరిస్తారన్న దానిపై స్పష్టత కొరవడింది. ఆదాయానికి, వ్యయానికి పొంతన లేకపోవటంతో ద్రవ్యలోటు పరిమితిని మరింత పెంచారు. ఇటు వేతన ఉద్యోగులకుగానీ అటు వ్యాపారవర్గాలకుగానీ బడ్జెట్ ఊరట కలిగించలేదు. బడ్జెట్ ప్రకటన నేపథ్యంలో మార్కెట్లు కుప్పకూలాయి. బడ్జెట్‌ను.. శుష్క వాగ్దానాల ఎన్నికల ప్రహసనంగా, భారీ మోసంగా ప్రతిపక్షాలు కొట్టిపారేయగా, నూతన భారతావని నిర్మాణానికి అవసరమైన వారధిగా ప్రధాని మోదీ అభివర్ణించారు.

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1:

మరో ఏడాదిలో లోక్‌సభ ఎన్నికలు, మరికొన్ని నెలల్లో 8 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఆయనకిది వరుసగా ఐదో బడ్జెట్. గంటా యాభై నిమిషాలపాటు ఇంగ్లిష్, హిందీల్లో జైట్లీ ప్రసంగించారు. 'మన దేశం 75వ స్వాతంత్ర్యదిన సంబురాలు జరుపుకొనే 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలని ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారు' అని గుర్తుచేశారు. దీంట్లోభాగంగా వ్యవసాయానికి దన్నుగా నిలిచేందుకు సేంద్రియసాగు, పశుపోషణ, గ్రామీణ గృహ నిర్మాణం, మత్స్యరంగం అభివృద్ధికి రూ.14.34 లక్షల కోట్లతో పలు పథకాలను జైట్లీ ప్రకటించారు. ఉత్పత్తి వ్యయానికి కనీసం 150 శాతం అధికంగా ఉండేలా అన్ని వానకాలం పంటల మద్దతుధరను పెంచుతామన్నారు. పది కోట్ల పేద కుటుంబాలకు వర్తించే విధంగా 'జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకం' తీసుకొస్తామని చెప్పారు. 'ఈ పథకంతో దాదాపు 50 కోట్ల మందికి లబ్ధి చేకూరుతుంది. కుటుంబానికి ఏటా రూ.5 లక్షల వరకూ ఆరోగ్య బీమా సదుపాయం లభిస్తుంది. ఇది ప్రపంచంలోనే అత్యంత భారీ ప్రభుత్వ ప్రాయోజిత ఆరోగ్యబీమా పథకం' అని జైట్లీ పేర్కొన్నారు. చిన్న, మధ్యతరహా వ్యాపార సంస్థలకు పన్నును తగ్గించారు. అత్యంత సంపన్నులపై ఉన్న 10-15 శాతం పన్నును మాత్రం అలాగే కొనసాగించారు. విద్య, వైద్య సెస్సును ఇప్పుడున్న మూడు నుంచి నాలుగు శాతానికి పెంచారు.

వ్యవసాయం, గ్రామీణ భారతమే ప్రాధాన్యం

రానున్న ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ ప్రాధాన్య రంగాలు వ్యవసాయం, గ్రామీణభారతమేనని జైట్లీ ప్రకటించారు. ఈ ఏడాది అన్ని వానకాలం పంటలకు ఉత్పత్తి వ్యయం కన్నా 150 శాతం అధికంగా కనీస మద్దతు ధరను చెల్లిస్తామన్నారు. వ్యవసాయ రుణాలను రూ.11 లక్షల కోట్లకు

› మిగతా 15వ పేజీలో

మనకేం దక్కింది?

- కీలక ప్రాజెక్టులపై అలవిమాలిన నిర్లక్ష్యం
- బడ్జెట్‌లో నయాపైసా చూపని కేంద్రం
- దిక్కూమొక్కూ లేని విభజన నాటి హామీలు
- కాళేశ్వరం, భగీరథ, మెట్రో రైల్.. దేనికీ పైసాలేదు
- బయ్యారం ఉక్కు, ఎయిమ్స్, కోచ్ ఫ్యాక్టరీ ఊసేలేదు
- బెంగళూరు మెట్రోకు మాత్రం భారీ కేటాయింపులు
- నవ్వులపాలవుతున్న సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్

అడిగినదానిలో 5 శాతమే!.. 40వేల కోట్లు అంటే.. రెండువేల కోట్లు!

తెలంగాణను పట్టించుకోని కేంద్రం.. కేటాయింపులపై వివక్ష

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకించి దక్కిందేమీలేదు. తెలంగాణ రాష్ట్ర ప్రజల జీవన గమనాన్ని, రాష్ట్ర ఆర్థిక, సామాజిక చిత్రపటాన్ని మార్చే కీలకమైన ప్రాజెక్టులకు నయాపైస కూడా ఇవ్వలేదు. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలు నాలుగేండ్లయినా కార్యరూపం దాల్చలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ.పదివేల కోట్లతోపాటు వివిధ ప్రాజెక్టులకు కలిపి మొత్తం రూ.40వేల కోట్ల మేర ఆర్థిక సహకారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరితే కేవలం రూ.2085 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇందులో సింగరేణికి రూ.2000 కోట్లు చూపించారు. హైదరాబాద్ ఐఐటీకి రూ.75కోట్లు, తెలంగాణ గిరిజన

› మిగతా 13వ పేజీలో

రాజస్థాన్‌లో బీజేపీకి షాక్
- ఉప ఎన్నికల్లో రెండు ఎంపీ, ఒక ఎమ్మెల్యే సీటు గల్లంతు
- భారీ మెజారిటీతో గెలుపొందిన కాంగ్రెస్
- బెంగాల్‌లో తృణమూల్‌దే విజయం

16

డబుల్ ఇండ్లు అద్భుతం
- తెలంగాణ ప్రభుత్వ పథకాలు భేష్
- కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ
- జాయింట్ సెక్రటరీ అపరాజిత సారంగి

13

గద్దెకు చేరిన సమ్మక్క

నేటి నుంచి సారక్క, పగిడిద్దరాజు, గోవిందరాజుతో కలిసి భక్తులకు ఆశీర్వాదం

5



గురువారం రాత్రి చిలుకలగుట్టనుంచి భారీ సంఖ్యలో భక్తులు వెంటరాగా సమ్మక్కను తీసుకుని వచ్చి మేడారం గద్దెలపై ప్రతిష్ఠిస్తున్న పూజారులు

మరికొన్ని బడ్జెట్ ప్రతిపాదనలు

- అమృత్ పథకం కింద 500 నగరాల్లో నీటి సరఫరాకు రూ.19,428 కోట్లతో 494 ప్రాజెక్టులు.
- స్మార్ట్‌సిటీ పథకం కింద ఎంపికచేసిన 99 నగరాల అభివృద్ధికి రూ.2.04లక్షల కోట్లు
- 'నమామి గంగే' పథకం కింద 187 ప్రాజెక్టులు. 10 పర్యాటక కేంద్రాల అభివృద్ధి. పురావస్తుశాఖ కింద ఉన్న 110 కేంద్రాల అభివృద్ధికి కృషి.
- పీఎం జీవన బీమా యోజన ద్వారా రెండు కోట్ల కుటుంబాలకు లబ్ధి.
- 2022 నాటికి దేశంలోని ప్రతీ పౌరుడికి సొంతిల్లు.





జైట్లీ ప్రకటన మరో జిమ్మిక్కు

ప్రస్తుత ధరతో పోలిస్తే పంటలపై కనీసం సాగు ఖర్చులపై 50 శాతం కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ) పెంచుతామని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చేసిన ప్రకటన మరొక జిమ్మిక్కు. రైతుల సమస్యల పట్ల సానుకూల దృక్పథం కొరవడింది. రైతుల బాధలు ప్రభుత్వానికి పట్టడం లేదు. రాజకీయ చిత్తశుద్ధి కొరవడింది. రైతుల సమస్యలు పరిష్కరించకుండా గెలువగలమని వారు భావిస్తున్నారు.

- సామాజిక కార్యకర్త యోగేంద్ర యాదవ్.

తెలంగాణ దారిలో కేంద్ర పథకాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రకటించిన కొన్ని పథకాలను పరిశీలిస్తే.. తెలంగాణ రాష్ట్రం రూపొందించిన దారిలోనే వెళ్తున్నట్టుగా కనిపిస్తున్నది. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ప్రజలకు సురక్షితమైన తాగునీరు ఇవ్వడం కోసం మిషన్ భగీరథ పథకాన్ని తీసుకువచ్చారు. ఈ పథకంతో ప్రతిఇంటికి నల్లాల ద్వారా సురక్షితమైన తాగునీటిని అందించనున్నారు. ప్రధాని నరేంద్రమోదీ స్వయంగా వచ్చి ఈ పథకాన్ని గజ్వేల్‌లో ప్రారంభించిన విషయం తెల్సిందే.

దీనిపై కేంద్ర ప్రభుత్వం సుదీర్ఘంగా అధ్యయనం చేసింది. తాజాగా గురువారం కేంద్రం ప్రకటించిన అందరికీ సురక్షిత తాగునీటి పథకానికి తెలంగాణ రాష్ట్రం ప్రారంభించిన మిషన్ భగీరథే స్ఫూర్తి అని విశ్లేషకులు భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో ఇంటింటికి తాగునీటి పథకాన్ని ప్రకటించి ఈ పథకం కింద రూ.77,500 కోట్లు కేటాయించింది. గతంలో ఇంత పెద్దమొత్తంలో బడ్జెట్ నిధులను తాగునీటి కోసం ఏనాడూ కేటాయించలేదు. దీంతోపాటుగా ఇండ్లు లేని పేదలందరికీ తెలంగాణ ప్రభుత్వం ఉచితంగా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మిస్తున్నది. ఈ పథకానికి దేశవ్యాప్తంగా ప్రశంసలు వచ్చాయి. కేంద్ర అధికారుల బృందం, ఇతర రాష్ర్టాల బృందాలు వచ్చి ఈ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించి వెళ్లాయి. దేశంలో పేదలందరికీ ఇండ్లు నిర్మించాలన్న భావనను కేంద్రానికి తెలంగాణ కలిగించింది. ఈ మేరకు 2022 నాటికి గ్రామీణ ప్రాంతాలలో 51 లక్షల ఇండ్లు నిర్మించాలని లక్ష్యాన్ని ఈ బడ్జెట్‌లో పెట్టుకున్నది. పట్టణాల్లో ఇండ్లు లేని పేదల కోసం 37 లక్షల ఇండ్లు నిర్మిస్తామని బడ్జెట్‌లో కేంద్రం ప్రతిపాదించింది. కేంద్రం తెలంగాణ రాష్ట్రస్థాయిలో నిధులు కేటాయించి ఇళ్లను నిర్మించే అవకాశంలేదు. కానీ, ఇక్కడి డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణమే కేంద్రం ప్రభుత్వ ప్రాథమ్యాలను మార్చిందని చెప్పవచ్చు.

బడ్జెట్‌లో తెలంగాణ పథకాల జాడలు

డబుల్ బెడ్రూం స్ఫూర్తిగా పేదలకు ఇండ్లు

వ్యవ'సాయం'పైనా మన ముద్ర

గురుకులాల స్ఫూర్తిగా ఏకలవ్య పాఠశాలలు



సీఎం కేసీఆర్ పథకాలే ఆదర్శంగా..

ఇక వ్యవసాయ రంగంలో సీఎం కేసీఆర్ తీసుకున్న చర్యలు, చేపడుతున్న కార్యక్రమాలు అందరికీ ఆదర్శంగా నిలిచాయి. కేంద్ర నాయకత్వం కూడా సీఎం కేసీఆర్ స్థాయిలో డైనమిక్‌గా నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితి కనిపిస్తున్నది. వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడంతో పాటు, మార్కెట్ సదుపాయం, గిట్టుబాటు ధర వచ్చేలా చేయడానికి సీఎం కేసీఆర్ భారీ కసరత్తు చేశారు. రైతులందరినీ ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చారు. రైతు సమాఖ్యలను ఏర్పాటు చేశారు. రైతు పండించిన పంటకు రైతే ధర నిర్ణయించే స్థాయికి ఎదిగేలా చర్యలు తీసుకుంటున్నారు. మార్కెటింగ్‌లో నైపుణ్యం సాధించేలా చేస్తున్నారు. వ్యవసాయానికి పెట్టుబడి పథకాన్ని తీసుకువచ్చారు. ఇలా రైతు కోసం ఒక రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మకంగా చేపడుతున్న కార్యక్రమాలు కేంద్రానికి స్ఫూర్తి కలిగించేలా ఉన్నాయి. దీంతో రైతుకు ఏదైనా మేలుచేయాలన్న ఉద్దేశంతో అన్ని పంటలకు కనీస మద్దతు ధర సాధిస్తామన్నారు. రైతుకు ఉత్పాదక వ్యయం కంటే ఒకటిన్నర రెట్లు అధికంగా ఆదాయం వచ్చేలా చేస్తామన్నారు. ఈ మేరకు 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెండింతలు చేస్తామని, దీనికోసం అన్ని రాష్ట్రప్రభుత్వాలతో నీతిఆయోగ్ చర్చలు జరిపి స్పష్టమైన విధాన రూపకల్పన చేస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. రైతుల కోసం 22 వేల గ్రామాల్లో వ్యవసాయ మార్కెట్ల ఏర్పాటుకు రూ. 2 వేల కోట్లు కేటాయిస్తున్నట్టు తెలిపారు.

కేంద్రం దృష్టిని ఆకర్షిస్తున్న పథకాలు

వైద్యరంగంలో కూడా రాష్ట్రం తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులు కేంద్రం దృష్టినికి ఆకర్షించాయి. ముఖ్యంగా పేదలందరికి ఉచితంగా వైద్యం అందించడం కోసం ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడంతోపాటు, పేదింటి ఆడబిడ్డల ప్రసవం కోసం కేసీఆర్ కిట్స్ పథకాన్ని తీసుకువచ్చారు. ఉద్యోగులు, జర్నలిస్టుల కోసం హెల్త్‌సెంటర్లు ఏర్పాటు చేశారు. కేసీఆర్ ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం అమలు చేస్తున్న పథకాలను అధ్యయనం చేయించిన కేంద్రం పెద్దఎత్తున 1.5 లక్షల హెల్త్‌సెంటర్లు ఏర్పాటు చేయాలని వార్షిక బడ్జెట్‌లో ప్రతిపాదించింది. ఇందుకు బడ్జెట్‌లో రూ.1200 కోట్లు కేటాయించింది. అలాగే దేశంలో 10 కోట్ల పేద కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల ఆరోగ్యబీమా కల్పిస్తామని ప్రకటించింది. అయితే, తెలంగాణ చేపట్టిన స్థాయిలో కాకుండా కేంద్ర, రాష్ర్టాలు బీమా సొమ్మును భరించేలా కొత్త బీమా పథకాన్ని తీసుకొస్తున్నది. తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాలల స్ఫూర్తితో ఈ ఏడాది బడ్జెట్‌లో ఆదివాసీ బాలలకు ఏకలవ్య పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నది. ఇలా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో విప్లవాత్మకంగా ముందుకు వెళుతున్న తెలంగాణ రాష్ట్రం వివిధ రాష్ర్టాలకు అధ్యయన కేంద్రంగా మారింది. అటు కేంద్రం కూడా తెలంగాణలో అమలవుతున్న మంచి పథకాలను దేశవ్యాప్తంగా అమలు చేసే దిశగా కదులుతున్నట్టు బడ్జెట్‌లో చేసిన కొన్ని ప్రతిపాదనలు సూచిస్తున్నాయి. కేంద్రం బడ్జెట్‌లో చెప్పిన పథకాలను ఏమేరకు చిత్తశుద్ధితో పూర్తిచేస్తుంది? ఎలా నిధులు ఇస్తుందన్నది వేచిచూడాలి.

హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా రాధాకృష్ణన్

కొలీజియం సిఫారసు.. అధికారికంగా ధ్రువీకరణ

సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో తీర్మానం ప్రతి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవికి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్ పేరును సుప్రీంకోర్టు కొలీజియం గురువారం ఖరారు చేసింది. ప్రస్తుతం ఆయన ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నారు. కొలీజియం మొత్తం పది హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తులను ఎంపిక చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా, న్యాయమూర్తులు జస్టిస్ జే చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గొగోయ్ సభ్యులుగా ఉన్న కొలీజియం గతనెల 10న ఈ మేరకు తీర్మానించగా గురువారం తీర్మానం ప్రతిని సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అధికారికంగా అప్‌లోడ్ చేశారు. తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ హైకోర్టుతో పాటుగా ఢిల్లీ, మేఘాలయ, ఛత్తీస్‌గఢ్, కలకత్తా, కర్ణాటక, త్రిపుర, హిమాచల్‌ప్రదేశ్, కేరళ, మణిపూర్ హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తులను కొలీజియం ఎంపిక చేసింది. కలకత్తా హైకోర్టు సీనియర్ జడ్జి అనిరుద్ధ బోస్‌ను ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఎంపిక చేశారు. ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి టీబీ బాలకృష్ణన్‌ను తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు, మేఘాలయ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దినేశ్ మహేశ్వరిని కర్ణాటకకు బదిలీ చేయాలని నిర్ణయించారు. అలహాబాద్ హైకోర్టు సీనియర్ జడ్జి తరుణ్ అగర్వాలాను మేఘాలయ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఎంపిక చేశారు. కలకత్తా, కేరళ హైకోర్టు జడ్జీలను ఆయా హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులుగా ప్రమోట్ చేయాలని సంప్రదాయానికి భిన్నంగా కొలీజియం తీర్మానించడం గమనార్హం. ఇంకా ఖరారు కాని విధానపత్రంలోని నిబంధనను ఉపయోగించుకొని కొలీజియం ఈ నిర్ణయం తీసుకున్నది. కలకత్తా హైకోర్టు జడ్జి జ్యోతిర్మయ్ భట్టాచార్య, కేరళ హైకోర్టు జడ్జి అంటోనీ డొమినిక్‌లు వారివారి హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు అవుతారు. వారి రిటైర్మెంట్ చేరువలోనే ఉందనే కారణంగా కొలీజియం ఈ నిర్ణయం తీసుకున్నది. దేశభద్రత కారణంగా ఏవైనా నియామక సిఫారసులను తిరస్కరించే అధికారం కేంద్రానికి దఖలుపర్చే నిబంధనను కొలీజియం వెనుకకు పంపింది. కేంద్రం ఇంకా దీనిపై తన స్పందనను కొలీజియంకు తెలుపలేదు. గుజరాత్ హైకోర్టు జడ్జి అభిలాషకుమారిని మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, పాట్నా హైకోర్టు జడ్జి అజయ్‌కుమార్ త్రిపాఠిని ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, పంజాబ్-హర్యానా హైకోర్టు జడ్జి సూర్యకాంత్‌ను హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, రాజస్థాన్ హైకోర్టు జడ్జి అజయ్ రస్తోగిని త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఎంపిక చేశారు. గువాహటి హైకోర్టు జడ్జి హృషికేశ్ రాయ్‌ని కేరళ హైకోర్టుకు బదిలీ చేయాలని కొలీజియం సిఫారసు చేసింది. అలహాబాద్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా ఉన్న శివకుమార్‌సింగ్‌ను పూర్తిస్థాయి జడ్జిగా నియమించాలని కూడా కొలీజియం తీర్మానించింది.

సుప్రీంకోర్టు జడ్జీలుగా కేఎం జోసెఫ్, ఇందు మల్హోత్రా

ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కేఎం జోసెఫ్, సీనియర్ న్యాయవాది ఇందు మల్హోత్రా సుప్రీంకోర్టు జడ్జీలుగా ఎంపికయ్యారు. సుప్రీంకోర్టు కొలీజియం ఈ మేరకు తీర్మానాన్ని ఆమోదించినట్టు గురువారం అధికారికంగా వెల్లడైంది. తీర్మానం ప్రతిని సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. జోసెఫ్ ఇతర హైకోర్టు జడ్జీలు, ప్రధాన న్యాయమూర్తులకన్నా అన్నిరకాలుగా అత్యంత అర్హుడని కొలీజియం తన తీర్మానంలో పేర్కొన్నది. ఉత్తరాఖండ్‌లో రాష్ట్రపతి పాలన విధించడాన్ని కొట్టివేసి వార్తలలోకెక్కిన జోసెఫ్‌తో పాటు సుప్రీంకోర్టు న్యాయవాది ఇందు మల్హోత్రా ఎంపిక గురించి ఇదివరకే మీడియాలో వార్తలు వచ్చాయి. ఇప్పుడు తీర్మానం వెల్లడితో ఆ వార్తలు నిర్ధారణ అయ్యాయి.

ముహూర్తం

సూర్యోదయం: 6.51 గంటలకు

సూర్యాస్తమయం: 6.08 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, కృష్ణపక్షం విదియ మధ్యాహ్నం 12.55 వరకు తదుపరి తదియ, నక్షత్రం: మఖ మధ్యాహ్నం 12.59 వరకు, తదుపరి పుబ్బ, అమృతఘడియలు: ఉదయం 10.48 నుంచి 12.24 వరకు, రాహుకాలం: ఉదయం 11.05 నుంచి 12.30 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 9.07 నుంచి 9.52 వరకు, తిరిగి మధ్యాహ్నం 12.52 నుంచి 1.37 వరకు, వర్జ్యం: రాత్రి 8.28 నుంచి 10.04 వరకు.
తిరిగి తె. 2.03 నుంచి 3.39 వరకు

లోకం పోకడ





గురువారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ఆర్థికమంత్రి ఈటల రాజేందర్

ఏదీ ప్రజల ముద్ర?

గోరంత కూడా ఇవ్వలేదు

వ్యవసాయం, విద్య, వైద్యం ప్రభావవంతంగా లేవు

మిగతా అన్ని రంగాలకూ మొండిచేయి చూపించారు

కేంద్రబడ్జెట్‌పై ఆర్థికమంత్రి ఈటల అసంతృప్తి

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ ప్రజల ఆకాంక్షలను ప్రతిఫలించే విధంగా లేదని, ప్రజలపై బడ్జెట్ ముద్ర ఏదీలేదని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. 'వ్యవసాయరంగం, విద్య, వైద్యంపై దృష్టి పెట్టినట్టు కనిపించినా.. తగినంత ప్రాధాన్యం లేదు. మిగతా రంగాలను కేంద్రం విస్మరించింది. తెలంగాణ కూడా దేశంలో భాగమే.. ఎంతో అడిగినా గోరంత కూడా ఇవ్వలేదు. రాష్ర్టానికి ఆశించిన నిధులు రాలేదు. బడ్జెట్‌లో కొత్తదనం లేదు' అని ఆయన గురువారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో అసంతృప్తిని వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అమలవుతున్న వివిధ భారీ పథకాల కింద రూ.40వేల కోట్లు కావాలని అడిగితే కేంద్రం పైసా ఇవ్వలేదన్నారు. బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి ప్రాధాన్యమివ్వడం, రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించడానికి చొరవ చూపడం ఆహ్వానించదగ్గ పరిణామమేకానీ ఇతర రంగాలను పూర్తిగా విస్మరించడం సరికాదని చెప్పారు. చాలా రంగాలకు కనీస కేటాయింపులు లేవన్నారు. ప్రగతిశీల కార్యక్రమాలతో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న రాష్ర్టానికి కేంద్రం నుంచి ఆశించిన సహకారం కనిపించలేదన్నారు. పేదలకు పూర్తిస్థాయిలో ప్రయోజనం దక్కేలా నిధుల కేటాయింపులేదన్నారు. వాస్తవానికి తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న పథకాలు అందరికీ మార్గదర్శకంగా నిలుస్తున్నాయని చెప్పారు.

అద్భుత పథకాలకు అండ లేదు..

'మిషన్ కాకతీయకు ఐదువేల కోట్లు, మిషన్ భగీరథకు 19,205 కోట్లు ఇవ్వాలని నీతిఆయోగ్‌ను కోరినం. 88వేల కోట్లతో అతివేగంగా అత్యద్భుతంగా నిర్మిస్తున్న అతి పెద్ద మానవ నిర్మాణం కాళేశ్వరం ప్రాజెక్టుకు కనీసం 10 వేల కోట్ల సాయం కావాలని ఇటీవల ఢిల్లీలో జరిగిన ప్రీ-బడ్జెట్ సమావేశంలో కోరినం. కానీ దేనికీ బడ్జెట్‌లో పైసా రాల్చలేదు' అని మంత్రి మండిపడ్డారు. నాణ్యమైన విద్యను అందించడానికి దేశానికే ఆదర్శంగా గురుకుల విద్యాలయాలను ఏర్పాటుచేస్తున్నాం. నిధులను కేటాయించాలని కోరాం. కానీ కేంద్రం పైసా కేటాయించలేదు' అని అసంతృప్తి వ్యక్తం చేశారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు కేంద్రం ఈసారి బడ్జెట్‌లో రూ.పదివేల కోట్లను కేటాయించడం తెలంగాణ ప్రభుత్వ పథకానికి కొంత సహాయకారిగా ఉంటుందని భావిస్తున్నామని తెలిపారు. యాసంగి, వానకాలం సీజన్లలో రైతుల పంటకు కనీస మద్దతు ధరను అందించడానికి కేంద్ర ప్రభుత్వం రెండువేల కోట్ల వరకు కేటాయించిందని, ఈ సీజన్ నుంచే దానిని వర్తింపజేయాలని కోరారు. పేదల వైద్యం కోసం కేంద్రం బీమా పథకాన్ని ప్రవేశపెట్టడం మంచి నిర్ణయమన్నారు. పేదలకు మెరుగైన వైద్యసేవలను అందించడానికి తమ ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్‌తోపాటు ఆరోగ్యశ్రీ, కేసీఆర్ కిట్ల వంటి పథకాలను అమలుపరుస్తున్నదని గుర్తుచేశారు. ఏకలవ్య పాఠశాలల పేరిట కేంద్రం నిధులివ్వడం ప్రోత్సాహకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. భూగర్భజలాలను పెంపొందించే అంశాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. మిషన్ కాకతీయ వంటి ప్రాజెక్టుల ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడుతున్నామని చెప్పారు.

గ్రామీణానికి వ్యవసాయమే కీలకం

గ్రామీణ ఆర్థికవ్యవస్థ నిలదొక్కుకోవాలన్నా, తలసరి ఆదాయం పెరుగాలన్నా వ్యవసాయరంగం అభివృద్ధి చెందాలని మంత్రి అన్నారు. 'పట్టణాలకు, పల్లెలకు మధ్య ఆర్థిక అంతరం తగ్గాలంటే వ్యవసాయరంగానికి ప్రాధాన్యమివ్వాల్సిన అవసరముంది. ఈ విషయాన్ని గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం దేశంలో ఎక్కడాలేనివిధంగా రైతన్నలకు రూ.17వేల కోట్ల రుణమాఫీ చేసింది. గతంలో వ్యవసాయానికి ఆరుగంటలు కూడా విద్యుత్ రాకపోయేది. మా ప్రభుత్వం 24 గంటలపాటు నిరంతరాయంగా విద్యుత్‌ను అందించి రైతన్నలకు అండగా నిలుస్తున్నది. పంటలకు మద్దతుధర వచ్చేవరకు సరుకులు నిల్వ ఉంచుకునేందుకు వీలుగా 18 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాములను నిర్మించిన ఘనత కేసీఆర్ సర్కార్‌దే' అని చెప్పారు.

గ్రామీణాభివృద్ధిశాఖలో 151 పోస్టుల భర్తీ

అనుమతులిచ్చిన ఆర్థికశాఖ

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలో వివిధ క్యాడర్లలో 151 ఉద్యోగాలను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నేరుగా భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. హైదరాబాద్ మినహా మిగతా 30 జిల్లాల్లో 77 జూనియర్ అసిస్టెంట్, 74 టైపిస్ట్ పోస్టుల ఖాళీల భర్తీకి ఆర్థికశాఖ క్లియరెన్స్ ఇచ్చింది. ఈ మేరకు గురువారం ఆర్థికశాఖ కార్యదర్శి ఎన్ శివశంకర్ ఉత్తర్వులు జారీచేశారు.

1,626 కోట్లు

కేంద్ర బడ్జెట్‌లో ఆయుష్ మంత్రిత్వ శాఖకు రూ.1626 కోట్లు కేటాయించారు.గత బడ్జెట్‌లో ఈ శాఖకు రూ.1429 కోట్లు కేటాయించారు. సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్, సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ హోమియోమెడిసిన్ వంటి చట్టపరమైన, నియంత్రణా సంస్థల కేటాయింపులు ఈసారి భారీగా పెంచారు. స్వయంప్రతిపత్తి సంస్థల కేటాయింపులు 8 కోట్ల నుంచి 9.6 కోట్లకు పెరిగాయి.



- బడ్జెట్‌లో రైల్వేలకు స్థూల కేటాయింపులు రూ. 2.73లక్షల కోట్ల నుంచి రూ. 3లక్షల కోట్లకు పెంపు.
- 3600 కి.మీ రైల్వేలైన్ల పునరుద్ధరణ. 600 స్టేషన్ల అభివృద్ధి.
- ముంబైసబర్బన్ రైల్వేరవాణా వ్యవస్థ విస్తరణకు 17వేలకోట్లు. బెంగళూరులో 160 కిలోమీటర్ల సబర్బన్ పరిధి గుర్తింపు.
- వదోడరలో రైల్వే విశ్వవిద్యాలయం ఏర్పాటుకు చర్యలు.
- అన్ని రైల్వేజోన్లు, రైళ్లలో సీసీ టీవీ కెమెరాలు, వైఫై సౌకర్యం.
- ప్రయాణికులు 25వేలు మించిన స్టేషన్లలో ఎస్కలేటర్లు.
- పెరంబూర్‌లో అధునాతన కోచ్‌ల నిర్మాణ కర్మాగారం.
- రైల్వేల్లో రవాణారంగ కారిడార్ నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ
- 18వేల కిలోమీటర్ల మేర రైల్వేలైన్ డబ్లింగ్ పనులు. 4వేలకు పైగా కాపలాదారులు లేని గేట్ల తొలిగింపు



నాలుగేండ్లు గడిచినా ఇంకా హామీలేనా?

నాలుగేండ్లలో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చడంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది, ఇప్పుడు కొత్త వాగ్దానాలతో ముందుకు వచ్చింది. 'నాలుగేండ్లు గడిచిపోయాయి. ఇంకా రైతులకు కనీస మద్దతు ధరను హామీ ఇస్తూనే ఉన్నారు. వింత పేర్లతో పథకాలు తెస్తూనే ఉన్నారు. వాటికి బడ్జెట్‌లో తగిన నిధులు మాత్రం ఉండడం లేదు. యువతకు ఉద్యోగాలు కల్పించలేకపోయారు. అదృష్టమేమంటే ఈ సర్కారుకు మరో ఏడాది మాత్రమే ఉంది.

ట్విట్టర్‌లో రాహుల్‌గాంధీ

వేతన జీవులకు నిరాశ

40 వేల మినహాయింపు.. ఒక శాతం సెస్ వాయింపు ● క్యాపిటల్ గెయిన్స్‌పై 10 శాతం పన్ను

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: సార్వత్రిక బడ్జెట్‌లో వేతన జీవులకు మరోసారి నిరాశే ఎదురైంది. ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ గురువారం పార్లమెంట్‌కు నివేదించిన బడ్జెట్ 2018-19లో వారికి చెప్పుకోదగ్గ పన్ను ప్రయోజనాలు కల్పించడంలో ఘోరంగా విఫలమవడమే ఇందుకు ప్రధాన కారణం. ఈ పద్దులో జైట్లీ వ్యక్తిగత పన్ను శ్లాబులనుగానీ, రేట్లనుగానీ మార్చకపోవడంతో సగటు వేతనజీవులకు తీవ్ర ఆశాభంగం తప్పలేదు. వ్యక్తిగత ఆదాయం పన్ను రేట్ల విషయంలో వేతనజీవులకు గత మూడేండ్లలో ఎన్నో ప్రయోజనాలను కల్పించామని, కనుక ఈసారి ఈ రేట్లను గానీ, శ్లాబులను గానీ మార్చాలని ప్రతిపాదించడం లేదని జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో స్పష్టంచేశారు. దీంతో సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం జనరంజకమైన బడ్జెట్‌ను ప్రవేశపెడుతుందన్న అంచనాలు తల్లకిందులయ్యాయి. అయితే పన్నులు చెల్లించే వేతన జీవులతో పాటు పెన్షనర్లకు జైట్లీ తన పద్దులో స్వల్ప ఊరటనిచ్చారు. ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్‌కు బదులుగా రూ.40 వేల స్టాండర్డ్ డిడక్షన్ (ప్రామాణిక మినహాయింపు)ను ప్రతిపాదించారు. ఇందుకోసం ప్రభుత్వ ఆదాయంలో రూ.8 వేల కోట్లను 'త్యాగం' చేస్తున్నట్లు ఆయన చెప్పిన జైట్లీ.. మరోవైపు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత విద్యతో పాటు వైద్యం కోసం ప్రభుత్వం విధిస్తున్న సెస్సును 4 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల్లో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు మెరుగైన విద్య, వైద్యాన్ని అందించేందుకు ప్రభుత్వం ఇప్పటికే వ్యక్తిగత ఆదాయం పన్నుతో పాటు, కార్పొరేట్ పన్నుపై 3% సెస్సు విధిస్తున్నది. ప్రస్తుత బడ్జెట్‌లో ఈ సెస్సును మరో శాతం పెంచడం ద్వారా అదనంగా రూ.11 వేల కోట్లు వసూలవుతాయని అంచనా వేస్తున్న అరుణ్ జైట్లీ.. మరోవైపు స్టాక్ మార్కెట్లో పెట్టుబడులపై సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్టీసీజీ)ను ప్రవేశపెట్టారు. దీంతో షేర్ల అమ్మకం ద్వారా లక్ష రూపాయల కంటే ఎక్కువ లాభాన్ని ఆర్జించిన వారు ఆ మొత్తంలో 10 శాతం ఎల్టీసీజీ చెల్లించాల్సి ఉంటుంది.



సీనియర్ సిటిజన్లకు వరాలు

సార్వత్రిక బడ్జెట్‌లో సీనియర్ సిటిజన్లకు అనేక ప్రయోజనాలను కల్పిస్తున్నట్లు జైట్లీ ప్రకటించారు. వడ్డీ రూపంలో వారికి వచ్చే ఆదాయంపై పన్ను మినహాయింపు పరిమితిని ఏడాదికి రూ.50 వేలకు (ఐదు రెట్లు) పెంచుతున్నామని, ఇదే సమయంలో సెక్షన్ 80డీ కింద ఆరోగ్య బీమా ప్రీమియం, వైద్య ఖర్చులపై పన్ను మినహాయింపు పరిమితిని రూ.30 వేల నుంచి రూ.50 వేలకు పెంచుతున్నామని, తీవ్రమైన అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వృద్ధులందరికీ సెక్షన్ 80డీడీబీ కింద ఈ పన్ను మినహాయింపు పరిమితిని లక్ష రూపాయలకు పెంచుతున్నామని ఆయన వెల్లడించారు. సీనియర్ సిటిజన్లకు ఈ పన్ను రాయితీలతో పాటు 'వయో వందన' పథకాన్ని 2020 మార్చి నెలాఖరు వరకూ పొడిగిస్తున్నామని జైట్లీ ప్రకటించారు. ఈ పథకంలో ప్రస్తుతం సీనియర్ సిటిజన్లకు రూ.7.5 లక్షలుగా ఉన్న పెట్టుబడి పరిమితిని రెట్టింపు చేసి రూ.15 లక్షలకు పెంచుతున్నామని, ఈ రాయితీలన్నింటి వలన దేశంలోని వృద్ధులందరికీ అదనంగా రూ.4 వేల కోట్ల మేరకు పన్ను లబ్ధి చేకూరుతుందని ఆయన తెలిపారు.

ఉద్యోగుల సగటు పన్ను రూ.76 వేలు..

2016-17 ఆర్థిక సంవత్సరంలో 1,89 కోట్ల మంది వేతన జీవులు సగటున రూ.76,306 చొప్పున పన్ను చెల్లించగా, ఇదే సంవత్సరంలో 1.88 కోట్ల మంది వ్యాపారులు సగటున రూ.25,753 పన్ను చెల్లించారని జైట్లీ వెల్లడించారు. 2014-15 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి దేశంలో 6.47 కోట్ల మంది పన్ను చెల్లింపుదారులుండగా, 2016-17లో వీరి సంఖ్య 28% పెరిగి 8.27 కోట్లకు చేరుకుందని జైట్లీ తెలిపారు.

బిల్లులు లేకుండానే స్టాండర్డ్ డిడక్షన్

సీబీడీటీ చీఫ్ సుశీల్ చంద్ర స్పష్టీకరణ

పన్నులు చెల్లించే ఉద్యోగులు, పెన్షనర్లు సార్వత్రిక బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.40 వేల స్టాండర్డ్ డిడక్షన్‌ను క్లెయిమ్ చేసుకునేందుకు ఎటువంటి డాక్యుమెంట్లను, బిల్లులను సమర్పించాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు చైర్మన్ సుశీల్‌చంద్ర స్పష్టంచేశారు. 'ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం పన్నులు చెల్లించే ఉద్యోగులు, పెన్షనర్లకు రూ.40 వేల ఫ్లాట్ స్టాండర్ డిడక్షన్‌తో పెద్ద ఊరట కల్పించింది. గతంలో బిల్లులు, డాక్యుమెంట్లు సమర్పించి కొంత మంది కన్వేయన్స్ అలవెన్సును, మరికొంత మంది మెడికల్ అలవెన్సును పొందేవారు. ఇప్పుడు ప్రభుత్వం ఈ అలవెన్సులు, బిల్లులు, డాక్యుమెంట్లను తొలగించి వేతన జీవులకు ఫ్లాట్‌గా రూ.40 వేల స్టాండర్డ్ డిడక్షన్‌ను కల్పించింది. పన్ను చెల్లించే ఉద్యోగులు, పెన్షనర్లు నేరుగా ఈ మొత్తాన్ని క్లెయిమ్ చేసుకోవచ్చు' అని ఆయన పీటీఐకి తెలిపారు. దేశంలో ఆర్థిక నేరాలకు పాల్పడే వారికి గడ్డు రోజులు తప్పవని ఆయన హెచ్చరించారు. అనుమానాస్పద లావాదేవీలను, నల్లధనాన్ని గుర్తించేందుకు అనువైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆదాయం పన్ను విభాగం సముపార్జించుకున్నదని, ఇకమీదట ఆ విభాగం ఆర్థిక నేరాలకు పాల్పడే వారిని వేటాడుతుందని సుశీల్‌చంద్ర స్పష్టంచేశారు. అలాగే పన్ను చెల్లింపుదారుల ఆదాయాన్ని ఆన్‌లైన్‌లో మదింపుచేసే (ఈ-అసెస్‌మెంట్) పథకాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.



ఆగని ఆశల రైలు

రైల్వే బడ్జెట్‌లో తెలంగాణకు నిరాశే

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైల్వే బడ్జెట్‌పై గంపెడాశలు పెట్టుకున్న తెలంగాణ రాష్ట్రానికి నిరాశే ఎదురైంది. ఆశల రైలు తెలంగాణ రాష్ట్రంలో ఆగకుండానే పరుగులు తీసింది. సొంత రాష్ట్రం గుజరాత్‌లోని వడోదరలో రైల్వే యూనివర్సిటీని ఏర్పాటుచేసుకున్న ప్రధాని నరేంద్రమోదీ.. రాష్ట్రానికి మాత్రం మొండిచేయి చూపారు. నల్లగొండ -లింగంగుంట, పెద్దపల్లి- లింగంపేట లైన్ల విద్యుదీకరణకు మంజూరు లభించడం మినహా.. రైల్వే బడ్జెట్‌లో తెలంగాణకు ఆశించిన స్థాయిలో కేటాయింపులు చేయలేదు. ప్రధానమైన కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీకి కేటాయింపులు, రైల్వేలైన్ల ట్రిబులింగ్, డబులింగ్ ప్రస్తావనే లేదు. కొత్త ప్రాజెక్టుల మాటే వినిపించలేదు. కేంద్రం రూ.1,48,528 కోట్లతో రైల్వే బడ్జెట్ ప్రవేశపెట్టగా.. ఇందులో అందరిలాగే తెలంగాణకు అరకొరగా కేటాయింపులు చేసింది. ప్రత్యేక రైల్వేలైన్ విద్యుదీకరణలో మాత్రం కొన్ని కేటాయింపులు చేసింది. ఇందులో నల్లగొండ -లింగంగుంట మార్గంలో 129 కిలోమీటర్లు, పెద్దపల్లి- లింగంపేట లైన్‌లో 83 కిలోమీటర్ల మేరకు విద్యుదీకరణ కోసం మంజూరు లభించింది. తెలంగాణలో రైల్వేకు సంబంధించి ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులు మాత్రమే నడుస్తున్నాయి. వాటికి కూడా నిధుల మంజూరుపై స్పష్టత ఇవ్వలేదు.

రద్దీ స్టేషన్లకు ఎస్కలేటర్లు.. భద్రతకు ప్రాధాన్యం

రోజుకు దాదాపు 25వేల మంది ప్రయాణిస్తున్న రైల్వేస్టేషన్లలో ఎస్కలేటర్లు, భద్రత కోసం వైఫై, రైళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు, 600 ప్రధాన స్టేషన్లలో ఆధునిక సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇందులో సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ, విజయవాడ, కాజీపేట స్టేషన్లు చోటు దక్కించుకున్నాయి.

సబ్సిడీలకు పెద్దపీట

ఆహారం, పెట్రోలియం, ఎరువులకు రూ. 2.64లక్షల కోట్లు



బడ్జెట్‌లో సబ్సిడీలకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. ప్రధానంగా ఆహారం, పెట్రోలియం, ఎరువులకు గతేడాది కంటే 2018-19 బడ్జెట్‌లో నిధులను పెంచింది. ఈ పెంపుదల దాదాపు 15శాతం ఉన్నది. ఈ మూడురంగాలకు కలిపి రూ.2,64, 335.65కోట్లు కేటాయించింది. ఆహార రంగానికి గతేడాది రూ.1,40,281.69కోట్లు కేటాయించగా, ప్రస్తుతం రూ.1,69,323 కోట్లు కేటాయించింది. జాతీయ ఆహార భద్రత పథకం కింద దేశంలో దాదాపు 80కోట్ల మంది లబ్ధిపొందుతున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం నిధులను పెంచింది. అలాగే ఎరువులకు సబ్సిడీ కింద గతేడాది రూ.64,973.5కోట్లు కేటాయించగా ప్రస్తుతం రూ.70,079.85 కోట్లు కేటాయించింది. ఇక పెట్రోలియం సబ్సిడీకి రూ.24,932.8 కోట్లకు పెంచింది. గతేడాది రూ.24,460.48కోట్లు కేటాయించింది.

మొబైల్ ట్రాకింగ్‌కు రూ.15 కోట్లు



దేశంలో మొబైల్ ఫోన్ ట్రాకింగ్ వ్యవస్థను ఏర్పాటుకోసం రూ.15 కోట్లు కేటాయించారు. దీనివల్ల నకిలీ హ్యాండ్‌సెట్ల సంఖ్యను తగ్గించడంతోపాటు, ఫోన్ దొంగతనాలను కూడా తగ్గించగల్గుతామని జైట్లీ వెల్లడించారు. ఇందుకోసం టెలికం విభాగం పరిధిలో కేంద్ర ఉపకరణాల గుర్తింపు రిజిస్టర్ (సీఈఐఆర్)ను ఒకటి ఏర్పాటుచేస్తారు. ఇది చోరీ లేదా పోగొట్టుకొన్న ఫోన్‌కు సంబంధించిన అన్ని సర్వీసులను బ్లాక్ చేస్తుంది. ఒకవేళ ఫోన్‌లో సిమ్‌కార్డును మార్చినా, ఐఎంఈఐ నంబర్‌ను మార్చినప్పటికీ, ఆ ఫోన్‌లో ఏ సర్వీస్ కూడా పనిచేయదు. నెట్‌వర్క్ మార్చినా ప్రయోజనం ఉండదు. ప్రభుత్వరంగ సంస్థ బీఎస్ఎన్ఎల్.. సీఈఐఆర్‌ను పుణెలో ఏర్పాటుచేస్తుంది. వినియోగదారుల ప్రయోజనాలను కాపాడటం, న్యాయపరమైన సహాయాన్ని అందించడం కూడా సీఈఐఆర్ చేస్తుంది. 'మొబైల్ ఫోన్ పోవడం అంటే కేవలం ఆర్థికంగా నష్టం కలుగడమే కాదు.. వ్యక్తిగత జీవితాన్ని నష్టపోవడం. దేశ అంతర్గత భద్రతకు ముప్పువాటిల్లడం' అని బడ్జెట్ డాక్యుమెంట్‌లో పేర్కొన్నారు.

శిక్షణ, సదుపాయాల కల్పనకు 192 కోట్లు

కేంద్ర ప్రభుత్వం సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వశాఖకు బడ్జెట్‌లో రూ.192 కోట్లు కేటాయించింది. అధికారులకు దేశంలోని వివిధ ప్రాంతాలతోపాటు విదేశాల్లో శిక్షణ ఇచ్చేందుకు, వారికి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఈ మేరకు కేటాయింపులు జరిపింది. ఇందులో రూ.75.32 కోట్లను ఢిల్లీకి చెందిన సెక్రటేరియట్ ట్రైనింగ్ అండ్ మేనేజ్‌మెంట్ (ఐఎస్‌టీఎం), ముస్సోరిలోని లాల్‌బహదూర్‌శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్(ఎల్బీఎస్ఎన్ఏఏ) ఏర్పాటుకు సంబంధించిన ఖర్చుల కోసం కేటాయించారు.

నేషనల్ న్యూట్రిషన్ మిషన్‌కు 3 వేల కోట్లు



కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ న్యూట్రిషన్ మిషన్(ఎన్ఎన్ఎం)కు 2018-19 బడ్జెట్‌లో భారీగా కేటాయింపులు జరిగాయి. గతేడాది ఎన్ఎన్ఎంకు రూ.950 కోట్లు కేటాయించగా, ఈసారి రూ.3వేల కోట్లను కేంద్రం సమకూర్చింది. ప్రధానంగా పోషకాహార లోపాన్ని నివారించడం, రక్తహీనతను నిరోధించడం, పిల్లలు ఎక్కువ బరువుతో జన్మించేలా తగుచర్యలు చేపట్టడం కార్యక్రమాలను ఎన్ఎన్ఎం చేపడుతున్నది. 2018-19లో కేంద్ర మహిళా శిశు సంక్షేమశాఖకు కేంద్రం రూ.24,700కోట్లను కేటాయించింది. అందులోఅంగన్‌వాడీ సేవలకు రూ.16,334కోట్లు, పీఎం మాతృవందనయోజన పథకానికి రూ.2400 కోట్లు, బేటీ బచావో బేటీ పఢావో పథకానికి రూ.280 కోట్లు, నిర్భయ నిధికి రూ.500 కోట్లు, బాలల సంరక్షణకు రూ.725 కోట్లు సమకూరుతాయి.


మోడ్రన్ రైల్.. సేఫ్ జర్నీ!

రైల్వేలకు రూ.1.48 లక్షల కోట్లు • సురక్షిత ప్రయాణం, ఆధునిక సదుపాయాలు, రైల్వేల సామర్థ్యం పెంపునకు ప్రాధాన్యం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: రైల్వేలకు ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ రూ.1,48,528 కోట్ల మొత్తాన్ని కేటాయించారు. గతేడాదితో (రూ.1.31 లక్షల కోట్లు) పోల్చితే ఇది 13 శాతం అధికం. ఇంత భారీ మొత్తాన్ని రైల్వేకు కేటాయించటం ఇదే ప్రథమం. దీంట్లో అత్యధిక నిధులను రైల్వేల అభివృద్ధి, ఆధునీకరణకు, సామర్థ్యాన్ని పెంచటానికి ఉపయోగించనున్నామని జైట్లీ వెల్లడించారు. ప్రమాదాలకు తావు లేని సురక్షిత ప్రయాణానికి (సేఫ్టీ ఫస్ట్) తొలి ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. దీంట్లోభాగంగా 'రాష్ట్రీయ రైల్ సంరక్ష కోశ్'కు తగినన్ని నిధులను అందజేస్తామని చెప్పారు. ముంబై, బెంగళూరు వాసులపై వరాల జల్లు కురిపిస్తూ ఆ నగరాల్లో సబర్బన్ రైళ్ల విస్తరణకు భారీ నిధులను ప్రకటించారు. తొలిసారిగా ముంబై రైల్వే విస్తరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు, సరుకురవాణాకు ప్రత్యేక మార్గాల ఏర్పాటు తదితర అంశాలను బడ్జెట్‌ప్రసంగంలో మంత్రి ప్రస్తావించారు.

ముంబైకి బొనాంజా

465 కి.మీ.ల పరిధిలో ఉన్న ముంబై రైల్వేను విస్తరిస్తామని జైట్లీ ప్రకటించారు. ముంబై రైల్వేను విస్తరించటం ఇదే ప్రథమం. రూ.11,000 కోట్ల వ్యయంతో విస్తరణ పనులు చేపడుతామని, దీంట్లోభాగంగా 90 కి.మీ.ల మేర డబుల్‌లైన్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తామని జైట్లీ చెప్పారు. అంతేకాదు, రూ.40,000 కోట్ల వ్యయంతో ముంబై సబర్బన్ రైల్వే వ్యవస్థను మరో 150 కి.మీ.ల మేర విస్తరించటానికి ప్రణాళికలున్నాయని తెలిపారు. ఈ వరాల జల్లు నేపథ్యంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ 'వేడుక జరుపుకో ముంబై' అంటూ ట్వీట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. మరోవైపు, త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న కర్ణాటకకు కూడా జైట్లీ వరాలు కురిపించారు. బెంగళూరులో దాదాపు 160 కి.మీ.ల పరిధిలో రూ.17,000 కోట్ల వ్యయంతో సబర్బన్ రైల్వే వ్యవస్థను ఏర్పాటు చేయటానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.



బడ్జెట్ ప్రసంగంలో కొత్త రైల్వే మార్గాలను ప్రకటించటం ఆనవాయితీ. కానీ ఈసారి దీనికి భిన్నంగా మంత్రి.. ఆ ఊసే తీయలేదు.

పుణె-లోనావాలా 3వ, 4వ రైల్వే లైన్ నిర్మాణం కోసం రూ.4,253 కోట్లను కేటాయించారు.

రైల్వే బడ్జెట్‌ను విడిగా ప్రవేశపెట్టే 92 ఏండ్ల సంప్రదాయాన్ని మోదీ ప్రభుత్వం గతేడాది పక్కనపెట్టి.. సాధారణ బడ్జెట్‌లో భాగంగానే రైల్వే బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే.

రైల్వేలకు రూ.1.48 లక్షల కోట్లను కేటాయిస్తున్నామని బడ్జెట్ ప్రసంగంలో జైట్లీ ప్రకటించారు. అయితే, రైల్వే ఉన్నతాధికారులకు అందిన సమాచారంలో మాత్రం రూ.1.46 లక్షల కోట్ల మొత్తాన్ని కేటాయిస్తున్నట్లు పేర్కొనటంతో కొంతసేపు గందరగోళం నెలకొంది.

అంతర్జాతీయ స్థాయిలో కొత్త రైళ్లు

'రైల్వేల సామర్థ్యాన్ని పెంచటానికి నిధుల్లో అత్యధికభాగాన్ని ఉపయోగించనున్నాం. దీంట్లోభాగంగా 18,000 కి.మీ.ల రైల్వే మార్గం డబ్లింగ్, మూడవ, నాలుగవ లైన్ నిర్మాణ పనులు, 5,000 కి.మీ.ల పరిధిలో గేజ్ మార్పిడిని చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ పనులతో రైల్వేల సామర్థ్యానికి అవరోధంగా ఉన్న అడ్డంకులన్నీ తొలిగిపోయి దాదాపుగా దేశంలోని యావత్తు రైల్వే మార్గం బ్రాడ్‌గేజ్‌గా మారుతుంది. రానున్న ఏడాదిలో 3,600 కి.మీ.లకుపైగా రైలుమార్గం పునరుద్ధరణ పనులను చేపట్టనున్నాం. కాపలాలేని 4,267 బ్రాడ్‌గేజ్ రైల్వేక్రాసింగ్‌లను వచ్చే రెండేండ్లలో తొలిగించనున్నాం. పెరంబూర్ (చెన్నై)లోని 'ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ'లో ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా కొత్త రైళ్ల తయారీ కొనసాగుతున్నది. ఈ రైళ్లలో అత్యాధునిక సదుపాయాలుంటాయి. వీటిని 2018-19 నుంచి ప్రవేశపెడుతాం. సరుకు రవాణా కోసమే ప్రత్యేకించిన కారిడార్లను (మార్గాలను) ఏర్పాటు చేయనున్నాం.విద్యుదీకరణను ప్రాధాన్య అంశంగా చేపట్టనున్నాం. దీనికి అవసరమైన నిధుల కోసం ప్రత్యామ్నాయ మార్గాలను రైల్వే అనుసరిస్తుందని భావిస్తున్నాం. వైఫై, సీసీటీవీ సదుపాయాలను క్రమంగా అన్ని రైళ్లలో ప్రవేశపెట్టనున్నాం. 25 వేల మందికిపైగా ప్రయాణికులు వచ్చిపోయే అన్ని రైల్వేస్టేషన్లలో ఎస్కలేటర్లను ఏర్పాటుచేయనున్నాం. ఆధునీకరణ కోసం 600 స్టేషన్లను ఎంపిక చేశాం. సిగ్నలింగ్ వ్యవస్థ ఆధునీకరణ, పొగమంచు సమయంలో ప్రమాదాలు జరుగకుండా తగిన సాంకేతికపరమైన జాగ్రత్తలు చేపట్టటం, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను కల్పించటం, సురక్షిత ప్రయాణానికి అవసరమైన చర్యలు తీసుకోవటం తదితర అంశాలకు ఈ ఏడాదిలో ప్రాధాన్యం ఇస్తాం. గుజరాత్ వడోదరలో రైల్వే విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తాం. 12వేల వ్యాగన్లు, 5,160 కోచులు, 700 ఇంజిన్లను సమకూర్చుకుంటున్నాం' అని జైట్లీ వెల్లడించారు. రైల్వేకి జరిపిన కేటాయింపులపై రైల్వేమంత్రి పీయూష్‌గోయల్ హర్షం వ్యక్తంచేశారు. నూతన భారత్‌కు తగిన విధంగా నూతన రైల్వేలను నిర్మించటానికి ఈ బడ్జెట్ ఊతమిస్తుందన్నారు. 'సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్' లక్ష్యంలో భాగంగా అన్ని సంక్షేమ పథకాలను బడ్జెట్ సమగ్రంగా కలుపుకొని వెళ్లిందన్నారు.

స్వచ్ఛ భారత్

మరో రెండు కోట్ల టాయిలెట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: స్వచ్ఛ భారత్ మిషన్ (ఎస్బీఎం) కింద 2018-19 ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా సుమారు రెండు కోట్ల మరుగుదొడ్లు నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. ఇప్పటికే దేశవ్యాప్తంగా ఆరు లక్షలకు పైగా టాయిలెట్లను నిర్మించామని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. మహిళలు, విద్యార్థినుల గౌరవాన్ని కాపాడటంతోపాటు మొత్తం కుటుంబ ఆరోగ్య పరిరక్షణపైనే దృష్టి సారించామన్నారు. తద్వారా యావత్ దేశాన్ని బహిరంగ మల విసర్జన రహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దాలన్నదే తమ లక్ష్యమని జైట్లీ ప్రకటించారు. వచ్చే 2019 అక్టోబర్ రెండో తేదీ నాటికి భారత్ కాలుష్య రహిత ప్రాంతాలు తీర్చిదిద్దడమే ఎస్బీఎం లక్ష్యం. ఇక ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు కొత్తగా 'గోబర్ – ధన్ (గాల్వనైజింగ్ ఆర్గానిక్ బయో ఆర్గానిక్ రీసోర్సెస్ ధన్)' అనే పేరుతో కొత్త పథకాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. రైతులు ఇండ్లలో పశువుల పేడ, పంట పొలాల్లో ఘన వ్యర్థాలను కలిపి కంపోస్టు తయారు చేస్తారు. దీంతో గ్రామీణుల వంట అవసరాలు తీర్చే బయోగ్యాస్, నేచురల్ గ్యాస్ తయారీకి ఉద్దేశించిన పథకమే గోబర్ – ధన్' పథకం. ఇక గంగానదీ ప్రక్షాళనకు అమలుచేస్తున్న నమామీ గంగ కార్యక్రమంలో 187 ప్రాజెక్టులకు 47 ప్రాజెక్టులు పూర్తయ్యాయి. గంగానదీ పరివాహక ప్రాంతంలోని 4,465 గ్రామాలను బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలుగా ప్రకటించారు.


మంత్రుల రవాణా, భత్యాల్లో కోత

రూ.400 కోట్ల నుంచి రూ.295 కోట్లకు తగ్గింపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: కేంద్ర మంత్రుల రవాణా, ఇతర భత్యాలపై బడ్జెట్‌లో 29 శాతం కోత విధించారు. క్యాబినెట్ మంత్రులు, సహాయమంత్రులు, మాజీ ప్రధానమంత్రుల వేతనాలు, రవాణా ఖర్చులకు 2018-19 బడ్జెట్‌లో రూ.295.81 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో రూ.418.49 కోట్లు కేటాయించారు. పీఎంవో బడ్జెట్ మొత్తాన్ని కొద్దిగా పెంచారు. క్యాబినెట్ సెక్రటేరియట్, రసాయన ఆయుధాల ఒప్పందం పరిపాలనా పరమైన ఖర్చులకోసం రూ.59.81 కోట్లు కేటాయించారు.

'9000 కిలోమీటర్ల రహదారి నిర్మాణం పూర్తిచేస్తాం'

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: జాతీయ రహదారుల నిర్మాణంలో తమ ప్రభుత్వం గొప్ప ప్రగతిని సాధించిందని అరుణ్‌జైట్లీ చెప్పారు. ముందుగా చెప్పినట్లు 2017-18లో 9వేల కిలోమీటర్ల రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేస్తామని తెలిపారు. అంతేగాక రహదారుల కనెక్టివిటీకి సంబంధించిన భారతమాల పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నదని, ఈ పథకం కింద మొదటి విడతలో రూ.5.35లక్షల కోట్లను ఖర్చు చేయనున్నామని, తద్వారా దాదాపు 35,000కిలోమీటర్ల రహదారుల కనెక్టివిటీని పూర్తి చేస్తామన్నారు. కేంద్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీ మాట్లాడుతూ ఈ బడ్జెట్ పేదలు, ప్రజల అనుకూల బడ్జెట్ అని చెప్పారు.



దేశంలో సాధారణ రబ్బర్ స్లిప్పర్లను వేసుకునే వారు కూడా విమానంలో ప్రయాణం చేసేట్లు చేయటమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. ఇప్పుడున్న మన విమానాశ్రయాల సామర్థ్యాన్ని ఐదు రెట్లు పెంచుతున్నాం. విమాన ప్రయాణం అందరికీ అందుబాటులోకి తెస్తున్నాం.

అరుణ్ జైట్లీ, కేంద్ర ఆర్థిక మంత్రి

మేం భారత్‌తో సంబంధాలను మరింత విస్తృతపర్చుకునే దిశగా పయణిస్తున్నాం. భారత్‌లో మోదీ నాయకత్వంలో దూకుడుగా జరుగుతున్న పాలనాపరమైన సంస్కరణలపై ట్రంప్ చాలా సంతోషంగా ఉన్నారు. అమెరికా తన నిబద్ధతను భారత్‌పై మరింతగా ప్రసరిస్తుంది. ఇరుదేశాల సంబంధాలకు ఆకాశమే హద్దు.

నిక్కీ హేలీ, యూఎన్‌ఓలో అమెరికా రాయబారి



చరిత్రలో నేడు



1909
ప్యారిస్‌లో 'ఫ్యూచరిస్ట్ మ్యానిఫెస్టో'ను ప్రకటించిన ఇటలీ రచయిత మారినెట్టి.

1932
జెనీవాలో నిరాయుధీకరణ లక్ష్యంగా 60 దేశాల సమావేశం.





1933
జర్మన్ ఛాన్స్‌లర్‌గా పదవి చేపట్టిన రెండో రోజే పార్లమెంటును రద్దుచేసిన హిట్లర్.

పశ్చిమ ఉత్తరప్రదేశ్ కాస్‌గంజ్ జిల్లాలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా జరిగిన ఘటనలు ప్రమాదకరమైనవి. కొంతమంది ప్రభుత్వ అనుమతి లేకున్నా మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించి మైనార్టీలు ఎక్కువగా ఉండే ప్రాంతంలో రెచ్చగొట్టే నినాదాలు చేయటం తీవ్ర అభ్యంతరకరం. ఆ సందర్భంగా కొందరు తుపాకీతో కాల్పులకు దిగటం, ఒక వ్యక్తి మరణించటం శాంతి భద్రతల దుస్థితికి నిదర్శనం. సీఎం యోగీ ఆదిత్యనాథ్ ప్రతి పౌరునికి రక్షణ కల్పిస్తుందని హామీ ఇవ్వటం, దోషులను శిక్షిస్తామనటం ఆహ్వానించదగినది. ఈ ఘటనలపై నిష్పాక్షిక ఇచారణ జరుపాలి. శాంతి భద్రతలను కాపాడాలి.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

క్యాపిటల్ హిల్‌లో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ తాను సాధించిన విజయాలను ఏకరువు పెట్టారు. ఈ ఏడాది కాలంలో సాధించిన చిన్న చిన్నవాటినే ఘన విజయంగా చెప్పుకున్నారు. ఇప్పటికే 'ట్విట్టర్ ట్రంప్'గా పిలువబడుతున్న ట్రంప్ సాధించినవన్ని ట్విట్టర్‌లోనే ఉన్నాయని ఎద్దేవా చేస్తున్నారు. ఇప్పటికే వలసలపై చేసిన విధాన నిర్ణయ ప్రకటన ప్రకంపనలు సృష్టిస్తున్నది. సొంత పార్టీ నుంచే ట్రంప్ పనితీరుపై వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఈ నేపథ్యంలో క్యాపిటల్ హాల్ ప్రసంగం పట్ల అమెరికా ఇంటా, బయటా విశ్వసనీయతను కోల్పోయింది.

ది హిందూ

ఆశనిరాశల బడ్జెట్

దేశవ్యాప్తంగా ఎంతో ఆసక్తిని రేకెత్తించిన కేంద్ర బడ్జెట్ సాదాసీదాగా ఉండి నిరాశపరిచింది. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ అమలు వంటి కీలకమైన నిర్ణయాలు తీసుకున్న నేపథ్యంలో కొత్తగా బడ్జెట్‌లో కనిపించేది ఏమీ లేదు. ప్రభుత్వం ఆశించిన రీతిలో పన్ను చెల్లింపుదారుల సంఖ్య భారీగా పెరిగిందనేది ఆర్థిక సర్వేలోనే ప్రభుత్వం వెల్లడించింది. కొన్నేండ్లుగా మధ్యతరగతిపై పన్నుల భారం మోపుతూ కార్పొరేట్ ట్యాక్స్‌ను తగ్గించే పోకడ కనిపిస్తున్నది. ఇదే క్రమంలో చిన్న పరిశ్రమలకు ఈసారి 25 శాతం కార్పొరేట్ ట్యాక్స్ తగ్గిపోయింది. వ్యవసాయ, గ్రామీణ రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఆర్థికమంత్రి జైట్లీ తమ బడ్జెట్ ప్రసంగంలో చెప్పుకున్నారు. కానీ ఈ వ్యవసాయ రంగ సంక్షోభానికి తగిన రీతిలో పరిష్కారాలు సూచించలేక పోయారు. బడ్జెట్‌లో జనరంజక విధానాలు పెద్దగా లేనప్పటికీ, పేదలకు వైద్య బీమా ప్రపంచంలోనే అతి పెద్దదిగా చెబుతున్నారు. కానీ ఇదీ ప్రజల అనారోగ్య సమస్యకు తగిన చికిత్స కాదు. 125 కోట్లకు పైగా ఉన్న దేశ జనాభాలో అత్యధిక శాతం పేదలే. వీరికి వైద్యం అందుబాటులోకి తేవడం సభ్య సమాజ లక్షణం. ప్రజారోగ్య వ్యవస్థ పటిష్ఠం చేయడం ద్వారానే ఇది సాధ్యపడుతుంది. కానీ పేదలకు వైద్యం పేర వసూలు చేసే ప్రజాధనం సర్కార్ దవాఖానలను బలోపేతం చేసే బదులు ప్రైవేట్ రంగాన్ని పెంచి పోషిస్తాయనడంలో సందేహం లేదు.

వ్యవసాయరంగాన్ని మెరుగుపరుచడానికి, గ్రామీణ ప్రాంత అభ్యున్నతికి వీలుగా 14. 34 లక్షల కోట్లు ప్రకటించినట్టు ఆర్థిక మంత్రి జైట్లీ బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. ఉపాధి కల్పన, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలు, గ్రామీణ మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు జైట్లీ వెల్లడించారు. దేశవ్యాప్తంగా 22 వేల సంతలను మెరుగుపరుచడానికి రెండు వేల కోట్లు, వ్యవసాయ రవాణా ఏర్పాట్లకు ఐదు వందల కోట్లు కేటాయిస్తున్నట్టు తెలిపారు. వ్యవసాయ రుణాల కోసం పదకొండు లక్షల కోట్ల మేర కేటాయిస్తున్నట్టు కూడా ఆర్థికమంతి వెల్లడించారు. 96 జిల్లాల్లో నీటిపారుదల కొరత తీర్చడానికి 2,600 కోట్లు కేటాయించారు. ఈ ప్రతిపాదనలన్నీ ఆశించదగినవే అయినప్పటికీ, తరిచిచూస్తే సంతృప్తికరంగా లేవు. తీవ్రస్థాయిలో ఉన్న వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించగల సమగ్ర చర్యలు ఇందులో లేవు. 2022 నాటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లవుతుందని, అప్పటివరకు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని ప్రధాని మోదీ పిలుపు ఇచ్చారని జైట్లీ గుర్తుచేశారు. కానీ గత నాలుగేండ్ల మోదీ పాలన గమనించినా, తాజా బడ్జెట్‌ను పరికించినా మోదీ ఈ లక్ష్యాన్ని సాధించగల సూచనలు కనిపించడం లేదు. 86 శాతం బక్క రైతులేనని చెబుతున్నప్పుడు వారి అభివృద్ధికి అనుసరించే వ్యూహమేమిటో స్పష్టంగా చెప్పలేదు. యాసంగి పంటకు ఉత్పత్తి వ్యయానికి ఒకటిన్నర రెట్లు కనీస మద్దతు ధర ఇచ్చే ఏర్పాటు చేస్తామని అన్నారు. కానీ దానికి అనుసరించే విధానంపై కసరత్తు చేసినట్టు కనిపించడంలేదు. కరువు ప్రాంతాల పరిస్థితి గమనిస్తే నీటి పారుదల కేటాయింపులు ఏమూలకూ సరిపోవు. రైతుకు గిట్టుబాటు ధర రావడం ఎట్లా అనేదే అసలు సమస్య. పెట్టుబడి ఖర్చు, నిర్వహణ, దిగుబడి, నిలువ, రవాణా, మార్కెట్ హెచ్చు తగ్గుల వంటి అనేక అంశాలతో ముడిపడి ఉన్న అంశమిది. నీటి సౌకర్యం, విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండటం, పెట్టుబడి తోడ్పాటు, రుణాలు అందించడం మొదలైన నిర్దిష్ట చర్యలతో కూడిన వ్యూహం లేకుండా కేటాయింపులు ఫలితాలను ఇవ్వవు.

వ్యవసాయరంగంలో యాంత్రీకరణ ప్రవేశించి, సామూహిక క్షేత్రాలకు రంగం సిద్ధమవుతున్నది. ప్రచ్ఛన్న నిరుద్యోగాన్ని రూపుమాపడం, మానవ వనరుల సంపూర్ణ వినియోగం, వలసలు లక్ష్యంగా చూస్తే సమాజంలో సగం ఉండే మహిళల ఉపాధి కల్పన ప్రాధాన్యం పొందుతున్నది. స్వయం సహాయక బృందాలు సంప్రదాయ జీవనోపాధి నుంచి మహిళలను బయటపడేసి, ఆధునిక ఆర్థిక వ్యవస్థలో భాగం చేయడానికి బాట వేయాలె. ఉత్పత్తి, మార్కెటింగ్ వంటి విభిన్న రంగాలలో ఈ బృందాల ప్రాధాన్యం విస్మరించలేనిది. కానీ తాజా బడ్జెట్ వీటికి తగిన ప్రాధాన్యాన్ని ఇవ్వడంలో విఫలమైంది.

వ్యవసాయరంగం నుంచి, గ్రామీణ ఉపాధిని విడదీసి చూడలేం. వ్యవసాయరంగంలో యాంత్రీకరణ ప్రవేశించి, సామూహిక క్షేత్రాలకు రంగం సిద్ధమవుతున్నది. ప్రచ్ఛన్న నిరుద్యోగాన్ని రూపుమాపడం, మానవ వనరుల సంపూర్ణ వినియోగం, వలసలు లక్ష్యంగా చూస్తే సమాజంలో సగం ఉండే మహిళల ఉపాధి కల్పన ప్రాధాన్యం పొందుతున్నది. స్వయం సహాయక బృందాలు సంప్రదాయ జీవనోపాధి నుంచి మహిళలను బయటపడేసి, ఆధునిక ఆర్థిక వ్యవస్థ లో భాగం చేయడానికి బాట వేయాలె. ఉత్పత్తి, మార్కెటింగ్ వంటి విభిన్నరంగాలలో ఈ బృందాల ప్రాధాన్యం విస్మరించలేనిది. కానీ తాజా బడ్జెట్ వీటికి తగిన ప్రాధాన్యాన్ని ఇవ్వడంలో విఫలమైంది. 2014లో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి గతేడాది వరకు వెల్లడైన గణాంకాల ప్రకారం చూస్తే- గ్రామీణ ప్రాంతంలో వివిధ రాష్ట్రాలలో తీవ్ర అనిశ్చితి ఉన్నది. వ్యవసాయ సంబంధ ఆందోళనలు 2015లో 65, 255 ఘటనలు సాగితే 2016 నాటికి 61, 796కు పెరిగాయి. ఉత్తరప్రదేశ్, బీహార్, గుజరాత్, హర్యానా, మహారాష్ట్ర, తమిళనాడు మొదలుకొని దక్షిణాది రాష్ట్రాల వరకు పలుచోట్ల రైతుల ఆందోళనలు చోటుచేసుకున్నాయి. ఇవి పం టకు గిట్టుబాటు ధర అని కాకుండా, అనేక రూపాల్లో పెల్లుబుకుతున్నాయి. మరాఠాల ఆవేదనకు, పటీదార్లు, జాట్లు రిజర్వేషన్ల కోసం ఆందోళన చేయడానికి కూడా వ్యవసాయ సంక్షోభంతో లంకె ఉన్నది. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రతిపాదనల ద్వారా వ్యవసాయ, గ్రామీణ, ఉపాధి రం గాలపై ప్రత్యేక దృష్టిసారించడం అభినందనీయమే. అయితే కేటాయింపులతో సరిపుచ్చుకోకుండా, సమస్యను మరింత సాకల్యంగా అర్థం చేసుకొని శాశ్వత పరిష్కారానికి పూనుకోవడం అవసరం.

సందర్భం

జన జాతర

పున్నం నాడే నేల ఈనినట్టు
ఆకసాన సుక్కలు నడిసొచ్చినట్టు
సంద్రంల యిసుకకు
రెక్కలొచ్చినట్టు
వనమంతా జనం
జనంతో పులకించి వనం

ఒలికిన రవుతం
వొరుదలై పారి
జంపన్నవాగై
అమ్మల ఆగమనంతో..
వాగైపోటెత్తి పుష్కరమైతది

చిలుకల గుట్టల
కొలువైన అమ్మ
కుంకుమ బరిణై

నరవాహనమెక్కి
గద్దెకొత్తది

కన్నెపల్లిల
నెరిసిన బిడ్డకు
ఎదురుకోళ్ళు
స్వాగతంబల్కి
గద్దెన నిలవెట్టె

ఆలుమగలు పిల్లజెల్ల
ఆనందమె జాతర
దుఃఖాలపాతర

ముడుపులు మొక్కులతో
నిలువెత్తు బంగారం

నమ్మకమే జాతర

రందులన్ని మర్సిపోయి
మందేసి చిందేసే..
గిరిజనుల జాతర

అమ్మల అభయంపొంది
వీరత్వం నింపుకొని
వనానికి సాగనంపి
మూడేళ్ళ కట్టాలను ఎదురొడ్డి
పోరాడేందుకు తిరిగొచ్చే
బహుజనుల జాతర
ఇది మేడారం జాతర

– వడ్లకొండ దయాకర్
9440427968

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

న్యాయం



మంగారి రాజేందర్

అవార్డుల్లో అందని న్యాయం

భారత రాజ్యాంగం మనల్ని సజీవంగా ఉంచుతున్న సాధనం. అందరికీ రక్షణను ఇస్తున్నది రాజ్యాంగమే. అధికారంలోకి వచ్చిన ప్రతి వ్యక్తి రాజ్యాంగం మీద ప్రమాణం చేస్తారు. రాజ్యాంగానికి లోబడి తన విధులను నిర్వర్తిస్తానని చెబుతారు. ఆ విధంగా విధులు నిర్వహించడంలో, రాజ్యాంగం సూచించిన దార్శనికతను గమనించడంలో, ఆ దిశగా ప్రయాణం చేయడంలో విఫలం అవుతుంటారు.

ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు ప్రాథమిక విధులనేవి అత్యంత ముఖ్యమైనవి. ప్రాథమిక హక్కులు ఆదేశిక సూత్రాలు రాజ్యాంగంలో ముందుగానే పొందుపరిచారు. ప్రాథమిక విధులను 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 1976 వ సంవత్సరంలో రాజ్యాంగంలో చేర్చారు.


ప్రాథమిక హక్కులనేవి భారత ప్రజల మౌలిక హక్కులు. రాజ్యాంగంలో మూడవ విభాగంలో వీటిని పొందుపరిచారు. పుట్టిన ప్రదేశం, మతం, కులం, జాతి, లింగతా (జెండర్) లాంటి విషయాలతో సంబంధం లేకుండా ఈ హక్కులు దేశ ప్రజలందరికీ వర్తిస్తాయి. ఇందులో కొన్ని విదేశీయులకు కూడా వర్తిస్తాయి. ఈ హక్కులకు భంగం వాటిల్లినప్పుడు ఈ హక్కుల అమలు కోసం పరిమితులకు లోబడి కోర్టులకు వెళ్ళే అవకాశం వుంది.

ఆదేశిక సూత్రాలనేవి ప్రభుత్వ పాలనలో, శాసనాల తయారీలో ప్రత్యేకమైన పాత్రను పోషిస్తాయి. వీటిని రాజ్యాంగంలోని నాలుగవ పార్టులో పొందుపరిచారు. ఈ ఆదేశిక సూత్రాల అమలుకోసం కోర్టులకు వెళ్ళే అవకాశం లేదు. అయితే ఇవి చాలావరకు ప్రాథమికహక్కులలో మిళితమై ఉన్నాయి. కోర్టులు ఈ విషయాన్ని చాలా కేసుల్లో స్పష్టం చేశాయి.

ఇవి కాకుండా 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 4-ఎ పార్టును రాజ్యాంగంలో పొందుపరిచారు. ఇందులో ప్రాథమిక విధులను పేర్కొన్నారు. దేశభక్తిని పెంపొందించే విధంగా ఈ విధులు పనిచేస్తారు. అత్యున్నత ప్రమాణాల సాధన కోసం ప్రతిపౌరుడు పరిశ్రమించాలని రాజ్యాంగంలోని 51ఎ(జె) అధికరణ చాటుతుంది. ఈ విషయం తెలియని వ్యక్తులు ఎందరో. రేపటితరం ఉజ్వల భవిష్యత్తు కోసం శ్రమించిన ఎందరినో ఈ సంవత్సరం పద్మ అవార్డులు దరించాయి.

ఈ సంవత్సరం 85 మందికి పద్మ అవార్డులను ప్రభుత్వం ప్రకటించింది. 3 పద్మ విభూషణ్, 9 పద్మభూషణ్, 73 పద్మశ్రీ అవార్డులను ప్రభుత్వం ప్రకటించింది. అందులో 16 మంది విదేశీయులు. ముగ్గురికి చనిపోయిన తర్వాత ఈ అవార్డులను ప్రకటించారు. భారతదేశంలో కూడా చాలామంది గొప్పవాళ్ళకు ఈ అవార్డులను ప్రకటించారు, సంతోషం. అయితే అలాంటి గొప్పవాళ్ళ తెలంగాణలో ఒక్కరు కూడా కన్పించకపోవడం బాధను కలిగిస్తుంది.

మౌలిక సౌకర్యాలు లేవన్న సాకుగా బాధ్యతలను దులిపే ఉపాధ్యాయ లోకానికి కనవిప్పు కలిగే విధంగా చేసిన అరవింద్ గుప్తాకు పద్మశ్రీ ఇవ్వడం, పశ్చిమబెంగాల్‌లో మానవతా వైద్యశాలను నెలకొల్పిన సుభాషిణీ మిస్త్రీకి, 15 వేల మందికి సహజ కాన్పులు చేసిన 97 సంవత్సరాల సూలగిత్తి నరసమ్మకి, యోగాజ్ఞానం ద్వారా జీవన ఆరోగ్యాన్ని ప్రపం



చవ్యాప్తం చేసిన యోగని నన్మమ్మల్, గిరిజనుల బాగు కోసం తమ జీవితాలను ధారబోసిన అభయ్ బంగ్ దంపతుల లాంటి వ్యక్తులు స్ఫూర్తి ప్రదాతలు.

ప్రధాని నరేంద్ర మోదీ చెప్పినట్టు సుభాషిణీ మిస్త్రీ, లక్ష్మీ కూటీ, బాజూ శ్యామ్, సీతవ్వ బొడ్డటీ, అరవింద్ గుప్తాలు అసమాన్య సామాన్యులే. సిఫార్సు లేని అసామాన్యులకు పద్మ అవార్డులు వచ్చాయి. నిజమే, సంతోషం. తెలంగాణలో కూడా అసామాన్య సామాన్యులు ఎం దరో. అలాంటి వాళ్ళనే తెలంగాణ ప్రభుత్వం సిఫార్సు చేసింది. సిఫార్సు వున్నా తెలంగాణలోని అసామాన్య వ్యక్తులకు పద్మ అవార్డులు రాకపోవడం విషాదం.

రష్యా భారత దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడటానికి కృషిచేసిన రష్యన్ దేశస్థుడు అలెగ్జాండర్ కడాకిన్‌కు, నేపాల్ నేత్ర వైద్యుడు సందూక్ రూయట్, నాట్యాచార్యుడు రామ్లిబిన్ ఇబ్రహీమ్‌కు, శివాలయ పునర్నిర్మాణానికి కృషిచేసిన లావోస్ నివాసి బౌన్‌లాప్ కియోన్గాకు, సౌదీ అరేబియాలో మొదటి యోగా టీచర్ నౌవప్ మార్వాయ్‌కు అవార్డులను ఇవ్వడం ఆనందం కలిగించే అంశాలే.

తెలంగాణలో ఇలాంటి కృషిచేసిన వ్యక్తులు ఎందరో. అలాంటిది ఒకరు కూడా కనిపించకపోవడం బాధ కలిగించే అంశం. ఈ అవార్డులను ప్రకటించిన వెంటనే కరీంనగర్ పార్లమెంట సభ్యులు బి.వినోద్‌కుమార్ తన అసంతృప్తిని వెలిబుచ్చుతూ ప్రధానమంత్రి మోదీకి లేఖను రాశారు. అన్ని ప్రాంతాల వ్యక్తులను గుర్తించాలని ఆ లేఖలో ఆయన పేర్కొన్నారు. తెలంగాణ నుంచి ఒక్కరిని కూడా అవార్డుకు ఎంపిక చేయకపోవడం విషాదకరమని ఆయన పేర్కొన్నారు. అవార్డుకు వ్యక్తులను ఎంపిక చేసే విచక్షణాధికారం కమిటీకి వున్నప్పటికీ తెలంగాణ ప్రభుత్వం సిఫార్సు చేసిన వ్యక్తులకు ఇవ్వకపోవడం, వారి జీవిత కృషిని పరిగణనలోకి తీసుకోకపోవడం శోచనీయమని, ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం అప్‌సెట్ అయ్యిందని ఆయన తన లేఖలో పేర్కొన్నట్టు వార్తలు వచ్చాయి.

అన్ని ప్రాంతాలు వ్యక్తులను గుర్తించాలని పేర్కొనడంలో రాజ్యాంగ స్ఫూర్తి వుంది. భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రం 39 (బి) ప్రకారం దేశ సంపద, దేశ వనరుల యాజమాన్యం అందరికీ అందేట్టుగా చూడాలి. దేశ వనరులు అన్న పదానికి విస్తృతార్థం ఇస్తే అది పద్మ అవార్డులకు కూడా వర్తిస్తాయి.

ప్రధాని నరేంద్ర మోదీ చెప్పినట్టు సుభాషిణీ మిస్త్రీ, లక్ష్మీ కూటీ, బాజూ శ్యామ్, సీతవ్వ బొడ్డటీ, అరవింద్ గుప్తాలు అసమాన్య సామాన్యులే. సిఫార్సు లేని అసామాన్యులకు పద్మ అవార్డులు వచ్చాయి. నిజమే, సంతోషం. తెలంగాణలో కూడా అసామాన్య సామాన్యులు ఎం దరో. అలాంటి వాళ్ళనే తెలంగాణ ప్రభుత్వం సిఫార్సు చేసింది. సిఫార్సు వున్నా తెలంగాణలోని అసామాన్య వ్యక్తులకు పద్మ అవార్డులు రాకపోవడం విషాదం. దేశ వనరులు, దేశ సంపద దేశంలోని అందరికీ అందే విధంగా పార్లమెంట్ సభ్యులు వినోద్‌కుమార్, తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొనిరావాలి.

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుల్లో కూడా వివక్ష కొనసాగుతూ వస్తున్నది. ఈ విషయాన్ని కూడా తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఈ విషయం గురించి ఓ మిత్రునితో చర్చించినప్పుడు అతను ఇలా అన్నాడు.

'ఇంటి పెద్ద ఏదైనా పంచేటప్పుడు అందరికీ న్యాయం చేయాలి'
యోగ్యత ఉన్నప్పుడు కూడా న్యాయం చేయకపోతే ఎలా..?

(వ్యాసకర్త: గతంలో జిల్లా, సెషన్స్ జడ్జీగా పనిచేశారు)

కేటాయింపుల్లో సహేతుకత ఎంత?

జాతీయం

ఆకార్ పటేల్

జనవరి 26న భారత గణతంత్ర దినోత్సవ ప్రదర్శనలో భారత సరిహద్దు దళాలు (బీఎస్ఎఫ్) ప్రదర్శించిన ఒంటె ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మన ఆయుధ సంపత్తి, శక్తిని ప్రదర్శించే ఆ ప్రదర్శన మన శక్తి సామర్థ్యాలకు ఒక ప్రతీక. ఆ ఒంటె సాయంతోనే గుజరాత్, రాజస్థాన్ సరిహద్దు ప్రాంత ఎడారిలో టెర్రరిస్టుల చొరబాటును సమర్థంగా మన బలగాలు ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో మన ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రవేశపెట్టాడు. ఆయన ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రవేశపెట్టినది ఏదైనా ఉన్నదంటే అది రక్షణ బడ్జెట్ మాత్రమేనని చెప్పవచ్చు. ఎందుకంటే దేశంలోని రాజకీయపార్టీలన్నీ ఒకే మాటగా నిలిచేది ఒక రక్షణ వ్యవహారాల విషయంలో మాత్రమే. కాబట్టి ఎలాంటి ఒత్తిడిలు, విమర్శలు లేకుండా రక్షణ బడ్జెట్ రూపుదిద్దుకుంటున్నది.

అయితే ఈసారి మాత్రం రక్షణ బడ్జెట్ ప్రత్యేకతను సంతరించుకున్నది. గతంతో పోలిస్తే బడ్జెట్ కేటాయింపుల్లో అనేక లొసుగులు, లోటు కనిపిస్తున్నది. గతేడాది ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ 3.59 లక్షల కోట్లు రక్షణ బడ్జెట్‌ను కేటాయించారు. ఇందులో 57 శాతం సైన్యానికీ, 22 శాతం వాయుసేనకు, 14 శాతం నావికా దళానికీ, మిగిలిన ఏడు శాతం రక్షణ పరిశోధన, అభివృద్ధి కోసం కేటాయించారు. ఇలా మన బడ్జెట్‌లో కేటాయించినదంతా రక్షణ కోసమేనని చెప్పుకోవటానికి లేదు. నిజానికి రక్షణ అవసరాలన్నీ అంతర్గతంగా మరో మార్గాల నుంచి పొందుతున్న స్థితి ఉన్నది. అలాగే వివిధ రాష్ట్రాల్లోని గిరిజన, వేర్పాటువాద ఉద్యమాల నుంచి రక్షణ కల్పిస్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలకు లక్షా 70 వేల కోట్లు కేటాయించటం జరిగింది. వీటికితోడు ఇతర బలగాలను మన ప్రభుత్వాల ఖర్చు నుంచే వెచ్చించటం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో వాస్తవంగా మన దేశంలో రక్షణరంగంలో వ్యయం చేస్తున్నది, కేటాయిస్తున్నది ఎంత అన్నది చూడాల్సిన అవసరం ఉన్నది. ఇది మొత్తం కలిస్తే 4 లక్షల కోట్లకు చేరుతుంది. ఇది మనం చేస్తున్న ఇతర ఖర్చుల్లో ఐదో భాగం మాత్రమే. అలా గే కేంద్ర ప్రభుత్వం వైద్యం కోసం 48 వేల కోట్లు, విద్య కోసం 79 వేల కోట్లు. అయితే ఇక్కడ చర్చనీయాంశమేమంటే ప్రపంచంలోనే మూడో అతిపెద్ద రక్షణ బలగాల వ్యవస్థ కలిగిన దేశంలో ఇప్పుడు చేస్తున్న కేటాయింపులు సరిపోయినంత స్థాయిలో ఉన్నాయా? అన్నది.

అయితే ఇక్కడే మనం మన ప్రాధాన్యాల గురించి చర్చించుకోవాలి. మనం దేనికి ప్రాధాన్యమిస్తున్నామన్న దానిపై ఆధారపడి మన కేటాయింపులుంటాయన్నది వాస్తవం. దేశంలో 38 శాతం పిల్లలు సరైన పౌష్టికాహారం లేక ప్రాణం నిలుపుకోవటానికి అల్లాడుతున్నారు. దేశంలో మూల మూలనా బాలల పరిస్థితి ఇలా ఉంటే.., ప్రపంచంలోనే అతిపెద్ద ఆయుధాల దిగుమతిదారుగా భారత్ అగ్రభాగాన నిలిస్తే ఆ బాలలకు ఒరిగేదేమిటి? స్టాక్‌హోం ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ అధ్యయనం ప్రకారం 2012-16 మధ్య పెద్ద, మధ్య తరహా ఆయుధాల దిగుమతిలో భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్నది. ప్రపంచం మొత్తం ఆయుధ దిగుమతిలో 13 శాతం మన దేశమే దిగుమతి చేసుకుంటున్నది. ఈ దిగుమతుల కాలాన్ని చూస్తే ఆ కాలంలో కాంగ్రెస్ పాలనలో ఉన్నది. (జాతీయవాద దృక్పథం లేని పార్టీ అని ఆరోపణలు ఎదుర్కొంటుంది) ఆయుధాల దిగుమతిలో ముందున్నది. కానీ ఆ ఆయుధాలను ఎప్పుడూ వినియోగించింది లేదు. 1971 తర్వాత వాయుసేన విమానాలను ఇప్పటి దాకా ఉపయోగించలేదు. కానీ 59 వేల కోట్లు వెచ్చించి 36 కొత్త యుద్ధ విమానాలను కొనుగోలు చేశారు. గతేడాది చైనాతో డోక్లాంలో ఏర్పడిన ఉద్రిక్తతల నేపథ్యంలో అలాంటి అవసరం ఏర్పడుతుందా అన్న భావన కలిగింది. కానీ ఎలాంటి ఆయుధ వినియోగం లేకుండానే సమస్య పరిష్కారం కావటం మంచి పరిణామం.

ఇప్పుడు 1,60,000 కొత్త అసాల్ట్ రైఫిల్స్, కార్బైన్లను ప్రభుత్వం కొనుగోలు చేయటానికి నిర్ణయించింది. ఎందుకంటే సైనిక, రక్షణ బలగాల దగ్గర ఉన్న తుపాకులు పాత కాలంనాటివి. ప్రస్తుత పరిస్థితుల్లో కాలం చెల్లినవి. పశ్చిమ యూరప్‌ను జయించటానికి బయల్దేరిన జర్మనీ బలగాల దగ్గర అప్పటికి నాలుగు దశాబ్దాల కిందట రూపొందించిన మౌజర్ 98కే రైఫిళ్లతోనే జర్మనీ జైత్రయాత్ర చేసింది. అదే ఆదర్శంగా మన సైన్యాలు నడువాలంటే నేడు పరిస్థితులు అనుమతిస్తాయా అన్నది చూడాలి.

సామాజిక పరిస్థితుల నేపథ్యంలో బడ్జెట్ కేటాయింపులు, ప్రాధాన్యాలు మరో దేశంలోనైతే పెద్ద కుంభకోణం అయ్యేది. దేశం అల్లకల్లోలం అయ్యేది. కానీ మన ప్రజాస్వామ్యంలో పాలకులతీరును ప్రశ్నిస్తున్న వారే కరువయ్యారు. ఏ రూపంలోనైనా నిరసనగళాలు వినిపిస్తే బెదిరింపులు వస్తున్నాయి. అలాంటప్పుడు నాలుగు లక్షల కోట్ల రక్షణ బడ్జెట్‌తో మనకు భద్రత ఉంటుందని ప్రజలు ఎలా భావిస్తారు? దేశం కూడా రక్షించబడుతుందని ఎలా అనుకుంటారు?

వాస్తవానికి గత నలభై ఏండ్లలో భారత-చైనా సరిహద్దులో మన రక్షణ దళాలు ఒక్క బుల్లెట్‌ను కూడా కాల్చలేదు. మరి అలాంటప్పుడు మన దేశం కొత్త ఆయుధాల కోసం ఎందుకు వెంపర్లాడుతున్నట్లు? దీనివెనుక ఉన్న మతలబు ఏమిటి? జనవరి 16కు ఒకరోజు ముందు కొత్త మిసైల్ సిస్టం కలిగిన ట్యాంకులను కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటన వెలువడింది. దాని లక్ష్య సామర్థ్యం 5.5 కిలోమీటర్ల నుంచి 8 కిలోమీటర్లుగా చెప్పుకొచ్చారు. అయితే ఈ ట్యాంకుల లక్ష్యం ఎటు, ఎవరిపైకి గురి అన్నది ఆ ప్రకటన తెలుపలేదు.

మరోవైపు మన పాలకులు 'మేక్ ఇన్ ఇండియా' గురించి పెద్ద ఎత్తున చెబుతారు. రక్షణ అవసరాలకు అవసరమయ్యే అన్నిరకాల ఆయుధాలను దేశంలోనే తయారు చేసేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందని అంటున్నారు. ఇక నుంచి స్వయంశక్తిపై ఆధారపడటానికి కృతనిశ్చయంతో ఉన్నట్లు చెబుతున్నారు. మరోవైపు రక్షణరంగ ఉత్పత్తుల తయారీలోకి ప్రైవేట్ పెట్టుబడులను కూడా ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించారు. దీనికి అవసరమైన స్థాయిలో విదేశీ టెక్నాలజీ సాయంతో దేశీయంగా ఆయుధాల ఉత్పత్తిని చేపట్టి గ్లోబల్ మార్కెట్‌లో తన సత్తాను చాటాలనే లక్ష్యంతో ఉన్నట్లు చెబుతున్నది. కాబట్టి మనకు అవసరమైన ఆయుధాలను మనమే తయారు చేసుకోవటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయనుకోవాలి. ఈ క్రమంలో అనేక పౌరసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, అధ్యయనాలు చెబుతున్న దాని ప్రకారం మన ప్రభుత్వాలు ప్రజలకు అవసరమైన పాఠశాలలు, వైద్యశాలల నిర్మాణం కన్నా బాంబుల తయారీకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు.

మరోవైపు దేశ ప్రజల పరిస్థితి మరోలా ఉన్నది. దేశంలో 60శాతం గ్రామీణ యువతకు కంప్యూటర్, ఇంటర్నెట్ అంటే తెలియదు. 57 శాతం విద్యార్థులు భాగాహారం లెక్కలు చేయలేని స్థితిలో ఉన్నారు. 40 శాతం మంది గంటకాలాన్ని నిమిషాలు, సెకన్లలో చెప్పలేకపోతున్నారు. 14 శాతం మందికి స్కేలును ఉపయోగించి కొలువటం రావటంలేదు. ఇదంతా దేశంలోని విద్యా ప్రమాణాల గురించి ఏటా నిర్వహించే సర్వే చెప్పిన వాస్తవాలు. ఇదంతా 28 వేల మంది 14-18 ఏండ్ల వయసున్న విద్యార్థుల ప్రమాణాలను అధ్యయనం చేస్తే తేలిన కఠోర వాస్తవాలు. అలాగే.. అసర్ రిపోర్టు తేల్చిచెప్పిన దాని ప్రకారం 54 శాతం మంది విద్యార్థులు ఆహారపదార్థాల ప్యాకెట్లపై ఉన్న వివరాలను చదివి అర్థం చేసుకోలేని స్థితిలో ఉన్నారు. 38 శాతం మందికి డిస్కౌంట్‌ను గణించటం రాదు. 15 శాతం మందికి బ్యాంక్ అప్పులు చెల్లించటం కూడా రాదు. ఈ విధమైన విద్యా ప్రమాణాల ఫలితాలు, పర్యావసనాలు మనం నిత్యం ఎదుర్కొంటూనే ఉంటున్నాం.

ఈ విధమైన సామాజిక పరిస్థితుల నేపథ్యంలో బడ్జెట్ కేటాయింపులు, ప్రాధాన్యాలు మరో దేశంలోనైతే పెద్ద కుంభకోణం అయ్యేది. దేశం అల్లకల్లోలం అయ్యేది. కానీ మన ప్రజాస్వామ్యంలో పాలకులతీరును ప్రశ్నిస్తున్న వారే కరువయ్యారు. ఏ రూపంలోనైనా నిరసనగళాలు వినిపిస్తే బెదిరింపులు వస్తున్నాయి. అలాంటప్పుడు నాలుగు లక్షల కోట్ల రక్షణ బడ్జెట్‌తో మనకు భద్రత ఉంటుందని ప్రజలు ఎలా భావిస్తారు? దేశం కూడా రక్షించబడుతుందని ఎలా అనుకుంటారు? ప్రజలే సహేతుకంగా ఆలోచిస్తే, పాలకుల విధానాలను ప్రశ్నిస్తే.. కోట్లాది మంది ప్రజలు అనేకానేక సమస్యలతో సతమతమవుతున్నా ప్రభుత్వాలు లక్షల కోట్లను వెచ్చిస్తున్నదానికి అర్థం ఉండేది. ప్రజల కష్టాలు తీరేవి.

(వ్యాసకర్త: ప్రముఖ కాలమిస్టు)
(బిజినెస్ స్టాండర్డ్ సౌజన్యంతో..)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.



చిలుకలగుట్ట నుంచి సమ్మక్కను తీసుకొస్తున్న గిరిజన పూజారులు



సమ్మక్క రాకను పురస్కరించుకొని గౌరవసూచకంగా గాలిలోకి కాల్పులు జరుపుతున్న ఎస్పీ భాస్కరన్



చిలుకలగుట్ట నుంచి సమ్మక్క రాకను చెట్లపైకి ఎక్కి తిలకిస్తున్న భక్తులు



కిక్కిరిసిన జంపన్న వాగు..

గద్దెకు చేరిన సమ్మక్క

నేటి నుంచి సారక్క, పగిడిద్దరాజు, గోవిందరాజుతో కలిసి భక్తులకు ఆశీర్వాదం

మేడారం నుంచి వరంగల్ ప్రధాన ప్రతినిధి,భూపాలపల్లి ప్రతినిధి-నమస్తేతెలంగాణ: సమ్మక్క రాకతో మేడారం పులకించిపోయింది. తల్లి నామస్మరణతో అడవి మార్మోగిపోయింది. అశేష భక్తజన సందోహం మధ్య సమ్మక్క గురువారం చిలుకలగుట్ట నుంచి మేడారానికి చేరింది. కోళ్లు, మేకలు, గొర్ల బలితో తల్లికి హారతి పట్టారు. తల్లి రాకతో జాతర పరిపూర్ణమైంది. కొక్కెర కృష్ణయ్య సమ్మక్కను చేబూనారు. ఈ కోయ బిడ్డడు అతి సామాన్యుడే అయినా అమ్మను చేతుల్లోకి తీసుకొని దైవదూతగా మారిండు. చిలుకలగుట్టలోని తమకు మాత్రమే తెలిసిన రహస్య స్థావరం నుంచి కుంకుమ భరిణె రూపంలో సమ్మక్కను తన రాజ్యానికి తరలించుకొచ్చారు. జలకం వడ్డె అలుకు చల్లుతుండగా కొమ్ముపడ్డెలు వాయిద్యాలు మోగిస్తూ, ఇష్టరాగాలు ఆలపిస్తుండగా సమ్మక్క తల్లి మేడారానికి పయనమైంది. అద్భుత దృశ్యాన్ని కళ్లారా చూసేందుకు జనం లక్షలాదిగా చిలుకలగుట్టకు చేరుకున్నారు. చిలుకలగుట్ట నుంచి తల్లి రాకకు సంకేతంగా, గౌరవసూచకంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ ఆర్ భాస్కరన్ ఏకే-47 తుపాకీతో గాలిలోకి కాల్పులు జరిపారు. సమ్మక్క గద్దె చేరడంతో మేడారం మహిమాన్విత నేలై వెన్నెల్లో తడిసి మురిసిపోయింది. ఇప్పటికే సారక్క, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపైకి కొలువుదీరగా గురువారం రాత్రి సమ్మక్క రాకతో జాతర పరిపూర్ణమైంది. భక్తజనం శుక్రవారం నుంచి రెండు రోజులపాటు ఇద్దరు తల్లుల దీవెనలు అందుకోనున్నారు. శనివారం సాయంత్రం నలుగురూ తిరిగి అడవిలోకి సాగిపోనున్నారు. దీంతో జాతర పరిసమాప్తం కానున్నది.



గురువారం సాయంత్రం సమ్మక్కను గద్దెపైకి తీసుకొస్తున్న గిరిజన పూజారులు

తల్లీ.. నీ రాజ్యానికి స్వాగతం

సమ్మక్క రాకను కళ్లారా చూసేందుకు మధ్యాహ్నం నుంచే మేడారం చుట్టూ ఉన్న లక్షలాది మంది భక్తులు చిలుకలగుట్టకు దారులుతీశారు. కలెక్టర్, ఎస్పీ సహా అధికార యంత్రాంగం చిలుకలగుట్టకు చేరారు. డోలి విన్యాసాలు.. కొమ్ము పాటలు, తుడుందెబ్బ తదితర ఆదివాసీ సంప్రదాయాలు ఆచరించారు. జిల్లా ఎస్పీ ఆర్ భాస్కరన్ తుపాకీ పేల్చి స్వాగతం పలికితే సర్కారు ప్రతినిధిగా జిల్లా కలెక్టర్ కర్ణన్ హాజరయ్యారు. సమ్మక్క పూజారి కొక్కర కృష్ణయ్యను చేరుకుని పబ్బత్తి పట్టి 'తల్లీ నీకు స్వాగతం.. నీ రాజ్యానికి స్వాగతం.. మిమ్మల్ని మీ గద్దెకు గౌరవంగా తోడ్కొని వెళ్తాం అనుమతి ఇవ్వండి' అంటూ స్వాగతం పలికారు.

గద్దెలపై కంకవనం..

సమ్మక్కకు అత్యంత ప్రీతిపాత్రమైనది కంకవనం(వెదురు). గురువారం ఉదయం సమ్మక్క ప్రధాన వడ్డె కొక్కెర కృష్ణయ్య, మిగతా వడ్డెలు సమ్మక్క గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి నుంచి నేరుగా దట్టమైన అడవి ప్రాంతానికి వెళ్లి కంకవనానికి ప్రత్యేక పూజలు చేశారు. వేర్లతో సహా కంకవనాన్ని పెకలించి గద్దెలపై ప్రతిష్ఠించారు.

కుంకుమ భరిణె

చిలుకలగుట్ట నుంచి కుంకుమభరిణె రూపంలో సమ్మక్కను చేబూని జలకం వడ్డె అలుకు చల్లుతుండగా కొమ్ము వడ్డెలు వాయిద్యాలు వాయిస్తుండగా సమ్మక్క తల్లి మేడారానికి పయనమైంది. తల్లి రాకతో మేడారంలో ఒక్కసారిగా అద్భుత సన్నివేశం ఆవిష్కృతమైంది. మేడారం చుట్టుపక్కల తాత్కాలిక ఆవాసాలను ఏర్పర్చుకున్న జనం గూడారాల్లోంచి వచ్చి చిలుకలగుట్ట చుట్టూ వాలిపోయారు. గుట్ట నుంచి మేడారం గద్దెల దాకా దాదాపు కిలోమీటరున్నర దాకా ఇసుకపోస్తే రాలనంత జనం. తల్లి దర్శనానికి లక్షలాది మంది బారులు తీరారు. పసుపు, కుంకుమలను దారి పొడవునా చల్లారు. దూరం నుంచే భక్తులు కొబ్బరికాయలను విసిరి తమ మొక్కు తీర్చుకున్నారు. కోళ్లు, మేకలు, గొర్ల బలులతో నెత్తుటి నైవేద్యాలు సమర్పించారు.

ఆదివాసీల ఆనంద తాండవం..

తల్లి సమ్మక్క ఆగమనం సందర్భంగా చిలుకలగుట్ట తొలి మెట్టు నుంచి చెల్పాయి చెట్టు వరకు ఆదివాసీ బిడ్డలు ఆనంద తాండవం చేశారు. కోయ నృత్యం చేస్తూ డోళ్లు వాయిస్తూ తూటి కొమ్ములతో నృత్యాలు చేస్తూ నెమలీకల నాట్యం చేస్తూ ఆనందతాండం చేశారు.

తల్లి వెంట రాజ్య ప్రతినిధులు

సమ్మక్క తల్లిని గద్దెకు తరలించే ప్రక్రియలో జాతర ప్రత్యేక అధికారి ప్రశాంత్‌జీవన్‌పాటిల్, జిల్లా ఇంచార్జి కలెక్టర్ కర్ణన్, జాయింట్ కలెక్టర్ అమోయ్ కుమార్, ఎస్పీ ఆర్ భాస్కరన్, ములుగు సబ్ కలెక్టర్ గౌతమ్, పీవో ఐటీడీఏ చక్రధర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు సీతక్క, పోదెం వీరయ్య, వరంగల్ నగర మేయర్ నన్నపునేని నరేందర్‌తో పాటు ప్రత్యేక దూతలు రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్లు కొమురం ప్రసాదరావు, కల్తి వీరమల్లు, ట్రస్టు బోర్డు చైర్మన్ కాక లింగయ్యతో పాటు లక్షలాది మంది భక్తులు, తుడుం దెబ్బ వలంటీర్లు, ఆదివాసీ గిరిజన సంఘాల ప్రతినిధులు పూజారుల వెంట నడిచారు.

మేడారం పొలిమేరల్లో ఆడబిడ్డల స్వాగతం

సంప్రదాయం ప్రకారం సిద్ధబోయిన, కొక్కెర వంశాలకు చెందిన ఆడబిడ్డలు కొత్తకుండలతో నీటిని తీసుకువచ్చి గద్దె వైపు వస్తున్న సమ్మక్క తల్లికి ఎదురుగా నీళ్లారగించారు. మంగళహారతులు పట్టారు. ఇది వారి హక్కుగా కొనసాగుతున్నది. భక్తులు దారిపొడుగునా తల్లికి ఒడి బియ్యం పోస్తూ, ఎదురుకోళ్లు ఎగరేస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక్క గద్దెల ప్రాంగణంలోకి రాగానే వాతావరణం ఉద్విగ్నంగా మారింది. తల్లి గద్దెపైకి వస్తున్న తరుణంలో డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి స్వాగతం పలుకగా స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తక్కళ్లపల్లి రవీందర్‌రావు, వరంగల్ మేయర్ నన్నపునేని నరేందర్ సమ్మక్కను దర్శించుకున్నారు. డోలీ విన్యాసాలు, కొమ్ముబూర నాదాల మధ్య ఆదివాసీ సంప్రదాయాలకు అనుగుణంగా తల్లిని గద్దెకు చేర్చారు.

సమ్మక్క పయనం సాగిందిలా...

- **సాయంత్రం 6.14 గంటలు:** చిలుకలగుట్ట నుంచి దిగిన సమ్మక్క.
- **6.14:** చిలుకలగుట్ట పాదాలదగ్గర గాలిలోకి ఆరురౌండ్లు కాల్పులు జరిపి తల్లికి స్వాగతం పలికిన ఎస్పీ భాస్కరన్.
- **6.16:** రెండోసారి మూడు రౌండ్లు కాల్పులు.
- **6.19:** మూడోసారి, 6.20గంటలకు చిలుకలగుట్ట దగ్గర వాగులో నాలుగో సారి కాల్పులు జరిపారు.
- **6.32:** వాగు ఒడ్డుకు చేరిన సమ్మక్క. తల్లి వనంలోంచి జనంలోకి వచ్చిన సూచికగా ఎస్పీ ఐదోసారి గాలిలోకి కాల్పులు జరిపారు.
- **7.40:** పూజారులు చెల్పాయ చెట్టు ప్రాంతానికి చేరుకొని దాదాపు అరగంటకుపైగా పూజలు చేశారు.
- **8.15:** మేడారం పొలిమేరల్లోకి తల్లిరాక.
- **8.32:** తల్లి మేడారం గద్దెల ప్రాంగణంలోకి చేరింది. బుధవారం సారక్క మేడారానికి బయలుదేరిన సమయానికే (రాత్రి 8.32) రావడం విశేషం.
- **8.38:** గద్దెపై సమ్మక్క కొలువుదీరింది.

నేడు మేడారానికి సీఎం కేసీఆర్

- ఉపరాష్ట్రపతి, గవర్నర్ కూడా..
- సమ్మక్క, సారక్క దర్శనానికి ఏర్పాట్లు



జయశంకర్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు, గవర్నర్ నరసింహన్, కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ఓరం, ఎంపీ కల్వకుంట్ల కవిత శుక్రవారం మేడారం పర్యటనకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మేడారంలోని గద్దెల ప్రాంగణం పక్కన ఉన్న పోలీసు క్యాంపు వద్ద మూడు హెలిప్యాడ్లు, గద్దెల ప్రాంగణం పక్కన ఆధునిక టెంట్లతో గుడారాలను ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ తొలిసారి మేడారం వస్తున్నారు. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కూడా మేడారం రావటం ఇదే మొదటిసారి. హైదరాబాద్ నుంచి నేరుగా హెలికాప్టర్‌లో మేడారం చేరుకోనున్న సీఎం కేసీఆర్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, గవర్నర్ నరసింహన్ తొలుత సమ్మక్క సారక్కను దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. అనంతరం గద్దెల ప్రాంగణం పక్కన అధికారులు సిద్ధం చేసిన ఆధునిక గుడారాల్లో భోజనం చేస్తారని అధికారులు తెలిపారు. సీఎం కేసీఆర్ మధ్యాహ్నం 12:30 గంటలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి, 1:15 గంటలకు మేడారం చేరుకుంటారు. 1:25 గంటలకు సమ్మక్క సారక్కను దర్శించుకుంటారు. 1:45 గంటల వరకు గద్దెల ప్రాంగణంలోనే ఉంటారు. మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల మధ్య భోజనం చేస్తారని అధికారులు తెలిపారు.

మేడారంలో వీఐపీల సందడి

- నిలువెత్తు బంగారం సమర్పించిన ఛత్తీస్‌గఢ్ సీఎం రమణ్‌సింగ్
- మొక్కులు చెల్లించుకున్న రాష్ట్ర ప్రజాప్రతినిధులు



అమ్మవార్లను దర్శించుకుంటున్న ఛత్తీస్‌గఢ్ సీఎం రమణ్‌సింగ్

జయశంకర్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: మేడారంలో గురువారం వీఐపీలు సందడి చేశారు. సమ్మక్క, సారక్కను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఛత్తీస్‌గఢ్ సీఎం రమణ్‌సింగ్, మంత్రులు కేదార్ కశ్యప్, మహేశ్ గగ్డే, సీఎం ఓఎస్డీ ఓపీ గుప్తా, ఏపీ దేవాదాయశాఖ మంత్రి మాణిక్యాలరావు, తెలంగాణ శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్, శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి, రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి చందూలాల్, ఎంపీ చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్సీలు మైనంపల్లి హన్మంతరావు, శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, సాయన్న, కేపీ వివేకానంద, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ట్రైకార్ చైర్మన్ తాటి వెంకటేశ్వర్లు, సినీ నటుడు శివారెడ్డి తదితరులు అమ్మవార్ల దర్శనానికి మేడారానికి తరలివచ్చారు. ఛత్తీస్‌గఢ్ సీఎం రమణ్‌సింగ్ నిలువెత్తు బంగారం సమర్పించారు. ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు తన నియోజకవర్గంలోని వెయ్యి మందితో కలిసి వచ్చారు. శాసనసభా స్పీకర్ మధుసూదనాచారి, సినీనటుడు శివారెడ్డి కుటుంబసభ్యులతో కలిసి వచ్చారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి ఎంపీ మల్లారెడ్డి మీడియాతో మాట్లాడుతూ 2014లో సమ్మక్క సారక్కను దర్శించుకున్నతాను ఎంపీగా గెలిచానని, ఈసారి మొక్కులు చెల్లించుకున్న తాను వచ్చే మహాజాతరకు కేంద్ర లేదా రాష్ట్ర మంత్రి హోదాలో వస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం నుంచి డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీ సీతారాంనాయక్, టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తక్కళ్లపల్లి రవీందర్‌రావు మేడారంలోనే మకాంవేశారు. జాతర పరిసరాల్లో గురువారం విస్తృతంగా పర్యటించి ఏర్పాట్లు, భక్తుల రద్దీని పరిశీలిస్తూ అధికారులకు సూచనలు చేస్తున్నారు. డిప్యూటీ సీఎం కడియం క్లస్టర్ అధికారులతో సమావేశం నిర్వహించి జాతరలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం నిర్వహణపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. భక్తులకు తాగునీటి సరఫరా మెరుగుపర్చాలని జాతర ప్రత్యేక అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్, జిల్లా ఇంచార్జి కలెక్టర్ కర్ణన్‌ను ఆదేశించారు.



మొక్కులు చెల్లించుకుంటున్న ఎంపీ మల్లారెడ్డి, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, మైనంపల్లి హన్మంతరావు, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, మాధవరం కృష్ణారావు

మేడారంలో ఇద్దరికి ప్రసవం

వైద్యశిబిరంలో పురుడుపోసిన సిబ్బంది.. కేసీఆర్ కిట్లు అందజేత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మేడారంలో గురువారం ఇద్దరు మహిళలకు వైద్యసిబ్బంది పురుడుపోశా రు. సమ్మక్కసారక్కను దర్శించుకునేందుకు క్యూలైన్లలో నిలబడ్డ సిద్దిపేటలోని హనుమాన్‌నగర్‌కు చెందిన కడిమెంచం సంగీత, సికింద్రాబాద్ రెజిమెంటల్‌బజార్‌కు చెందిన విజయలక్ష్మికి పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. వెంటనే గద్దెలకు సమీపంలో ఉన్న వైద్యశిబిరానికి తరలించగా, సిబ్బంది వారికి ప్రసవం చేశారు. వారికి కేసీఆర్ కిట్లను అందించినట్టు వైద్యసిబ్బంది తెలిపారు. గతనెల 29 నుంచి మేడారంలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరాల ద్వారా ప్రజలకు విశేష సేవలు అందిస్తున్నారు. వైద్యంతోపాటు క్యూలైన్లలో ఉన్నవారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్నారు. ప్రమాదంలో గాయపడిన 12 మందికి, హృద్రోగ, శ్వాస సంబంధ ఇబ్బందులు పడుతున్న 44 మందికి, అస్వస్థతకు గురైన 38 మందికి వైద్యం అందించారు. మేడారంలో పనిచేస్తున్న వైద్యబృందాలను మంత్రి లక్ష్మారెడ్డి అభినందించారు.



మేడారంలోని ఐటీడీఏ క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి. చిత్రంలో మండలి చైర్మన్ స్వామిగౌడ్, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీ సీతారాంనాయక్, జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, జాతర ప్రత్యేక అధికారి ప్రశాంత్ జే పాటిల్, ఎస్పీ భాస్కరన్

మహాజాతరకు 1.30 కోట్ల మంది

- భక్తులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు
- 400 సీసీ కెమెరాలతో భద్రత పర్యవేక్షణ
- డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మేడారం మహాజాతరకు కోటి 30 లక్షల మంది భక్తులు హాజరవుతారని అంచనా ఉందని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి చెప్పారు. బుధవారంనాటికి 50 లక్షల మందికిపైగా భక్తులు మేడారం వచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారన్నారు. గురు, శుక్రవారం భక్తుల తాకిడి మరింత పెరుగవచ్చని పేర్కొన్నారు. గురువారం మేడారంలోని ఐటీడీఏ క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ఎలాంటి విఘాతం కలుగకుండా ప్రభుత్వం భక్తుల సౌకర్యార్థం చర్యలు చేపట్టిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి మేడారం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత సౌకర్యాల నిమిత్తం రూ.240 కోట్లు వెచ్చించిందన్నారు. రెండులేన్ల రోడ్లు, జంపన్నవాగుకు ఇరువైపులా స్నాన ఘట్టాలు, మరుగుదొడ్లు, కల్యాణకట్టలు నిర్మించినట్టు చెప్పారు. మేడారంలో హరిత హోటల్, ఆదివాసీ మ్యూజియం నిర్మించినట్టు తెలిపారు. నాలుగు రోజులపాటు జరిగే గిరిజన కుంభమేళాకు రాష్ట్రవ్యాప్తంగా 4,200 ఆర్టీసీ బస్సులు నడిపిస్తున్నట్టు, ఇందుకు 12 వేల మంది సిబ్బందిని కేటాయించినట్టు వివరించారు. జాతరలో 400 సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి భద్రతాపర చర్యలు పర్యవేక్షిస్తున్నట్టు వెల్లడించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మేడారం జాతరకు శుక్రవారం ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సీఎం కేసీఆర్, కేంద్ర గిరిజనశాఖ మంత్రి ఓరం, గవర్నర్ నరసింహన్ రానున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. జాతర ఏర్పాట్లపై సెక్టోరియల్ అధికారులతో ఆయన సమీక్షించారు. తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. దేవాలయ ప్రాంగణ పరిసర ప్రాంతాల్లో శానిటేషన్ పనులు పకడ్బందీగా నిర్వహించాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించుకోవాలని అధికారులను ఆదేశించారు. జంపన్నవాగు నుంచి దేవాలయ ప్రాంగణం వరకు ఎలాంటి వాహనాలను అనుమతించవద్దని ఎస్పీ భాస్కరన్‌కు సూచించారు. సమావేశంలో మండలి చైర్మన్ స్వామిగౌడ్, జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, జాతర ప్రత్యేక అధికారి ప్రశాంత్ జే పాటిల్, జేసీ అమయ్‌కుమార్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చంద్రధర్‌రావు, ట్రైనీ కలెక్టర్లు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

9300 ట్రిప్పులు.. 4.11 లక్షల భక్తులు

మేడారం జాతరకు అందుబాటులో ఆర్టీసీ సేవలు
క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్న ఎండీ రమణారావు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భక్తులకు రవాణా ఇబ్బందులు ఉండొద్దన్న ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా ఆర్టీసీ విశేష సేవలు అందిస్తున్నది. గురువారం సాయంత్రంవరకు ఆర్టీసీ 9,300 ట్రిప్పులు నడుపగా, 4.11 లక్షలకుపైగా ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరారు. టీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ జీవీ రమణారావు మేడారంలో మకాంవేసి రవాణా సేవలు, సౌకర్యాలను పర్యవేక్షిస్తున్నారు. బస్టాండ్ ఆవరణలో పరిశుభ్రతతోపాటు మేడారం మార్గంలోని ప్రయాణ ప్రాంగణాల్లో సదుపాయాలను కంట్రోల్ రూం నుంచి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తులు ఎక్కడా నిరీక్షించకుండా ప్రభుత్వ సహకారంతో వివిధ ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో బస్సులు నడుపుతున్నట్టు తెలిపారు. 12 వేలమంది ఆర్టీసీ ఉద్యోగులు భక్తులకు సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. మేడారం ఆపరేషన్స్‌కు సంబంధించి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సంస్థ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ మునిశేఖర్ పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. హన్మకొండలోని 21 సెంటర్లు, ఇతర ప్రాంతాల్లో 51 కేంద్రాల నుంచి బస్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు,
సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi
హైదరాబాద్
శుక్రవారం 2 ఫిబ్రవరి 2018
WWW. NTNEWS.COM



అడవి తల్లుల జాతరలో.. ఆదివాసీ నృత్య పరవశం!

'జంపన్న వాగుల్ల అబ్బి యా.. జాలారి బండల్ల అబ్బి యా.. నాది దయ్యాల మడుగే అబ్బి యా.. దండొక్కపొద్దే అబ్బి యా' అంటూ పూనకంతో పులకిస్తూ మేడారం.. రెండో రోజు జానపదుల సవ్వడితో పరవశించింది! ఆరాధ్యదైవం సమ్మక్క.. సారక్కలను కొలుస్తూ చిందేసి.. దరువేసి ఆడిపాడారు! సంస్కృతిలో భాగమైన జానపద నృత్య ప్రదర్శన చేసి అడవితల్లుల ఆశీర్వాదం పొందారు!


గోండు నృత్యం

మేడారం మహాజాతరలో జానపదుల సవ్వడి హోరెత్తుతున్నది. ఆదివాసీ తెగల ఆట, పాటలన్నీ ఒకే చోట చిందేస్తున్నాయి. డప్పు చప్పుళ్లు, మేళతాళాలు లయబద్ధంగా మేడారాన్ని తాకుతున్నాయి. మన రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన భిన్న తెగలకు చెందిన జానపదులు మేడారంలో ఆకట్టుకుంటున్నాయి.

సంస్కృతి కేంద్రం

శతాబ్దాల చరిత్ర కలిగిన ఆటలు, పాటలు ఎన్నో నేటికీ మారుమోగుతున్నాయి. మహాజాతర సందర్భంగా ఆధునిక పోకడలోనూ సజీవంగా జనపదాలు సామాన్య ఆదివాసీల నోట పాటలై వస్తున్నాయి. నృత్యాలై నర్తిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో పాత ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో ఆదివాసీలకే పరిమితమైన అనేక జానపదాలు అడవి బిడ్డల సంప్రదాయాలను ప్రతిబింబించే ఎన్నో ఆటలు, పాటలు మేడారం జాతరలో ఒకే వేదికపై ఆకట్టుకుంటున్నాయి. తెలంగాణ రాష్ట్రానికి సుమారుగా వేల సంవత్సరాల సాంస్కృతిక చరిత్ర సొంతం. కాకతీయ రాజవంశం నుంచి కుతుబ్‌షాహీ, అసఫ్‌జాహీ రాజవంశాల పరిపాలనలో మన ప్రాంతం భిన్న సంస్కృతితో వెలుగొందింది. భారత ఉపఖండంలో మొట్టమొదటి సంస్కృతి కేంద్రంగా ఈ ప్రాంతం ఆవిర్భవించిందనడానికి మేడారం మహాజాతర ఓ చక్కని ఉదాహరణ.

గోండు నృత్యం

తెలంగాణ రాష్ట్రంలో గోండు తెగకు చెందిన ఆదివాసీల ప్రదర్శన నేటికీ సజీవంగా మారుమోగుతున్నది. ప్రధానంగా ఈ నృత్యం ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్‌లోని భీమ్‌దేవ్ ఆలయం గోండు తెగకు సంబంధించినది. ఇక్కడ గోండు తెగ వారు 15 రోజుల పాటు జాతరను జరుపుతారు. ఇందులో పాల్గొనడానికి అధిక సంఖ్యలో వాయిద్యకారులు, గాయకులు, నృత్యకారులు హాజరై భక్తిగీతాలను ఆలపించారు. వివిధ రకాల నృత్య ప్రదర్శనలు చేశారు. ఈ ఉత్సవాల్లో పెండ్లి కూతుళ్లు ప్రధాన పాత్ర పోషించారు. వీరు సమూహాలుగా చేరి నృత్యాన్ని ప్రదర్శించి అందర్నీ ఆకట్టుకున్నారు. ఈ చిన్న సమూహాలనే గుస్సాడీ అంటారు. నెమలి ఈకలు పొదిగిన, జింక కొమ్ములున్న తలపాగా, కృత్రిమ మీసాలు, గడ్డాలు, మేక చర్మాన్ని ధరించి.. వాయిద్యాలు డప్పు, తుడుము, పిప్రి, కొలికమ్మలతో మేడారం మార్మోగింది.

కోయ.. కుర్రు నృత్యం

మేడారం మహాజాతరలో సమ్మక్క, సారక్కలు కొలువుదీరే గద్దెల వద్ద కోయల సందడి ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యంగా ఆదివాసీ సమూహంగా పేరుగాంచిన వీరు పండగలు, పెళ్లిళ్లు, ఇతర ఉత్సవాల్లో ఎద్దుకొమ్ము నృత్యాన్ని ప్రదర్శించారు. పురుషులు ఎద్దు కొమ్ములను, రంగు దుస్తులను ధరించారు. ఈ నృత్యంలో సుమారుగా 30 నుంచి 40 మంది పాల్గొన్నారు. ఈ నృత్యాన్ని ప్రధానంగా వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని షెడ్యూల్ ప్రాంతాల్లో నివసించే కోయలు ప్రదర్శించారని స్థానికులు చెప్తున్నారు. పండుగలు, పెళ్లిళ్లు, పంటలు కోసే సమయంలో కుర్రు నృత్యాన్ని ప్రదర్శించేవారే వీళ్లు. ముగ్గురు వేణువు, ముగ్గురు డ్రమ్స్‌లను మోగిస్తుండగా ఆ శబ్దాలకు అనుగుణంగా నృత్య ప్రదర్శన చేస్తూ ఉంటే మేడారం అంతా మేలిమి కాంతులతో మెరిసిపోయింది.

థింసా నృత్యం

థింసా నృత్యం ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రాచుర్యం పొందింది. మేడారం జాతరలో ఈ నృత్యం ప్రత్యేక పాత్ర పోషించింది. ఈ నృత్యంలో మహిళలు ప్రధాన భూమిక పోషించారు. థింసా నృత్యాన్ని రాజ్‌గోండులు చేస్తారు. పండెగలు, పెళ్లిళ్లో ఈ నృత్యాన్ని మహిళలు, పురుషులు ఎవరికి వారే విడిగా సంగీతానికి అనుగుణంగా నర్తిస్తారు. థింసా ప్రత్యేక సంగీత పరికరాలైన పెప్రె, ఢోలు, కాళికోం శబ్దాల నడుమ సమ్మక్క సారక్కల జాతర జన సందోహమై కన్నుల పండువగా సాగుతున్నది.

మేడారం నుంచి జూపల్లి రమేశ్
(వరంగల్ రూరల్ జిల్లా ప్రతినిధి - నమస్తే తెలంగాణ)


థింసా నృత్యం


కోయ.. కుర్రు నృత్యం

వీరగోని రజనీకాంత్



మేడారం హెలికాప్టర్ నుంచి నూర శ్రీనివాస్
(నమస్తే తెలంగాణ ప్రధానప్రతినిధి-వరంగల్)

ఆకాశదీపం.. ఆదివాసీ భూతల స్వర్గం

మేడారం నుంచి విహంగ వీక్షణం. అదొక అపురూప దృశ్యం. చూడ రెండు కండ్లూ చాలని అబ్బురపడే ఆనంద సందోహం. ప్రపంచ మహానగరాలతో పోటీపడి అప్పటికప్పుడు భూతలమ్మీద కేవలం పదిహేను ఇరువై రోజుల్లోనే నిర్మాణమైన మహానగరం మేడారం. మహానగరాల్లో ఉండే సకల సౌలతులతో మేడారం రూపాంతరం చెందింది. రెండేళ్లకోసారి నాలుగు రోజుల పాటు విడిది చేసే భక్తుల కోసం తెలంగాణ సర్కార్ యుద్ధ ప్రాతిపదికన చేసిన ఏర్పాట్లు ఎలా ఉన్నాయి? జంపన్నవాగు నుంచి చిలుకలగుట్ట, ఇటు మేడారం గద్దెల నుంచి చిలుకలగుట్ట దాకా జాతర పరిసరాలను పరిశీలించి జాతర ప్రాంగణంలో జనం ఈసారి తక్కువగా వచ్చారా? ఎక్కువ వచ్చారా? తెలుసుకునేందుకు తెలంగాణ రాష్ట్ర పర్యాటకశాఖ ప్రత్యేక చొరవతో జాతర భక్తుల ప్రయాణ సౌకర్యం కోసం హెలికాప్టర్ సేవల్ని అందుబాటులో ఉంచింది. ఈ నేపథ్యంలో నమస్తే తెలంగాణ ప్రతినిధితోపాటు ఫొటోగ్రాఫర్‌తో కలిసి ప్రత్యేక విహంగ వీక్షణ దృశ్యకవనాన్ని అందించేందుకు చేసిన ప్రయత్నం సఫలమైంది. నమస్తే తెలంగాణ పాఠకుల కోసం అందిస్తున్న మేడారం విహంగ వీక్షణ ప్రత్యేక కథనం ఇది. అప్పటికప్పుడు మహానగరాలకు దీటుగా నిర్మాణమైంది మేడారం. గగనతలం నుంచి మేడారం దృశ్యాలను పరిశీలిస్తే అరణ్యంలో ముంబై, కోల్‌కతా, ఢిల్లీ, హైదరాబాద్, వరంగల్ మహానగరాలకు ఏమాత్రం తీసిపోని విధంగా ఉన్న అపురూపంగా ఆవిష్కృతమైంది. మహానగరమేణి సొబగులు సంతరించుకున్నట్టుగా కనిపించింది.

మేడారం కేంద్రంగా చుట్టూ 20 కిలోమీటర్ల మేర జనపరివ్యాప్తమై విస్తరించింది. మేడారం, కన్నెపల్లి, కొత్తూరు, ఎల్బాక, చింతల్‌క్రాస్, నార్లాపూర్, కాల్వపల్లి, వెంగళాపూర్, ప్రాజెక్టునగర్, తాడ్వాయి, ఇటు ఊరట్టం, కొండాయిల దాకా మేడారం మహాజాతర భక్తులు తల్లుల దర్శనానికి తనువెల్లా కనులై ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక విడిది గుడారాలతో మేడారం పరివ్యాప్తమైంది. మేడారం జాతరను విడదీస్తూ మేడారం చుట్టుపక్కల మూడు కిలోమీటర్ల పొడవునా జన సంద్రమైంది.

మేడారం, కన్నెపల్లి రెండు కుగ్రామాలను రెండు జంట నగరాలుగా మార్చింది జంపన్నవాగు. మేడారం నుంచి జంపన్నవాగు, ఊరట్టం నుంచి జంపన్నవాగు, ఎల్బాక, నార్లాపూర్ దాకా చీమలు బారులు తీరినట్టు, తాత్కాలిక గుడారాలు, నిర్మాణాలు పిట్టగూళ్లలా రకరకాల ఆకృతులతో అతి చిన్నగా కనిపించాయి. మేడారం ఏర్పాట్లలో ఎలాంటి చిన్న లోటుపాట్లు లేకుండా తెలంగాణ ప్రభుత్వం అసాధారణ ఏర్పాట్లు చేసింది. దారులన్నీ నదీ ప్రవాహాన్ని తలపించాయి. మేడారం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణీకులను సురక్షితంగా తరలించే బస్సులు సైతం బారులు తీరి అగ్గిపెట్టెలు పేర్చినట్టు సోల్‌పుత నిలిచాయి. మేడారం గద్దెల ప్రాంగణంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన ఆరున్నర కిలోమీటర్ల క్యూలైన్లలో నిలుచున్న భక్తులకు ఎండ తగులకుండా పై నుంచి వేసిన తడకల పందిరి. పోలీస్ క్యాంప్ నుంచి మొదలుకొని ఉన్న శాశ్వత భవంతీలు అన్నీ పిట్టగూళ్లను తలపించాయి. కాకులు దూరని కారడవిలో హెలీక్యాప్టర్ల చక్కర్లు కొట్టడం ఒక వింత. అటువంటిది ఈసారి మహాజాతర ఏర్పాట్లలో మునుపెన్నడూ లేని విధంగా మేడారం గద్దెల ప్రాంగణంలో రెండు ప్రత్యేక హెలీప్యాడ్లు ఏర్పాటు చేశారు. మేడారం నుంచి దాదాపు మూడు కిలోమీటర్ల దూరంలో రాష్ట్ర ప్రభుత్వం హెలీటూరిజంలో భాగంగా ప్రత్యేకంగా రెండు హెలీప్యాడ్ల నిర్మాణం కావడంతో ఈసారి మేడారం ఆకాశమార్గం అంతా హెలికాప్టర్లు సందడి చేశాయి. జాతీయ అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించడంతోపాటు మేడారం ఆదివాసీ గిరిజన జాతరను విశ్వవ్యాప్తం చేయాలన్న రాష్ట్రముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పంలో భాగంగా రెండు రోజుల నుంచి ఈ రెండు ప్రాంతాలు బేగంపేట్, శంషాబాద్ ఎయిర్‌పోర్టులను తలపించాయి. గురువారం ఒక్కరోజు నాలుగు హెలికాప్టర్లు మేడారం భక్తుల సేవలో పుణీతం కావడం ఈసారి హైలైట్. అంతేకాకుండా రెండు ప్రాంతాల్లో సిద్ధంగా ఉన్న హెలీప్యాడ్లను తల్లుల దర్శనానికి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, రాష్ట్ర గవర్నర్ నర్సింహన్‌లను మేడారం తోడ్కొని వస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఒక్కరోజే రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ బేగంపేట్ విమానాశ్రయం నుంచి మూడు ప్రత్యేక హెలికాప్టర్లు రానున్నాయి.

మొత్తంగా ఆదివాసీ భూతల స్వర్గం ఆకాశమంత ఎత్తుకు ఎదిగి జాతర ప్రాముఖ్యత, విశిష్టత విశ్వావ్యాప్తం అయిందనడానికి ఇదే నిదర్శనం.



వాణిజ్య

సెన్సెక్స్	నిఫ్టీ	ముడి చమురు (బ్రెంట్)
35,907 ↘ 58	11,017 ↘ 11	↗ 69.36 డాలర్లు

బంగారం ధరలు

ముంబై (రూ.లలో)	
24 క్యారెట్లు	30,450
22 క్యారెట్లు	30,300
వెండి (కిలో)	39,335

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	57.94	67.19
బహ్రెయిన్ దినార్	156.91	179.82
కువైట్ దినార్	175.80	218.85
సౌదీ రియాల్	15.40	18.26
యూఏఈ దిర్హామ్	15.77	18.43

చికెన్ ధరలు (రూ.లలో)

ఫారం ధర	74.00
రిటైల్ లైవ్	96.00
డ్రెస్డ్	139.00
స్కిన్‌లెస్	158.00

నెక్ (వంద గుడ్లకు) (రూ.లలో)

హైదరాబాద్	360-00
రంగారెడ్డి	360-00
మెదక్	360-00
కరీంనగర్	362-00
వరంగల్	362-00
రిటైల్ ప్రైస్	4-20



ఆర్థిక వ్యవస్థపై నెలకొన్న ఆందోళనలను బడ్జెట్ పరిగణనలోకి తీసుకున్నది. అయినప్పటికీ పూర్తిస్థాయిలో మాత్రం కాదు. వ్యవసాయంపై దృష్టి సారించినా.. ప్రైవేట్ రంగ పెట్టుబడులను మరిచారు

-సీ రంగరాజన్, పీఎంఈఏసీ మాజీ చైర్మన్



బాధ్యతాయుతమైన బడ్జెట్. ప్రాధాన్యతల ఆధారంగా కేటాయింపులు జరిగాయి. వృద్ధిదాయక రంగాలపై దృష్టి పెట్టారు.

- చందాకొచ్చర్, ఐసీఐసీఐ ఎండీ



పన్నులు.. రాయితీలు..

- రూ.250 కోట్ల వరకు లావాదేవీలు జరిపే కంపెనీల కార్పొరేట్ పన్నురేటు 30 నుంచి 25శాతానికి తగ్గింపు.
- వ్యక్తిగత ఆదాయం పన్ను శ్లాబుల్లో ఈ ఏడాది ఎలాంటి మార్పులేదు.
- 50లక్షల నుంచి కోటిరూపాయల మధ్య ఆదాయంపై 10శాతం అదనపు సర్‌చార్జ్. రూ.కోటి పైన ఆదాయంపై 15శాతం సర్‌చార్జ్ కొనసాగింపు.
- వేతన ఉద్యోగులకు రూ.40వేల వరకు ప్రయాణ, వైద్య ఖర్చులకు స్టాండర్డ్ డిడక్షన్ వర్తింపు. ప్రస్తుతం ఇది రూ.15వేలుగా ఉంది.
- సీనియర్ సిటిజన్ల వైద్య ఖర్చులకు అదనపు రాయితీ రూ.60వేల నుంచి లక్ష వరకు పెంపు. దీనివల్ల 2.5కోట్లమందికి లబ్ధి.
- వయోధికుల ఎఫ్‌డీ, పోస్టాఫీస్ డిపాజిట్లపై టీడీఎస్ ఉండదు. రూ.50వేల వరకు వర్తింపు.
- వయోధిక పౌరుల బ్యాంకు డిపాజిట్ల ఆదాయంపై పన్ను పరిమితి పెంపు.రూ.50వేల వరకు వర్తించని పన్ను.
- చిన్నతరహా పాదరక్షలు, తోలు ఉత్పత్తుల తయారీ సంస్థల లాభాలపై ఆదాయం పన్ను రాయితీ
- వందకోట్లకుపైగా టర్నోవర్‌తో నమోదైన వ్యవసాయ ఉత్పాదక సంస్థలకు తొలి ఐదేండ్లు నూరు శాతం పన్ను రాయితీ.
- లిస్టెడ్ కంపెనీల్లో వాటాల విక్రయానికి సంబంధించి రూ.లక్ష దాటిన లాభాలపై క్యాపిటల్ గెయిన్స్ కింద 10శాతం పన్ను విధింపు
- వైద్య, విద్య సెస్ 4శాతానికి పెంపు.
- మొబైల్ ఫోన్ల దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీ 15 నుంచి 20 శాతానికి పెంపు. మొబైల్ పరికరాలు, టీవీ విడిభాగాల దిగుమతిపై 15శాతం వర్తింపు
- ప్రత్యక్ష పన్నుల్లో 12.6శాతం వృద్ధి. రెండేండ్లుగా ఆదాయం పన్ను వసూళ్లలో భారీ పెరుగుదల.
- దేశంలో పన్ను చెల్లింపుదారుల సంఖ్య 85.51 కోట్లు. 41శాతానికి పెరిగిన పన్ను రిటర్నులు దాఖలు చేసే వారి సంఖ్య.
- వ్యక్తిగత ఆదాయం పన్ను చెల్లింపుల కింద అదనంగా రూ.90వేల కోట్ల సేకరణ.
- కొత్త ఉద్యోగాలు కల్పించే రంగాల్లో ప్రభుత్వం చెల్లించే ఈపీఎఫ్ వాటాను 8.33శాతం నుంచి 12శాతానికి పెంపు. పెంచిన ఈపీఎఫ్ మూడేండ్ల పాటు అమలు.

పరిశ్రమలు

- చిన్న, సూక్ష్మ తరహా పరిశ్రమల కోసం రూ. 3,790 కోట్లు.
- వెదురు పరిశ్రమ ప్రోత్సాహం కోసం రూ. 1,290 కోట్లు.
- చేనేత, జౌళి రంగానికి రూ.7500 కోట్లు.
- ఆయుధాల తయారీ రంగంలో విదేశీ పెట్టుబడులకు ప్రోత్సాహం.
- వస్త్ర పరిశ్రమ కోసం ప్రత్యేక ప్రోత్సాహకాలు. టెక్స్‌టైల్ రంగానికి రూ.7,148 కోట్లు.
- సులభతర వాణిజ్యంలో పారదర్శకత కోసం ప్రతీ వ్యాపార సంస్థకు యూనిక్ ఐడీ.
- పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యం రూ.80వేల కోట్లు.
- స్టాక్‌మార్కెట్‌లో లిస్టింగ్‌కు 14 ప్రభుత్వరంగ సంస్థలు.
- ఎంఎస్‌ఎంఈలకు బ్యాంకుల నుంచి ఆన్‌లైన్ ద్వారా రుణాల మంజూరు.
- స్టార్టప్‌లకు నిధుల్ని పెంచేందుకు నూతన పన్ను నిబంధనలు

ఈక్విటీలపై పన్నుల పిడుగు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: స్టాక్ మార్కెట్లపై పన్నుల పిడుగు పడింది. దీర్ఘకాలిక మూలధన లాభాల (ఎల్‌టీసీజీ)పై పన్ను వచ్చింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2018-19)గాను గురువారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించిన బడ్జెట్‌లో ఈక్విటీలపై 10 శాతం లాంగ్-టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ (ఎల్‌టీసీజీ) ట్యాక్స్‌ను ప్రతిపాదించారు. సుదీర్ఘ విరామం అనంతరం మళ్లీ ఎల్‌టీసీజీ పన్నును పరిచయం చేశారు జైట్లీ. పన్ను ఎగవేతలకు కళ్లెం వేసేలా, నల్లధనానికి వ్యతిరేకంగానే ఐటీ చట్టం కింద ఎల్‌టీసీజీ నిబంధనలను కఠినతరం చేశారు. స్టాక్ మార్కెట్ మదుపరులు పన్నుల రూపంలో ఖజానాకు మరింత ఆదాయాన్ని అందించాల్సిన అవసరం ఉందన్న ప్రధాని మోదీ అభిప్రాయం.. జాతి నిర్మాణంలో పాలుపంచుకోవాలన్న పిలుపూ ఎల్‌టీసీజీకి కారణమయ్యాయి. ఈ క్రమంలోనే ఆయా సంస్థల షేర్లపై పెట్టుబడుల ద్వారా స్టాక్ మార్కెట్ల నుంచి వచ్చిన లాభాలు రూ.లక్ష దాటితే అందులో 10 శాతాన్ని ఎల్‌టీసీజీ పన్నుగా చెల్లించాల్సి ఉందన్నారు జైట్లీ. స్టాక్ మార్కెట్ల లాభాలు అత్యంత ఆకర్షణీయంగా ఉంటున్నాయన్న జైట్లీ.. లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ పరిధిలోకి ఈ లాభాల్ని తీసుకురావాల్సిన సమయం ఇదేనన్నారు. అయితే ఈ జనవరి 31 వరకు అందుకున్న అన్ని లాభాలపై ఈ పన్ను నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు ప్రకటించారు. కాగా, కొనుగోలు చేసిన షేర్లను ఏడాది లోపే తిరిగి అమ్మినప్పుడు వచ్చే క్యాపిటల్ గెయిన్స్‌పై ప్రస్తుతం 15 శాతం పన్ను వసూలు చేస్తున్నారు. ఏడాది తర్వాత అమ్మితే వచ్చిన లాభాలపై ఎలాంటి పన్ను ఉండట్లేదు.

10 శాతం పన్నును ప్రతిపాదించిన జైట్లీ

అయితే తాజా బడ్జెట్ ప్రతిపాదన ప్రకారం ఎల్‌టీసీజీ రూ. లక్ష దాటితే ఇప్పుడు 10 శాతం పన్ను పడనున్నది. స్టాక్ మార్కెట్ల లాభాలు దేశ వృద్ధిరేటుకు కీలకమని అభిప్రాయపడ్డ జైట్లీ.. ప్రస్తుతమున్న విధానంలో కేవలం స్వల్ప మార్పుల్నే ప్రతిపాదించామన్నారు. ఈ నిర్ణయంతో తొలి ఏడాది ఖజానాకు రూ.20,000 కోట్ల ఆదాయం రావచ్చని అంచనా వేశారు. ముమ్ముందు ఇది మరింత పెరుగగలదన్న ఆశాభావాన్నీ ఆయన వ్యక్తం చేశారు. అయినప్పటికీ గురువారం ట్రేడింగ్‌లో స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనవగా, ఒకానొక దశలో సెన్సెక్స్ ఏకంగా 400 పాయింట్లు పడిపోవడం గమనార్హం. కాగా, బడా సంస్థలకు కార్పొరేట్ పన్ను ప్రయోజనం లేకపోవడం కూడా నష్టాలకు దారితీసింది.



మార్కెట్లను ఆకట్టుకోని బడ్జెట్

కేంద్ర బడ్జెట్.. దేశీయ స్టాక్ మార్కెట్లను ఆకట్టుకోలేకపోయింది. ఎల్‌టీసీజీతోపాటు పెరిగిన ద్రవ్యలోటు కట్టడి లక్ష్యం.. మదుపరులను తీవ్ర అమ్మకాల ఒత్తిడికి గురిచేసింది. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 58.36 పాయింట్లు కోల్పోయి 35,906.66 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 10.80 పాయింట్లు పడిపోయి 11,016.90 వద్ద నిలిచింది. నిజానికి ఉదయం లాభాల్లోనే మొదలైన సూచీలు.. బడ్జెట్ ప్రసంగం మొదలైన దగ్గర్నుంచి నష్టాల్లోకి జారుకున్నాయి. ఈ క్రమంలోనే సెన్సెక్స్ గరిష్ఠ స్థాయి 36,256.83 పాయింట్లుగా ఉంటే, కనిష్ఠ స్థాయి 35,501.74 పాయింట్లుగా ఉన్నది. అలాగే నిఫ్టీ గరిష్ఠం 11,117.35 పాయింట్లుగా, కనిష్ఠం 10,878.80 పాయింట్లుగా ఉన్నది. గతేడాది బడ్జెట్ రోజున స్టాక్ మార్కెట్లు భారీ లాభాల్లో ముగియగా, సెన్సెక్స్ 485.68 పాయింట్లు, నిఫ్టీ 155.10 పాయింట్లు పుంజుకున్నాయి. ఇకపోతే నిరుడు బడ్జెట్ నుంచి ఇప్పటిదాకా సెన్సెక్స్ 7,765.02 పాయింట్లు, నిఫ్టీ 2,300.50 పాయింట్లు ఎగబాకాయి. ఇదిలావుంటే గురువారం ట్రేడింగ్‌లో కన్జ్యూమర్ డ్యూరబుల్స్, హెల్త్‌కేర్, చమురు, గ్యాస్, పీఎస్‌యు, రియల్టీ, బ్యాంకింగ్, టెక్నాలజీ, ఐటీ రంగాల షేర్లు నష్టపోయాయి. అయితే ఇన్‌ఫ్రా, క్యాపిటల్ గూడ్స్, ఆటో, ఎఫ్‌ఎంసీజీ, మెటల్, విద్యుత్ రంగాల షేర్లు లాభపడ్డాయి.

పాన్ తప్పనిసరి



పన్ను చెల్లింపుదారుల పరిధిని పెంచడంలో భాగంగా రూ.2.5 లక్షలు అంతకుమించి ఆర్థిక లావాదేవీలను ఏ సంస్థ జరుపాలన్నా.. పర్మినెంట్ అకౌంట్ నంబర్ (పాన్)ను తప్పనిసరి చేసింది కేంద్రం. ఏప్రిల్ 1 నుంచి ఇది అమల్లోకి వస్తుందని బడ్జెట్‌లో జైట్లీ తెలిపారు. ఒక ఆర్థిక సంవత్సరంలో ఈ పరిమితికి మించి జరిగే ఆయా ఆర్థిక లావాదేవీలకు పాన్‌ను జోడించాల్సిందేనన్నారు. అంతేగాక ఈ లావాదేవీలకు పాన్ అలాట్‌మెంట్ కోసం అసెస్మెంట్ ఆఫీసర్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. వ్యాపార సంస్థలకు పాన్.. యూనిక్ ఎంటిటీ నంబర్‌గా పరిగణించబడుతుందని చెప్పారు. మరోవైపు అంతర్జాతీయ ఆర్థిక సేవల కేంద్రం (ఐఎఫ్‌ఎస్‌సీ)లో అన్ని ఆర్థిక సేవల నియంత్రణ కోసం ఓ యూనిఫైడ్ అథారిటీని ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నదని జైట్లీ ఈ సందర్భంగా తెలిపారు.

బడ్జెట్ కేటాయింపులతో లాభపడిన షేర్లు

సంస్థ	లాభం (శాతాల్లో)	రంగం
శీతల్ కూల్ ప్రొడక్ట్స్	10	ఆహార తయారీ
అగ్రిటెక్	10	వ్యవసాయం
అవంతి ఫీడ్స్	7.95	ఆహార తయారీ
ఫ్రెష్‌ట్రాప్ ఫ్రూట్స్	7.55	ఆహార తయారీ
దిలీప్ బిల్డ్‌కాన్	5.54	మౌలికం
జీవీకే పవర్, ఇన్‌ఫ్రా	4.87	మౌలికం
జీఎమ్మార్ ఇన్‌ఫ్రా	4.60	మౌలికం
అరీస్ అగ్రో	3.37	వ్యవసాయం
ఎల్‌అండ్‌టి	2.77	మౌలికం

లగ్జరీ వాహనాలు మరింత భగ్గు

దిగుమతి సుంకం పెంపుతో 10 లక్షల వరకు పెరుగనున్న కార్ల ధరలు

రూ.50 వేల వరకు ప్రియంకానున్న ప్రీమియం బైకులు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: దేశీయ తయారీ రంగానికి ఊతమిచ్చేలా కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకున్నది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో దిగుమతి సుంకాన్ని 10 శాతం నుంచి 15 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించడంతో వాహన ధరలు భగ్గుమనబోతున్నాయి. కేంద్రం తీసుకున్న తాజా నిర్ణయంతో ఇతర దేశాల నుంచి దిగుమతి అవుతున్న విలాసవంతమైన కార్లు, బస్సులు రూ.10 లక్షల వరకు ప్రియంకానుండగా, అలాగే బైకులు రూ.50 వేల వరకు పెరుగనున్నాయి. ఇతర దేశాల నుంచి విడిభాగాలను దిగుమతి చేసుకొని ఇక్కడ తయారైన కార్లపై విధించే సుంకాన్ని కూడా 20 శాతం నుంచి 25 శాతానికి పెంచిన కేంద్రం..విడిభాగాలపై 7.5 శాతం నుంచి 15 శాతానికి, ట్రక్కులు, బస్సులకు వినియోగించే రేడియల్ టైర్లపై పన్ను 10 శాతం నుంచి 15 శాతానికి సవరించింది. ఈ నిర్ణయంతో ప్రీమియం బైకుల తయారీ సంస్థలైన హ్యార్లీ డేవిడ్‌సన్, ట్రయంఫ్ బైకులు రూ.15 వేల నుంచి రూ.50 వేల వరకు పెరుగనుండగా, లగ్జరీ కార్ల సంస్థలైన మెర్సిడెజ్ బెంజ్, బీఎండబ్ల్యూ, ఆడీలకు చెందిన వాహనాలు రూ.1.25 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ప్రియంకానున్నాయి. అలాగే ఇతర దేశాల నుంచి దిగుమతి అవుతున్న లగ్జరీ బస్సులు రూ.5 లక్షల నుంచి 10 లక్షల వరకు అధికంకానున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మేక్ ఇన్ ఇండియాకు మరింత ఊతమివ్వాలనే ఉద్దేశంలో భాగంగా దిగుమతులపై సుంకాన్ని పెంచినట్లు జైట్లీ ప్రకటించారు. దీనిపై భారత ఆటోమొబైల్ తయారీదారుల సంఘం(సియామ్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సుగాటో సేన్ మాట్లాడుతూ..విడిభాగాలపై సుంకం పెంచడంతో మొత్తం ఆటోమొబైల్ పరిశ్రమపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపనున్నదని చెప్పారు. ప్రతి ఒక కంపెనీ ఏదో విడిభాగాలను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటుండటంతో ఈ కఠిన నిర్ణయం అన్ని సంస్థలపై ప్రభావం చూపనున్నదని ఆయన పేర్కొన్నారు. కానీ, ఆటోమోటివ్ కంపొనెంట్ తయారీదారుల అసోసియేషన్ ఆఫ్ ఇండియా(అక్మా) ఈ నిర్ణయాన్ని స్వాగతించింది. ఎంపిక చేసిన ఇంజిన్‌కు సంబంధించిన విడిభాగాలు, బ్రేకులు, గేర్‌బాక్స్, ఎయిర్‌బ్యాగ్‌లపై పన్నును 15 శాతం వరకు పెంచారని అక్మా ప్రెసిడెంట్ నిర్మల్ మిండా తెలిపారు. కేంద్ర నిర్ణయం నిరాశపరిచిందని ఆడీ ఇండియా హెచ్ రాహిల్ అన్సారీ తెలిపారు. కస్టమ్ డ్యూటీ పెంచడం, సాంఘిక సంక్షేమ అవసరాలకోసం విధించే పన్ను కూడా విధించడంతో కచ్చితంగా ధరలను పెంచాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ఆటోమొబైల్ రంగంపై దిగుమతి సుంకం రూపంలో మరో పిడుగు పడినట్లు అయిందన్నారు. కేంద్ర నిర్ణయాన్ని దురదృష్టకరంగా అభివర్ణించారు మెర్సిడెజ్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈవో రోలాండ్ ఫోల్జర్. దీంతో కార్ల ధరలను రూ.1.35 లక్షల నుంచి రూ.5 లక్షల లోపు పెంచాల్సి ఉంటుందని ఆయన సంకేతాలిచ్చారు. దీనిపై జేఎల్‌ఆర్, బీఎండబ్ల్యూ ఇండియా వర్గాలు స్పందించడానికి నిరాకరించారు.

కేంద్ర బడ్జెట్ 2018-19 — స్థూలంగా ఇదీ పద్దు



(రూ. కోట్లలో)

	2016-17 వాస్తవ వ్యయాలు	2017-18 బడ్జెట్ అంచనాలు	2017-18 సవరించిన అంచనాలు	2018-19 బడ్జెట్ అంచనాలు
రెవెన్యూ ఆదాయాలు	1374203	1515771	1505428	1725738
మూలధన ఆదాయాలు	600991	630964	712322	716475
మొత్తం రాబడి	1975194	2146735	2217750	2442213
మొత్తం వ్యయం	1975194	2146735	2217750	2442213
రెవెన్యూ లోటు	316381	321163	438877	416034
విత్త లోటు	535618	546531	594849	624276
ప్రాథమిక లోటు	54904	23453	64006	48481

డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యం లక్ష కోట్లు

వచ్చే ఏడాది 80 వేల కోట్లు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా లక్ష కోట్ల రూపాయలు రావచ్చునని కేంద్రం అంచనావేస్తున్నది. వచ్చే ఏడాదికిగాను ఇది రూ.80 వేల కోట్లకు పరిమితంకానున్నదని 2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ వాటాల విక్రయానికి సంబంధించి డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్(దీపం)..ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్(ఈటీఎఫ్), డెబిట్ ఫండ్లను జారీచేయడానికి సిద్ధమైంది. 2017-18లో డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యం రూ.72,500 కోట్లు దాటిందని, త్వరలో లక్ష కోట్ల రూపాయలకు చేరుకునే అవకాశం ఉన్నదని ఆయన పేర్కొన్నారు. వచ్చే ఏడాది ఎయిర్ ఇండియాతోపాటు 24 ప్రభుత్వరంగ సంస్థల్లో వాటాలను విక్రయించనున్నట్లు జైట్లీ స్పష్టం చేశారు. కానీ, హెచ్‌పీసీఎల్‌ను ఓఎన్‌జీసీ టేకోవర్ మరో రెండు నెలల్లో పూర్తికానున్నట్లు ఆయన పేర్కొన్నా. ఈఐఎల్, ఎన్‌టీపీసీ, నాల్కో, ఆయిల్ ఇండియా లిమిటెడ్‌లతోపాటు రెండు ప్రభుత్వరంగ బీమా సంస్థలు, జీఐసీ, న్యూ ఇండియా అస్సూరెన్స్, హౌజింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(హుడ్కో)లు ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పీఎస్‌యూల్లో వాటాలను విక్రయించడం ద్వారా రూ.46,500 కోట్లు, వ్యూహాత్మక డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా రూ.15 వేల కోట్లు, బీమా కంపెనీలను స్టాక్ మార్కెట్లలో ప్రవేశపెట్టడంతో మరో రూ.11 వేల కోట్లు రావచ్చునని అంచనా వేసింది.

విలీనంకానున్న మూడు బీమా కంపెనీలు

డిజిన్వెస్ట్‌మెంట్‌లో భాగంగా మూడు ప్రభుత్వరంగ బీమా సంస్థలను విలీనం చేయనున్నట్లు అరుణ్ జైట్లీ ప్రకటించారు. ఒక్కటికానున్న సంస్థల్లో నేషనల్ ఇన్సూరెన్స్ కో లిమిటెడ్, యునిటెక్ ఇండియా అస్సూరెన్స్ కో లిమిటెడ్, ఓరియంటల్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలు ఉన్నాయి. విలీనమైన తర్వాత ఏర్పడనున్న సంస్థను స్టాక్ మార్కెట్లో లిస్ట్‌చేసే ఆలోచన కూడా ఉన్నదని జైట్లీ పేర్కొన్నారు.

చేజారిన ద్రవ్యలోటు లక్ష్యం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న ద్రవ్యలోటు లక్ష్యం కంటే అధికంగా 3.5 శాతానికి చేరుకునే అవకాశం ఉన్నదని జైట్లీ తెలిపారు. గతంలో లోటు 3.2 శాతంగా ఉండనున్నదని అంచనావేసింది. ఇదే క్రమంలో వచ్చే ఏడాది 3.3 శాతానికి నియంత్రించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. లోటును తగ్గించడానికి కేంద్రం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయని, 2014-15లో 4.1 శాతంగా ఉన్న లోటును ఆ తర్వాతి ఏడాదికిగాను 3.9 శాతానికి, 2016-17లో ఇది 3.5 శాతానికి నియంత్రించాలనుకుంటున్నట్లు చెప్పారు.

ఎవరేమన్నారు?



గ్రామీణాభివృద్ధి, వ్యవసాయంపై ప్రభుత్వం దృష్టి సారించడం ఆహ్వానించదగ్గ పరిణామం. 'ఆయుష్మాన్ భారత్' కార్యక్రమం అద్భుతం. అయితే బడా సంస్థలకు కార్పొరేట్ పన్ను ప్రయోజనం లేకపోవడం అసంతృప్తిని కలిగించింది

- సతీష్ రెడ్డి, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ చైర్మన్



ఆర్థిక మంత్రి జైట్లీ.. బడ్జెట్‌ను అత్యుత్తమంగా రూపొందించారు. ముఖ్యంగా సాంకేతిక సమాజంలోకి భారత్‌ను తీసుకెళ్లడానికి దోహదం చేసేలా బడ్జెట్ ఉన్నది. పరిశోధనా, శిక్షణ, కృత్రిమ మేధస్సులో నైపుణ్యం, రోబోటిక్స్, డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్‌లో పెట్టుబడులు ఉద్యోగావకాశాలను సృష్టిస్తాయి

- బీవీఆర్ మోహన్ రెడ్డి, సైయెంట్ వ్యవస్థాపకుడు



వ్యవసాయం, విద్యా రంగాల బలోపేతానికి బడ్జెట్ ప్రేరణను ఇచ్చింది. దేశ జనాభాలో ఇప్పటికీ 50 శాతం మంది వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్నారు. కాబట్టి రైతుల ఆదాయం ఏమాత్రం పెరిగినా.. అది దేశ ఆర్థిక వృద్ధికి ఎంతగానో దోహదపడగలదు. జాతీయ ఆరోగ్య సంరక్షణ పథకాన్ని స్వాగతిస్తున్నాం

- వీ రాజన్న, సీఐఐ తెలంగాణ చైర్మన్



బడ్జెట్ కేటాయింపుల్లో తెలుగు రాష్ర్టాలను పట్టించుకోలేదు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు మేలు కలిగించేదిగా ఉన్నా, పారిశ్రామిక వర్గాన్ని మాత్రం విస్మరించారు. తెలంగాణ రాష్ట్రం కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా అడిగినా స్పందించకపోవడం బాధాకరం.

- గౌర శ్రీనివాస్, ఎఫ్‌ట్యాప్సీ రాష్ట్ర అధ్యక్షుడు



సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు కోరిన అంశాలను కేంద్రం పెడచెవిన పెట్టింది. నోట్లరద్దు, జీఎస్టీతో జరిగిన నష్టాన్ని భర్తీ చేయాలని విన్నవించినా పట్టించుకోలే.

- సుధీర్‌రెడ్డి, టీపారిశ్రామికవేత్తల సమాఖ్య అధ్యక్షుడు




జీఎస్టీ పన్నుల ఫైలింగ్ సరళీకరిస్తారని ఆశించినా నిరాశే ఎదురైంది. సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు బ్రిడ్జి లోన్లు ఇస్తామనే అంశంపై స్పష్టత ఇవ్వలేదు.

- రమాదేవి, ఎలిప్ అధ్యక్షురాలు

ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్


ఈ ఏడాది ద్వితీయార్థంలో 7.5 శాతం వృద్ధిరేటు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: భారత ఆర్థిక వ్యవస్థ త్వరలో 8 శాతానికి పైగా వృద్ధిరేటును అందుకోవడంతో పాటు ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఐదో స్థానాన్ని కైవసం చేసుకోవడం ఖాయమని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సర ద్వితీయార్థంలో దేశ ఆర్థిక వ్యవస్థ 7.2 శాతం నుంచి 7.5 శాతం వృద్ధిరేటును నమోదు చేస్తుందని అంచనా వేస్తున్నట్లు ఆయన గురువారం తన బడ్జెట్ ప్రసంగంలో స్పష్టం చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రస్తుత ఎన్‌డీఏ ప్రభుత్వ హయాంలో తొలి మూడేళ్ల పాటు దేశ ఆర్థిక వ్యవస్థ సగటున 7.5 శాతం మేర వృద్ధి చెందిందని, పరిమాణ రీత్యా ప్రస్తుతం 2.5 లక్షల డాలర్లకు చేరుకుని ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఏడో స్థానంలో నిలిచిందని ఆయన తెలిపారు. దేశంలో తయారీ రంగం మళ్లీ పట్టాలెక్కిందని, జీడీపీ వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న సేవల రంగం కూడా మళ్లీ ఊపందుకుని 8 శాతానికి పైగా వృద్ధిరేటుతో ముందుకు సాగుతున్నదని ఆయన తెలిపారు. 2014 మే నెలలో మోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టినప్పటి నుంచి దేశ ఆర్థిక వ్యవస్థ ప్రగతి పథంలో పయనిస్తోందని జైట్లీ చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సర తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో 5.7 శాతానికి పతనమై మూడేళ్ల కనిష్ఠ స్థాయికి దిగజారిన స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటు రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో 6.3 శాతానికి పుంజుకున్న విషయం తెలిసిందే.

వచ్చే ఏడాది రూ.4.07 లక్షల కోట్ల రుణ సమీకరణ

ఈ ఏడాది కంటే రూ.73 వేల కోట్లు ఎక్కువ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: వచ్చే ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం మార్కెట్ల నుంచి రూ.4.07 లక్షల కోట్ల రుణాలను సమీకరించనున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017-18)లో సేకరించదల్చుకున్న రుణాల కంటే ఇది దాదాపు రూ.73 వేల కోట్లు తక్కువ. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నికరంగా రూ.3.5 లక్షల కోట్ల రుణాలను సమీకరించాల్సి ఉంటుందని గత సార్వత్రిక బడ్జెట్‌లో అంచనా వేయగా ఆ తర్వాత దీనిని సవరించి గణనీయంగా రూ.4.79 లక్షల కోట్లకు పెంచారు. ఇదే సమయంలో స్థూలంగా రూ.5.8 లక్షల కోట్ల రుణాలను సేకరించాల్సి ఉంటుందని గత బడ్జెట్‌లో వేసిన అంచనాను స్వల్పంగా సవరించి రూ.5.99 లక్షల కోట్లకు పెంచిన కేంద్ర ప్రభుత్వం వచ్చే ఆర్థిక సంవ్సరానికి గాను దీనిని రూ.6.05 లక్షల కోట్లకు పెంచింది. గతంలో సేకరించిన రుణాలకు సంబంధించి తిరిగి చెల్లించే మొత్తాలు, వాటిపై చెల్లించే వడ్డీలు కూడా స్థూల రుణాల్లో భాగంగా ఉంటాయి. గతంలో తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించేందుకు వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.1.4 లక్షల కోట్లు చెల్లించాల్సి ఉంటుందని ప్రభుత్వం అంచనా వేసింది. ద్రవ్యలోటును పూడ్చుకునేందుకు ప్రభుత్వం మార్కెట్ల నుంచి రుణాలను సమీకరిస్తుంది. ఏడాదిలోపు కాల పరిమితి కలిగిన డేటెట్ సెక్యూరిటీలు, ట్రెజరీ బిల్లుల ద్వారా ప్రభుత్వం ఈ రుణాలను సమీకరిస్తుంది. మార్కెట్ల నుంచి అదనంగా సేకరించదల్చుకున్న రుణాలను ప్రభుత్వం గత నెలలో 60 శాతం (రూ.20 వేల కోట్లకు) కుదించిన విషయం తెలిసిందే.

10 వేల కోట్లు

2018-19 సంవత్సరానికి టెలికం రంగంలో మౌలికవసతుల కల్పనకు రూ.10వేల కోట్లు కేటాయించారు. గ్రామాల్లో 5లక్షల వైఫై రూటర్లు ఏర్పాటు చేయనున్నారు. ఐఐటీ మద్రాస్‌లో దేశీయ '5జీ సెంటర్' ఏర్పాటు చేయనున్నారు.



- గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులకు 14.34లక్షల కోట్లు.
- జాతీయ ఉపాధి మిషన్ కోసం రూ. 5750 కోట్లు.
- నీటి వసతిలేని 96 జిల్లాల కోసం ప్రత్యేక నిధి. ఇంటింటి తాగునీటి పథకానికి రూ.77,500 కోట్లు.
- రోడ్లు మౌలిక వసతులకు రూ. 9.64లక్షల కోట్లు.
- ప్రధానమంత్రి గ్రామ సడక్‌యోజనతో 2022నాటిని అన్ని గ్రామాల్లో పక్కా రోడ్ల నిర్మాణం.
- గ్రామీణ పారిశుద్ధ్య పథకానికి రూ. 16,713 కోట్లు
- ఎస్సీల సంక్షేమం కోసం రూ. 56,619 కోట్లు. ఎస్టీల సంక్షేమానికి రూ. 39,135 కోట్లు
- విద్యారంగంలో మౌలిక సౌకర్యాలకు రూ.లక్ష కోట్లు. గిరిజన ప్రాంతాల్లో 'ఏకలవ్య' పాఠశాలల ఏర్పాటు.
- జీవన ప్రమాణాల మెరుగుదలకు పైలట్ ప్రాజెక్టు కింద 115 జిల్లాల ఎంపిక.



దుర్వినియోగమైన 'సంస్కరణలు'

ప్రభుత్వం 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు అవుతుందని చెప్తున్నది కానీ వ్యవసాయ రంగంలో 12 శాతం వృద్ధిరేటు నమోదు చేయనంత వరకు అది అసాధ్యం. ఆ లక్ష్యం చేరుకునేవరకు పాలక పార్టీలు చేసే వాగ్దానం వట్టి డొల్ల. బడ్జెట్‌లో ఇచ్చిన హామీలు ప్రభుత్వం ఎలా నెరవేరుస్తుందో చూడాల్సి ఉంది. ద్రవ్యలోటు పెరిగే సంకేతాలు కనిపిస్తున్నాయి. బడ్జెట్‌ను నిందించాలని భావించడం లేదు. సంస్కరణ అన్న పదం పలుసార్లు దుర్వినియోగానికి గురైంది.

- మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్

రక్షణ శాఖకు వెన్నుదన్ను

సాయుధ దళాలకు రూ.2.95 లక్షల కోట్లు • రికార్డుస్థాయిలో పెన్షన్లకు రూ.1.08 లక్షల కోట్లు

- చైనా యుద్ధం తర్వాత జీడీపీలో తక్కువ శాతం కేటాయింపులు
- రెవెన్యూ ఖర్చు కంటే పింఛన్లకు అధిక నిధులు
- రష్యా మిగ్‌ల స్థానంలో అమెరికా ఎఫ్-16ల కొనుగోళ్లు
- జైట్లీ బడ్జెట్ ప్రతిపాదనలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రక్షణ శాఖకు 2.95 లక్షల కోట్ల రూపాయలను కేటాయించారు. సైనికుల పెన్షన్లకోసం ప్రత్యేకంగా సుమారు లక్ష కోట్ల రూపాయలను ప్రతిపాదించారు. ప్రస్తుతం నడుస్తున్న ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రక్షణ శాఖ బడ్జెట్ దాదాపు 7.81శాతం అధికం కాగా మొత్తం బడ్జెట్ విలువ (రూ.24, 42, 213కోట్లు)లో 12.1శాతం భాగంగా ఉన్నది. స్థూల జాతీయోత్పత్తి రేటు (జీడీపీ)లో మాత్రం రక్షణ బడ్జెట్ 1962 చైనా యుద్ధం తర్వాతి కంటే చాలా తక్కువ శాతం నిధులను కేటాయించారు. 1962 అక్టోబర్‌లో చైనా యుద్ధం ముగిసిన అనంతరం 1963లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రక్షణ శాఖ బడ్జెట్ జీడీపీలో 2.3శాతం కాగా గురువారం నాటి కేటాయింపులు జీడీపీలో 1.58 శాతమే ఉండటం గమనార్హం. రక్షణ శాఖకు మొత్తంగా కేటాయించిన మొత్తం నిధులు రూ.2,95,511 లక్షల కోట్లు కాగా అందులో త్రివిధ దళాలకు సంబంధించి కొత్త ఆయుధాలు, విమానాలు, యుద్ధ నౌకలు, ఇతర హార్డ్‌వేర్ కొనుగోలు కోసం రూ.99, 947 కోట్ల రూపాయలను కేటాయించారు. దేశ అంతర్గత భద్రతను పరిరక్షించడంలో అనేక సవాళ్లను.. సరిహద్దుల్లో ఉన్న మన సైనికులు దీటుగా ఎదుర్కొంటున్నారని జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో ప్రశంసించారు. మరోపక్క 1, 95, 947 కోట్లను రోజువారీ ఖర్చులు, జీతభత్యాల కోసం మంజూరుచేశారు. ఇక రక్షణ శాఖ సిబ్బంది పెన్షన్ల కోసం రికార్డు స్థాయిలో 1,08, 853 కోట్లను కేటాయించారు. సైనికుల పింఛన్ మొత్తం లక్ష కోట్ల రూపాయలను దాటడం ఇదే మొదటిసారి. దీంతోపాటు దేశంలో రెండు రక్షణ ఉత్పత్తుల పారిశ్రామిక కారిడార్లను అభివృద్ధి చేస్తామని జైట్లీ తెలిపారు. 'రక్షణ ఉత్పత్తులను దేశీయంగా ఉత్పత్తి చేసేలా ప్రభుత్వ, ప్రైవేట్, ఎంఎస్‌ఎంఈ రంగాల్లో ప్రోత్సహించేందుకు త్వరలోనే రక్షణ ఉత్పత్తుల విధానం-2018ను ప్రకటించబోతున్నాం. జమ్ము కశ్మీర్‌లో, ఈశాన్య రాష్ట్రాల్లో ఒక్కో రక్షణ ఉత్పత్తుల పారిశ్రామిక కారిడార్లను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకొంటుంది. మన దేశం తన రక్షణ అవసరాలను తానే పూర్తి చేసుకొనేలా స్వయం సమృద్ధం చేయడమే ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విధానాన్ని కూడా సులభతరం చేస్తాం.' అని జైట్లీ తెలిపారు. రక్షణ రంగం ఆధునీకరణకు జైట్లీ చేసిన కేటాయింపులు ఎంతమాత్రం సరిపోవని రక్షణ రంగ నిపుణుడు, డిఫెన్స్ స్టడీస్ అండ్ అనాలిసిస్ సంస్థకు చెం దిన డాక్టర్ లక్ష్మణ్ బెహెరా వ్యాఖ్యానించారు. భారత సైన్యం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించడానికి ఈ కేటాయింపులు సరిపోవని మరో నిపుణుడు బ్రిగేడియర్ (రిటైర్డ్) ఎస్కే చటర్జీ తెలిపారు.

మిగ్ నుంచి ఎఫ్-16

భారత సైన్యంలో ఎగిరే శవపేటికగా మారిన రష్యాకు చెందిన మిగ్ యుద్ధ విమానాల స్థానంలో అమెరికా లాఖెన్డ్ మార్టిన్, జాస్ 39 గ్రిపెన్ కంపెనీలు తయారు చేస్తున్న 126 ఎఫ్ 16 విమానాలను కొనుగోలు చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ రెండు కంపెనీల్లో ఎవరితో భారత్ ఒప్పందం చేసుకొంటే, ఆ కంపెనీ మోదీ 'మేకిన్ ఇండియా'లో భాగస్వామి అవుతుంది. అంతేకాకుండా 2019 నాటికి వాయుసేనలో రెండు సుఖోయ్ యుద్ధ విమానాలను చేర్చాలని ఆలోచిస్తున్నది. వీటితోపాటు రెండు రాఫెల్, ఆరు తేజస్, ఒక సింగిల్ ఇంజిన్ ఫైటర్‌లను వాయుసేనకు కొత్తగా కొనుగోలుచేయనున్నది. ఇక నౌకాదళం 2020-21 నాటికి 22 జలాంతర్గాములను కొనుగోలు చేయాలని ప్రణాళిక వేసుకొన్నది. ఇక కాల్బలం కూడా నూతన ఆయుధాలను సమకూర్చుకోవడానికి సమాయత్తమవుతున్నది.

కేంద్ర హోంశాఖకు .92,679 కోట్లు

పోలీసులు, భద్రతాదళాలకు గతంలో కంటే అధికంగా నిధుల కేటాయింపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: కేంద్రహోంమంత్రిత్వశాఖకు ఈ బడ్జెట్‌లో రూ.92,679 కోట్లు కేటాయించారు. 2017-18లో ఈ శాఖకు రూ.83,823 కోట్ల కేటాయించగా, ఈ ఏడాది 10.5 శాతం ఎక్కువగా ఇచ్చారు. పోలీసు బలగాలకు మౌలిక సదుపాయాలు పెంచాలని నిర్ణయించారు. రాజధానిలో శాంతిభద్రతలు నిర్వహిస్తున్న ఢిల్లీ పోలీసులకు రూ.6946 కోట్లు, పాకిస్థాన్, చైనా, భారత సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో ఆ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలకు రూ.1750 కోట్లు కేటాయించారు. ఉగ్రవాదం, తిరుగుబాటు సమస్యలున్న జమ్ముకశ్మీర్, ఈశాన్యరాష్ట్రాలతోపాటు దేశంలో మరికొన్ని ప్రాంతాల్లో వినియోగిస్తున్న సీఆర్పీఎఫ్‌కు రూ.20,268 కోట్లు కేటాయించారు. నిరుటి కేటాయింపులకంటె ఇది రూ.1500 కోట్లు ఎక్కువ. సరిహద్దు భద్రతాదళానికి లోగడ కంటె రూ.1000 కోట్లు ఎక్కువగా ఈసారి రూ.17118 కోట్లు ఇచ్చారు. అన్నిరకాల కేంద్రభద్రతాదళాలకు కలిపి రూ.62,741 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో ఈ కేటాయింపులు రూ. 58,148 కోట్లు మాత్రమే. ఇంటలిజెన్స్‌బ్యూరోకు రూ.1876 కోట్లు, ప్రధాని, మాజీ ప్రధానులు, వారి కుటుంబాలకు భద్రత కల్పిస్తున్న స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్‌నకు రూ.385 కోట్లు కేటాయించారు. పోలీసులకు మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.4289 కోట్లు ఇచ్చారు. నిర్భయ పథకానికి రూ.100 కోట్లు, మహిళలు, పిల్లలపై సైబర్ నేరాల నియంత్రణ, జాతీయ అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థలకు కలిపి రూ.81.75 కోట్లు కేటాయించారు. పోలీసు బలగాల ఆధునీకరణకు రూ.897 కోట్లు, జాతీయ విపత్తు ప్రతిస్పందనా దళానికి రూ.864 కోట్లు కేటాయించారు. జనాభా లెక్కల సేకరణకు రూ.551 కోట్లు, జమ్ముకశ్మీర్‌లో పారిశ్రామిక చొరువకు ప్రత్యేకంగా రూ.100 కోట్లు, హిందీభాషా ప్రచారానికి రూ.75 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వాలకు గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ కోసం రూ.1139 కోట్లు ఇచ్చారు. కేంద్రపాలిక ప్రాంతాలకు నిధులు కేటాయించారు.

పంటలకు కనీస మద్దతు ధర పెంపు ప్రకటన ఏదీ?

- నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్ర బడ్జెట్‌లో రైతుల పంటకు కనీస మద్దతు ధర పెంపు ప్రకటన లేకపోవడం బాధాకరమని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత అన్నారు. కనీస మద్దతు ధరలను 50 శాతం పెంచుతామని ఎన్నికల సమయంలో బీజేపీ ఇచ్చిన హామీని ఆమె గుర్తుచేశారు. గత ఏడాది రబీ పంటలకు 10 శాతమే మద్దతు ధర పెంచి చేతులు దులుపుకొన్నదని విమర్శించారు. మద్దతు ధరను 50 శాతానికి పైగా పెంచి రైతులను ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. ఈ బడ్జెట్‌లో గ్రామీణ ప్రాంతాలకు పెద్దగా ప్రయోజనం చేకూర్చే అంశాలేవీ కన్పించడం లేదని, కేంద్ర బడ్జెట్ పేదల పక్షాన ఉంటే బాగుండేదన్నారు. ప్రజలకు ఆరోగ్యబీమా కోసం రూ.5 లక్షలు ఇవ్వడం బాగుంది.. దీన్ని 10 కోట్ల మందికి అమలు చేస్తామని చెప్పిన ఆర్థికమంత్రి.. పది కోట్ల కుటుంబాలకా? పది కోట్ల జనాభాకా? అనేది స్పష్టం చేయాలని చెప్పారు. ఈవోడీబీలో 42స్థాయిలను అధిగమించి పైకి వచ్చామని చెప్పిన కేంద్రం దీంట్లో రాష్ట్రాల పాత్రను ప్రస్తావించకపోవడం బాగోలేదని అభిప్రాయపడ్డారు. ఉపాధి హామీ పథకానికి కూలీలకు నేరుగా ఢిల్లీ నుంచి కూలి డబ్బు ఇవ్వాలనే దానిపై రాష్ట్రాలు సీరియస్‌గా ఆలోచించాలని సూచించారు. నిధులను రాష్ట్రాలకు కాకుండా నేరుగా కూలీలకు ఇవ్వడం ఆహ్వానించదగిన పరిణామం కాదన్నారు.

మంత్రిత్వశాఖల పరంగా బడ్జెట్



కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల పరంగా కాకుండా మంత్రిత్వశాఖల పరంగా బడ్జెట్ కేటాయించింది. గత ఏడాది నుంచి ఈ విధానాన్ని అవలంబిస్తున్నది. రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా కేంద్రం నుంచి వచ్చే నిధులను ఎప్పటికప్పుడు ఒత్తిడి తీసుకువచ్చి సాధిస్తాం. సీఎం కేసీఆర్ రూపొందించిన బడ్జెట్‌లాంటిది కేంద్రమే కాదు.. మరే దేశంలోనూ ఉండదు. అన్నివర్గాల కష్టాలు, అవసరాలను దృష్టిలో పెట్టుకుని కేసీఆర్ బడ్జెట్ రూపొందిస్తారు.

- ఏపీ జితేందర్‌రెడ్డి, లోక్‌సభ టీఆర్‌ఎస్ పక్షనేత

రాష్ట్రాలకు సమాచారం లేకుండానే ప్రకటన



ఆరోగ్య భద్రత పథకంపై అరుణ్ జైట్లీ నిజాలు దాచారు. ఈ పథకం కోసం కేంద్ర ప్రభుత్వం 60శాతం, రాష్ట్రాలు 40శాతం వ్యయాన్ని భరించాలని ఆర్థికశాఖ కార్యదర్శి చేసిన వ్యాఖ్యలు ఇందుకు నిదర్శనం. రాష్ట్ర ప్రభుత్వాలను అడుగకుండా ఇలాంటి పథకాలపై కేంద్రం నిర్ణయం తీసుకోవడం సరికాదు. కేంద్ర బడ్జెట్‌లో సుదీర్ఘ ఉపన్యాసం తప్ప విషయమేమీలేదు. వైద్య కళాశాలల పేరిట అరుణ్ జైట్లీ లెక్కలు గారడీ చూపించే ప్రయత్నం చేశారు. ఒక్కోరాష్ట్రానికి ఒక్కో మెడికల్ కళాశాల అంటూనే దేశవ్యాప్తంగా 24 మెడికల్ కాలేజీలను మాత్రమే ప్రకటించారు. ఒకప్పుడు దేశాన్ని నడిపించిన ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడం సరికాదు.

- బీ వినోద్‌కుమార్, ఎంపీ, కరీంనగర్

తెలంగాణ బడ్జెటే బాగుంది



రాష్ట్ర ప్రభుత్వ పథకాలు మిషన్ భగీరథ, కాకతీయ, నీటిపారుదల ప్రాజెక్టుల కోసం నిధులు కోరాం. కేంద్రం సైతం ఇంటింటికీ మంచినీటి పథకం కోసం నిధులు కేటాయించింది. ఈ పథకంలో భాగంగా ఇంటింటికీ నీరందించే మిషన్ భగీరథకు నిధులు కేటాయిస్తారని ఆశిస్తున్నాం. కేంద్ర బడ్జెట్‌తో పోలిస్తే తెలంగాణ రాష్ట్ర బడ్జెటే బాగుంది. తెలంగాణ పెట్టుబడి పెడితే, దేశానికి తిరిగి రాష్ట్రం తన తోడ్పాటునందిస్తుంది. దేశవ్యాప్తంగా పరిశీలిస్తే తెలంగాణ నుంచి వచ్చే పన్నుల ఆదాయమే ఎక్కువ.

- కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎంపీ, చేవెళ్ల,

మద్దతు ధర కల్పనకు నిధులు కేటాయించాల్సింది



సేంద్రియ వ్యవసాయానికి కేంద్ర బడ్జెట్‌లో ప్రాధాన్యం కల్పించాలని నిర్ణయించడం ఆహ్వానించదగిన పరిణామం. కేంద్రప్రభుత్వం చేపట్టనున్న ఈనామ్ విస్తరణ, క్లస్టర్ల ఏర్పాటు, సేంద్రియ సాగువంటి అంశాలను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్నది. స్వామినాథన్ కమిటీ సిఫారసుల ఆధారంగా మద్దతు ధర ఇచ్చేందుకు నిధులు కేటాయిస్తే బాగుండేది. బడ్జెట్‌లో వ్యవసాయం, అనుబంధరంగాలకు మరిన్ని కేటాయింపులు చేస్తే బాగుండేది.

- పోచారం శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి

రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు



తెలంగాణ రాష్ట్ర ఆశలను కేంద్ర బడ్జెట్ వమ్ముచేసింది. కేంద్ర బడ్జెట్లో పారదర్శకత లోపించింది. బడ్జెట్‌తో మన రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు. తెలంగాణలో అమలుచేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు కేంద్రం సాయం చేయలేదు. మిషన్‌కాకతీయ, మిషన్‌భగీరథ, కాళేశ్వరం వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులకు కేంద్రం నుంచి నిధుల ఊసేలేదు.

- జోగురామన్న, అటవీ, బీసీ సంక్షేమశాఖ మంత్రి

వ్యవసాయ, ఆరోగ్యరంగాలకు కేటాయింపులు భేష్

కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ, ఆరోగ్యరంగాలకు భారీగా కేటాయింపులు చేయడం అభినందనీయం. వానకాలం పంటకు కనీస మద్దతు ధరను ఉత్పత్తి వ్యయానికి 50శాతం కలిపి లెక్కిస్తామని, ఇతర పంటలకు కూడా ఇదే విధానాన్ని పాటిస్తామని ఆర్థిక మంత్రి చెప్పడం రైతులకు ఎంతో మేలు చేస్తుంది.

-నితీశ్‌కుమార్, బీహార్ ముఖ్యమంత్రి

రైతు ఆదాయానికి భారీ చేయూత

కేంద్ర బడ్జెట్ రైతుల ఆదాయం పెరుగుదలకు భారీగా దోహదం చేస్తుంది. పంట ఉత్పత్తి వ్యయానికి 50 శాతం వ్యయాన్ని అదనంగా కలిపి మద్దతు ధరను లెక్కిస్తామని కేంద్రం చెప్పడాన్ని స్వాగతిస్తున్నా. ఇది రైతు ఆదాయం పెంపునకు దోహదం చేస్తుంది. ఆర్గానిక్ వ్యవసాయంతో రైతులకు మేలు.

-శివరాజ్‌సింగ్‌చౌహాన్, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి

ఇది పేదలు, రైతుల బడ్జెట్

ఇది పేదలు, రైతుల అభివృద్ధి బడ్జెట్. వ్యవసాయ మార్కెట్ల అభివృద్ధికి రూ.2000 కోట్లు కేటాయించడం ద్వారా రైతులు గిట్టుబాటు ధరలకు తమ ఉత్పత్తులను అమ్ముకొనే సౌలభ్యం కలుగుతుంది. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో జీవితాల్లో వెలుగులు నిండుతాయి.

-మనోహర్‌లాల్ ఖట్టర్, హర్యానా ముఖ్యమంత్రి

పేదల జీవితాల్లో మార్పులు

ప్రజాసంక్షేమం ప్రాధాన్యంగా 2018-19 బడ్జెట్‌ను రూపొందించింది. ఈ బడ్జెట్ రైతులు, పేదల జీవితాల్లో మార్పులను తీసుకొస్తుంది. ప్రజల కోసం చారిత్రాత్మకంగా ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ బడ్జెట్‌ను తీర్చిదిద్దారు.

-రమణ్‌సింగ్, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి

ఆర్థిక వ్యవస్థ పురోగతికి ఊతం

జైట్లీ ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశఆర్థిక వ్యవస్థ పురోగతికి ఊతమిస్తుంది. ముఖ్యంగా మౌలిక, వైద్య రంగాలకు ఈ బడ్జెట్ ప్రోత్సాహకరంగా ఉన్నది. వ్యవసాయానికి, చిన్న పరిశ్రమలకు ఆర్థిక వ్యవస్థ పురోగతికి తీసుకొన్న చర్యలు.

-దేవేంద్ర ఫడ్నవీస్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి

ప్రతికూల బడ్జెట్, సూపర్ ఫ్లాప్ షో

ప్రతికూల బడ్జెట్. సూపర్ ఫ్లాప్ షో. ప్రజా వ్యతిరేకం. బడ్జెట్ ప్రతిపాదనలతో నిరాశకు గురయ్యా. ఉపాధి కల్పనకు దిశా నిర్దేశం చేయలేదు. పలు సామాజిక పథకాలకు నిధుల్లో కోత విధించారు. మధ్యతరగతికి ఒరిగిందేమీ లేదు.

- పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

రుణమాఫీ ప్రస్తావనే లేదు

రైతుల దురవస్థల పరిష్కారంలో విఫలం. ప్రీ బడ్జెట్ సమావేశంలో చేసిన ప్రతిపాదనల ఊసేలేదు. రుణమాఫీ ప్రస్తావనే చేయలేదు. స్వామినాథన్ కమిటీ సిఫారసుల అమలులో విఫలం. విజన్ లేదు. రైతుల వ్యతిరేక బడ్జెట్ ఇది.

- పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్

విజన్ లోపించింది

శుష్క వాగ్దానాలు తప్ప విజన్ లోపించింది. వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల కోసమే బడ్జెట్ రూపొందించినట్లు కనిపిస్తున్నది. ప్రకటనలు తప్ప కేటాయింపులు శూన్యం. వ్యవసాయ సమస్యల ప్రస్తావనే లేదు.

- కర్ణాటక సీఎం సిద్ధరామయ్య

అవసరాలు, నైపుణ్యాల కలబోత

- మార్చి నెల జీఎస్టీ వసూళ్లు కలువకపోవటం దెబ్బే
- బడ్జెట్ అనంతరం మీడియాతో జైట్లీ



న్యూఢిల్లీ: ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత అవసరాలు, ద్రవ్య నైపుణ్యం కలగలిసిన మిశ్రమంగా బడ్జెట్‌ను ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ అభివర్ణించారు. లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన అనంతరం మీడియాతో మాట్లాడారు. మార్చి నెలకు సంబంధించిన జీఎస్టీ వసూళ్లు ఏప్రిల్‌లో వస్తాయి కాబట్టి, ఫిబ్రవరి వరకయ్యే జీఎస్టీ వసూళ్లకే పరిమితం కావాల్సి వస్తున్నదని మంత్రి చెప్పారు. దీనిపై విలేకర్ల సమావేశంలో ఆయన వివరణ ఇచ్చారు. స్పెక్ట్రమ్ వేలంపాట, ఆర్‌బీఐ డివిడెండ్ చెల్లింపు వంటివి తమ ప్రభుత్వం చేపట్టిన వ్యవస్థీకృత సంస్కరణలకు నిదర్శనమన్నారు. ప్రత్యక్ష పన్నుల వసూళ్లు, ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా ద్రవ్యలోటును గణనీయంగా పూడ్చుకుంటున్నప్పటికీ.. జీఎస్టీ వసూళ్లలో ఒక నెల వసూళ్లు చేరకపోవటం వల్లే ఆదాయం-వ్యయంలో స్వల్ప అంతరం నెలకొన్నదని తెలిపారు. లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్‌పై 10 శాతం పన్ను విధించటాన్ని జైట్లీ సమర్థించుకుంటూ.. మార్కెట్లు ఆ మేరకు బలోపేతమయ్యాయి కాబట్టే ఈ పన్ను విధించటానికి అవకాశం లభించిందన్నారు.

అందరి కండ్లూ జైట్లీ వైపే..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ తన పదవీకాలంలో వరుసగా ఐదోది. లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వంలో ఇది చివరి పూర్తిస్థాయి బడ్జెట్. ఎన్నికలకు ముందు ప్రకటించనున్న బడ్జెట్ ఎలా ఉంటుందో అన్న ఉత్కంఠ రేపడంతో అందరి కండ్లూ అరుణ్‌జైట్లీ వైపే చూశాయి. 66 ఏండ్ల అరుణ్‌జైట్లీ బూడిదరంగు కుర్తా, నల్లని నెహ్రూ కోటు వేసుకుని సభకు చాలా ముందుగానే వచ్చి తన సీట్లో కూర్చున్నారు. 1.50 గంటలపాటు కొనసాగిన ప్రసంగం సందర్భంగా జైట్లీ తొలుత 25 నిమిషాలసేపు నిలుచునే చదివారు. ఆ తర్వాత కూర్చుని ప్రసంగించిన ఆయన ముగింపు సందర్భంలో మళ్లీ కొద్దిసేపు నిలబడ్డారు. ఆయన ప్రసంగం వినేందుకు వచ్చిన భార్య సంగీత, కొడుకు రోహన్.. స్పీకర్ గ్యాలరీలో కూర్చున్నారు. బడ్జెట్ సమర్పణకు ముందు జైట్లీ.. రాష్ట్రపతిభవన్‌లో రాష్ట్రపతి రాంనాథ్‌కోవింద్‌ను కలుసుకున్నారు. జైట్లీ బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంలో ప్రధాని మోదీ పలుమార్లు బల్లను గట్టిగా చరుస్తూ మంత్రులను, ఎన్డీయే ఎంపీలను ప్రేరేపించారు. ప్రసంగం ముగియగానే జైట్లీని మోదీ అభినందించారు. సభాకార్యక్రమాలు ప్రారంభమైన తర్వాత వచ్చిన రాహుల్ మధ్యలో కొద్దిసేపు బయటకు వెళ్లివచ్చారు. యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ ఎం తంబిదురై, లోక్‌సభలో కాంగ్రెస్‌పక్ష నాయకుడు మల్లికార్జునఖర్గే, మాజీ ప్రధానమంత్రి హెచ్‌డీ దేవెగౌడ, సమాజ్‌వాదీ పార్టీ నేత ములాయంసింగ్‌యాదవ్ తదితర ప్రతిపక్ష నేతలు బడ్జెట్ ప్రసంగానికి హాజరయ్యారు. పలువురు రాజ్యసభ సభ్యులు కూడా వచ్చారు. బడ్జెట్ ప్రసంగానికి ముందు జైట్లీ.. బీజేపీ సీనియర్ నేత ఎల్కే అద్వానీకి అభివాదం చేసి నవ్వారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కమల్‌నాథ్.. జైట్లీ దగ్గరకు వచ్చి అభినందించారు.

భారత్‌మాలలో రాష్ట్రానికి కాసింత ఊరట!

- కేంద్ర బడ్జెట్‌లో కొత్తగా 529 కి. మీ నాలుగు లేన్ల రోడ్లు
- 367 కిమీ జాతీయ రహదారులకు టెండర్లు పూర్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్రబడ్జెట్‌లో భారత్‌మాల పథకం కింద రాష్ట్రానికి కేటాయింపుల్లో కొంత ఊరట లభించింది. దేశవ్యాప్తంగా 34,800 కిలోమీటర్ల జాతీయ రహదారులను ఈ పథకం ద్వారా నిర్మించాలని కేంద్రం భావించింది. ఎన్‌హెచ్‌డీపీ పథకం కింద మిగిలిపోయిన రహదారులను భారత్‌మాల మొదటి దశకు మార్చింది. భారత్‌మాల ఫేజ్ 1 ను 2021-22 కల్లా పూర్తి చేయాలని సంకల్పించింది. 2018-19 సంవత్సరంలో 4,500 కిలో మీటర్ల మేరకు నిర్మాణాలు చేపడుతున్నట్టు పేర్కొన్నది. 4,500 కిలోమీటర్ల లక్ష్యంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే 367 కిలో మీటర్ల మేరకు 5 ప్రాజెక్టులను చేపట్టేందుకు ఎన్‌హెచ్‌ఏఐ టెండర్లను పిలిచింది. మిగతా 529 కిలో మీటర్ల జాతీయ రహదారిని భారతమాల ఫేజ్-1 ప్రాజెక్టు కింద చేపట్టేందుకు నిర్ణయించింది.

భారత్‌మాలలో టెండర్లు పిలిచిన రోడ్ల వివరాలు	
సంగారెడ్డి - నాందెడ్- అకోలా	140 కి.మీ
మంచిర్యాల- చంద్రాపూర్	90 కి.మీ
సూర్యాపేట- ఖమ్మం	60 కి.మీ
కోదాడ- ఖమ్మం	32 కి.మీ
హైదరాబాద్ -మన్నెగూడ	45 కి.మీ

వచ్చే ఏడాది చేపట్టే ప్రాజెక్టులు	
జడ్చర్ల - డీఎస్‌గఢ్ (రాష్ట్రసరిహద్దు)	100 కి.మీ
మహబూబ్‌నగర్-కొడంగల్ (కర్ణాటక)	80 కి.మీ
ఆర్మూర్- జగిత్యాల- మంచిర్యాల	149 కి.మీ
జగిత్యాల- కరీంనగర్- వరంగల్- ఖమ్మం	200 కి.మీ

రోడ్డు భద్రతపై ప్రధాన దృష్టి

రహదారి భద్రతపై కేంద్రబడ్జెట్ ఫోకస్ పెట్టింది. రోడ్డు భద్రతకు విస్తృతమైన ప్రచార కార్యక్రమాలు చేపట్టి ప్రమాదాలను నివారించాలని నిర్ణయించింది. ఈ మేరకు సంబంధిత రవాణాశాఖ, ఇతర రోడ్డు భద్రతకు సంబంధించినశాఖల అధికారులతో కలిసి చర్యలు చేపట్టాలని సూచించింది. కేంద్రప్రభుత్వ సాయంతో నల్లగొండ జిల్లా మల్కాపురంలో నిర్మిస్తున్న వెహికల్ ఫిట్‌నెస్ సెంటర్‌కు గతేడాది కేటాయింపుల తరువాత మిగిలిన మొత్తం రూ. 3.50 కోట్ల మొత్తాన్ని ఈ బడ్జెట్‌లో కేటాయించారు.

ఆ పది స్థలాలు 'దిగ్గజ' పర్యాటక కేంద్రాలు!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: దేశంలోని పది ప్రముఖ పర్యాటక స్థలాలను 'దిగ్గజ పర్యాటక కేంద్రాలు'గా అభివృద్ధి చేస్తామని కేంద్రం ప్రతిపాదించింది. వీటి అభివృద్ధికి ప్రైవేట్ పెట్టుబడులను కూడా ఆకర్షించనున్నది. దేశంలోని వారసత్వ నగరాలకు పునర్జీవనం కల్పిస్తూ వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాల్సి ఉన్నదని మంత్రి అరుణ్ జైట్లీ గురువారం బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. ఈశాన్య రాష్ట్రాలను అనుసంధానం చేసేందుకు అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రం తవాంగ్, వెస్ట్ కామెంగ్ జిల్లా పరిధిలోని 'సీలా పాస్' వద్ద టన్నెల్ నిర్మిస్తామన్నారు. మౌలిక వసతుల కల్పనలో భాగంగా ఈ నగరాల పరిధిలో ఏటా వంద విమాన సర్వీసుల నిర్వహణకు విమానాశ్రయాల సామర్థ్యాన్ని విస్తరిస్తారు. ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్‌ఐ) ఆధ్వర్యంలోని 100 ఆదర్శ స్మారక కేంద్రాల్లో వసతులను పెంపొందిస్తామని తెలిపారు. సాంస్కృతిక ఆస్తులను పెట్టుబడులుగా మార్చుకునేందుకు వసతులు కల్పించాల్సి ఉన్నదన్నారు. ఆయా కేంద్రాల్లో సిబ్బందికి నైపుణ్య శిక్షణ కల్పించాలని నిర్ణయించామన్నారు. ఆదర్శ్ స్మారక కేంద్రాలను ఏఎస్‌ఐ కింద ప్రత్యేక వారసత్వ కేంద్రాలుగా తీర్చిదిద్దుతారు. అమృత్ పథకం కింద దేశంలోని 500 నగరాల పరిధిలో ఇండ్లకు తాగు నీటి వసతి కల్పిస్తామని జైట్లీ తెలిపారు.



ఏప్రిల్ 2021లోపు ప్రారంభించే స్టార్టప్‌లకు పన్ను రాయితీలు


న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: దేశవ్యాప్తంగా స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి, ప్రభుత్వం అందిస్తున్న పన్ను ప్రోత్సాహకాలను లబ్ధిదారులు పొందడానికి సంబంధించిన నిబంధనలను సరళతరం చేస్తున్నట్లు కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించారు. బడ్జెట్ సమర్పణ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1 ఏప్రిల్ 2021లోపు స్టార్టప్‌లను ప్రారంభించిన వారికి పన్ను రాయితీలు ఇవ్వనున్నట్లు తెలిపారు. గతంలో ఏప్రిల్ 2019 వరకు మాత్రమే ఈ సదుపాయం అందుబాటులో ఉండేదని, దానిని ప్రస్తుతం పొడిగిస్తున్నామని చెప్పారు. ఈ నూతన నిబంధన త్వరలోనే అమల్లోకి రానుందని పేర్కొన్నారు. కేంద్రమంత్రి ప్రకటనపై నాస్కాం అధ్యక్షుడు ఆర్ చంద్రశేఖర్ సానుకూలంగా స్పందించారు. మరిన్ని నూతన స్టార్టప్‌లు ఏర్పడటానికి మంత్రి ప్రకటన ఎంతో దోహదపడుతుందని చెప్పారు.



సుదీర్ఘ బడ్జెట్ ప్రసంగం మన్మోహన్‌దే!

అతి తక్కువ సమయంలో ముగించినది హెచ్‌ఎం పటేల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: బడ్జెట్ ప్రసంగం అంటే దేశ ప్రజలకు అమితాసక్తి. అయితే ఈ ప్రసంగాన్ని సుదీర్ఘంగా కొనసాగించిన మంత్రి ఎవరు? అతి తక్కువ సమయం బడ్జెట్ ప్రసంగాన్ని చదివిన మంత్రి ఎవరు అన్న విషయాలు కూడా ఆసక్తి కలిగించేవే. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ 1991లో కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు ఎక్కువ సమయం బడ్జెట్ ప్రసంగాన్ని చదివారు. తన ప్రసంగంలో ఆయన 18,650 పదాలను వాడారు. సుదీర్ఘ ప్రసంగం చేసిన వ్యక్తుల్లో ప్రస్తుత ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ రెండోస్థానంలో నిలిచారు. గతేడాది బడ్జెట్ ప్రసంగం సందర్భంగా ఆయన 18,604 పదాలను ఉపయోగించారు. అతి తక్కువ సమయంలో బడ్జెట్ ప్రసంగాన్ని ముగించిన వ్యక్తిగా హెచ్‌ఎం పటేల్ నిలిచారు. 1977లో మధ్యంతర బడ్జెట్ సమర్పణ సందర్భంగా ఆయన 800 పదాలను మాత్రమే వాడారు.





పేదల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్

బడ్జెట్‌లో రైతులు, మౌలిక వసతుల కల్పన, గ్రామీణ రంగం, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రాధాన్యం ఇచ్చి పేదల ఆకాంక్షలకు కొత్త రెక్కలు తొడిగారు. గ్రామీణ రంగం, వ్యవసాయానికి అధిక కేటాయింపులు చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. వ్యవసాయానికి కనీస మద్దతు ధర 1.5 శాతం పెంచడం చారిత్రాత్మకం,'ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమాతో 10 కోట్ల కుటుంబాలకు మేలు జరుగుతుంది. ప్రభుత్వం ఆర్థిక లోటును మెరుగుపరుచుకుంటూ వస్తున్నది.


అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు

ప్రజారోగ్యానికి రక్ష

1200 కోట్లు కేటాయింపు.. పదికోట్ల కుటుంబాలకు ఏటా ఐదు లక్షల బీమా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1:

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రత్యేక చర్యలను ప్రకటించింది. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం కింద రూ.1200 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపింది. ఇందులో భాగంగా ప్రధానమైన 'జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకం' కింద పదికోట్ల కుటుంబాలకు ఏటా రూ.5లక్షల ఆరోగ్య బీమా లభిస్తుంది. దీనివల్ల దాదాపు 50కోట్ల మందికి లబ్ధి చేకూరుతుందని ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ గురువారం 2018-19 బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. సార్వత్రిక ఆరోగ్య పరిరక్షణ దిశగా కదులుతున్నామని, ఈ పథకం ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య కార్యక్రమం అవుతుందని ఆయన చెప్పారు. ప్రజలకు చేరువలో ఆరోగ్యసేవలు అందించాలన్న లక్ష్యంతో లక్షన్నర వెల్‌నెస్ సెంటర్లను నెలకొల్పనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ కేంద్రాలు అత్యవసరమైన రోగనిర్ధారణ పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను అందజేస్తాయని తెలిపారు. ఆరోగ్య భారత్‌తోనే సమృద్ధ భారత్ సాధ్యమవుతుందని, దేశ పౌరులు ఆరోగ్యవంతంగా లేనప్పుడు జనాభాపరంగా చేకూరాల్సిన లబ్ధి సాధ్యం కాదని అన్నారు. 'మేము పది కోట్ల మంది పేద బలహీనవర్గాల కుటుంబాలకు వర్తించేలా కీలకమైన జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకం ప్రారంభిస్తాం. దీనివల్ల ఏటా రూ.5లక్షల ఆరోగ్య బీమా లభిస్తుంది. దాదాపు 50కోట్ల మందికి ప్రయోజనం కలిగించే ఈ పథకం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రభుత్వ ఆరోగ్య రక్షణ కార్యక్రమం అవుతుంది' అని జైట్లీ చెప్పారు. దేశ జనాభాలో దాదాపు 40శాతానికి వర్తించే ఈ కార్యక్రమం సజావుగా కొనసాగేందుకు తగిన నిధులు కల్పిస్తామని పేర్కొన్నారు. ప్రజలకు ఆరోగ్యసేవలను మరింత చేరువ చేసేందుకు లక్షన్నర వెల్‌నెస్ సెంటర్లు దోహదపడుతాయని చెప్పారు. ఈ కార్యక్రమాలకు ప్రభుత్వం రూ.1200 కోట్లు కేటాయిస్తున్నదని, ప్రైవేటురంగం కూడా తమ వంతుగా తోడ్పడాలని కోరారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) ద్వారా ప్రైవేటు సంస్థలు, ఇతర దాతృత్వ సంస్థలు ముందుకురావాలన్నారు. రోగనిరోధం, ఆరోగ్య పరిరక్షణ అన్ని స్థాయిల్లో సత్ఫలితాలనిచ్చేలా ప్రభుత్వం 'ఆయుష్మాన్ భారత్' కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నదని చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న చర్యలు 2022నాటికి నూతన భారతాన్ని నిర్మిస్తాయని జైట్లీ పేర్కొన్నారు. అంటు వ్యాధులు, అంటు వ్యాధులుకాని వాటికి కూడా వెల్‌నెస్ సెంటర్లలో చికిత్సలందుతాయని చెప్పారు.



లక్షన్నర వెల్‌నెస్ సెంటర్లు.. ఉచిత పరీక్షలు.. మందులు

భారీ ఆరోగ్య పరిరక్షణ పథకం ప్రకటించిన కేంద్రప్రభుత్వం

సార్వత్రిక ఆరోగ్య రక్షణ దిశగా వెళ్తున్నామన్న జైట్లీ

టీబీ నివారణకు 600 కోట్లు

క్షయవ్యాధిగ్రస్థులకు పోషకాహారం అందించేందుకు రూ.600 కోట్లను కేటాయిస్తున్నట్లు జైట్లీ ప్రకటించారు. నెలకు రూ.500 మేర లెక్కగట్టి ఈ కేటాయింపులు చేశారు. అంటు వ్యాధుల్లో అన్నింటికన్నా ఎక్కువగా టీబీ కారణంగా ప్రతి ఏటా ఎక్కువమంది మరణిస్తున్నారని మంత్రి చెప్పారు. ప్రధానంగా పేదలు, పోషకాహారలోపమున్నవారే ఈ వ్యాధిబారిన పడుతున్నందున ప్రభుత్వం అదనంగా రూ.600కోట్లను కేటాయించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతమున్న జిల్లా వైద్యశాలలను మెరుగుపరిచి కొత్తగా 24 ప్రభుత్వ వైద్య కళాశాలలు, దవాఖానలను నెలకొల్పనున్నట్లు మంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించారు. మూడు పార్లమెంటు నియోజకవర్గాలకు ఒక వైద్య కళాశాల ఉంటుందని మంత్రి చెప్పారు. సమర్థ, ఉత్పాదక నూతన భారతాన్ని నిర్మించడంలో ఈ చర్యలు కీలకమని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. తద్వారా అదనపు ఉద్యోగాలు లభిస్తాయని, ప్రత్యేకించి మహిళలకు లబ్ధి చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. ఇప్పటివరకు కొనసాగుతున్న ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన వంటి పథకాలను సమాజంలోని దిగువ వర్గాన్ని చేరేలా విస్తరిస్తామని తెలిపారు.



సమూల మార్పు తెచ్చే పథకమిది

ప్రభుత్వం ప్రకటించిన జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకం ఆరోగ్యరంగంలో సమూల మార్పు తెస్తుందని అపోలో హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సీ రెడ్డి పేర్కొన్నారు. ఆరోగ్యరక్షణను అందుబాటులోకి తీసుకొచ్చేలా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం పెద్ద అడుగు అని ఎండీ సునీతారెడ్డి అభిప్రాయపడ్డారు.

మన బడ్జెట్‌కు 400 ఏండ్ల చరిత్ర!

మొదట ప్రవేశపెట్టింది అక్బర్ సామ్రాజ్యంలోని రాజా తోడర్‌మల్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: బడ్జెట్.. దేశాన్ని నడిపించే ఓ కీలక సాధనం. ఇంతటి ప్రాముఖ్యం ఉన్న బడ్జెట్ ఎలా మొదలైంది? ఎవరు మొదలుపెట్టారు? అసలు బడ్జెట్ అనే పేరు ఎలా వచ్చిందంటే.. బడ్జెట్ అనే పదం ఫ్రెంచ్ పదం 'బోగెట్టి' నుంచి వచ్చింది. బోగెట్టి అంటే సంచి అని అర్థం. దాదాపు 400 ఏండ్ల కిందట అక్బర్ సామ్రాజ్యంలోని ఆర్థిక మంత్రి రాజా తోడర్‌మల్ మొదటి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ప్రభుత్వ రాబడి, వ్యయానికి సంబంధించిన బడ్జెట్ ప్రతులను ఆయన ఓ సంచిలో తీసుకొని దర్బార్ హాల్‌కు వెళ్లేవారు. అలా మొదలైన భారత బడ్జెట్ నిరంతరంగా కొనసాగుతున్నది. అయితే ప్రభుత్వ రాబడి, వ్యయాలు తదితర విషయాలు అప్పటి నుంచి ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. కానీ, మారుతున్న కాలానుగుణంగా బడ్జెట్ సంచి స్థానంలో సూట్‌కేస్ వచ్చింది.

అప్పటి బడ్జెట్‌తో ప్రస్తుత బడ్జెట్‌ను పోల్చిచూస్తే..

- అప్పట్లో ప్రభుత్వ రాబడికి ప్రధాన ఆదాయ వనరు వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు. ఇప్పటికీ కూడా ఈ రంగం కీలక పాత్ర పోషిస్తున్నది.
- అప్పట్లో బడ్జెట్ ప్రతులను చేతితో రాసేవారు. ఇప్పుడు ముద్రిస్తున్నారు.
- రాజా తోడర్‌మల్ మొదట షేర్ షా సూరి వద్ద పనిచేశారు. అప్పుడు రాజ్యానికి వచ్చే రాబడులను ఆయన ఎక్కువగా మౌలికసదుపాయాలకు ఖర్చు చేసేవారు. ఇప్పుడు కూడా ప్రభుత్వం మౌలికసదుపాయాలకు పెద్దపీట వేస్తున్నది. టోల్ ట్యాక్స్‌ను మొదట ప్రవేశపెట్టిన వ్యక్తి రాజా తోడర్‌మల్.
- వెండి, బంగారం, రాగి నాణేలు చెలామణిలోకి వచ్చింది కూడా రాజా తోడర్‌మల్ హయాంలోనే.. రూపాయి అనే పదం 'రూపాయా' అనే పదం నుంచి వచ్చింది.
- అప్పట్లో రక్షణ రంగానికి భారీగా నిధులు కేటాయించేవారు. ఇప్పుడూ ఎక్కువగానే నిధులు కేటాయిస్తున్నారు.

బడ్జెట్ భద్రత




లోక్‌సభలో ప్రవేశపెట్టే కేంద్ర బడ్జెట్‌కు సంబంధించిన పత్రాలతో కూడిన బ్యాగులను పార్లమెంట్ ఆవరణలో పోలీసు జాగిలాలతో తనిఖీ చేస్తున్న భద్రతా సిబ్బంది

పేదల గుడిసెలో నవోదయం

అరుణ్ జైట్లీ నోట వివేకానందుని మాట





న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: బడ్జెట్ ప్రసంగం అంటేనే పద్దులు, కేటాయింపులు. అంతా అంకెలమయంగా ఉండి అయ్యబాబోయ్ అనిపిస్తుంది. అందుకే ఆర్థిక మంత్రులు కవితలతో కొంత ఆటవిడుపు కలిగిస్తారు. అరుణ్ జైట్లీ అందుకు భిన్నం ఏమీ కాదు. ఎడాపెడా కవితలు గుప్పించడం ఆయనకు అలవాటే. కాకపోతే ఈసారి వైవిధ్యం కోసమా అన్నట్టు కొటేషన్‌తో కొట్టారు. బడ్జెట్ ప్రసంగం చివరన ముచ్చటగా వివేకానందుని మాటలతో ముక్తాయింపు ఇచ్చారు. 'మీరంతా శూన్యంలో విలీనమై అంతర్ధానమై పోండి.. నూతన భారతాన్ని ఉదయించనివ్వండి. రైతు గుడిసెలోనుంచి.. నాగలిని ఒడిసిపట్టే చేతుల్లోనుంచి.. జాలర్ల పాకల్లోనుంచి.. కిరాణాదుకాణం మడిగెలోనుంచి.. చేగోడీలు వేయించి అమ్మేవారి కొలిమిలోనుంచి దానిని ప్రభవించనివ్వండి. ఫ్యాక్టరీలు, అంగడులు, సంతల్లోనుంచి నవభారతాన్ని ఉబికిరానివ్వండి. తోటలు, అడవులు, గుట్టలు, కొండల్లోనుంచి దానిని ఉబికిరానివ్వండి' అనే వివేకానందుని ఆవేశపూరిత ప్రకటనను ఉటంకించారు. హిందూసమాజపు ఎగువ తరగతిని ఉద్దేశించి వివేకానందుడు అన్న మాటలను గ్రామీణపేదలు, బక్కరైతులను ఆకట్టుకోవడమే లక్ష్యంగా రూపొందిన బడ్జెట్ ముక్తాయింపులో చోటుచేసుకోవడం విశేషం. పైగా కొద్దిమంది చేతుల్లో కొండంత సంపద పోగుపడిన నేటియుగంలో స్వామి మాటలను స్మరించుకోవడం ఎంతైనా సబబుగా ఉంటుందని పరిశీలకులు అంటున్నారు.

వెంచర్ క్యాపిటల్, ఏంజిల్ ఇన్వెస్టర్స్ బలోపేతానికి చర్యలు

దేశంలో వెంచర్ క్యాపిటల్ ఫండ్స్, ఏంజిల్ ఇన్వెస్టర్స్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు కేంద్రం అవసరమైన చర్యలు చేపడుతుందని ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ తెలిపారు. వెంచర్ క్యాపిటల్ ఫండ్స్, ఏంజిల్ ఇన్వెస్టర్స్ (చిన్నస్టార్టప్‌ల పెట్టుబడిదారులు) అభివృద్ధి చెందాలంటే సృజనాత్మక, ప్రత్యేక అభివృద్ధి ప్రణాళిక ఉండాలని.. దీంతోపాటు వీటి వృద్ధికి ఓ నియంత్రణ వ్యవస్థ ఉండాలని పేర్కొన్నారు. 'స్టార్టప్ ఇండియా ప్రోగ్రాం సహా మేం చాలా నిర్ణయాలు తీసుకున్నాం. బలమైన ప్రత్యామ్నాయ పెట్టుబడి వ్యవస్థను నిర్మించడంతోపాటు వెంచర్ క్యాపిటల్ ఫండ్స్, ఏంజిల్ ఇన్వెస్టర్స్ కోసం ప్రత్యేకంగా పన్నువ్యవస్థను ఏర్పాటుచేస్తాం. భారత్‌లో ప్రత్యామ్నాయ పెట్టుబడుల వృద్ధి, విజయవంతానికి సానుకూల వాతావరణాన్ని సృష్టిస్తాం. ఆర్థిక సేవల్లో ఫైనాన్షియల్ టెక్నాలజీ (ఫిన్‌టెక్) వినియోగం, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల (ఎంఎస్ఎంఈ) అభివృద్ధికి ఉపయోగపడుతుంది' అని పేర్కొన్నారు.

రెండు భాషల్లో జైట్లీ ప్రసంగం!



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ బడ్జెట్ ప్రసంగం చేయడంలో నూతన సంప్రదాయానికి తెరతీశారు. గురువారం ఆయన 2018 బడ్జెట్ ప్రవేశపెడుతూ ఇంగ్లిష్, హిందీ.. రెండు భాషల్లో ప్రసంగించారు. ఇప్పటివరకు ఏ ఆర్థికమంత్రి ఈ విధంగా చేయలేదు. లోగడ ఆర్థికమంత్రులుగా పనిచేసినవారు ఏ పార్టీ వారైనా అందరూ దాదాపు పూర్తిగా ఇంగ్లిష్‌లోనే బడ్జెట్ ప్రసంగం చేశారు. మధ్యమధ్యలో మాత్రం హిందీ, ఉర్దూ, తమిళ తదితర భాషల పద్యాలను, సూక్తులను సందర్భానుసారం ఉదహరించేవారు. యూపీఏకు చెందిన మన్మోహన్‌సింగ్, చిదంబరంతోపాటు, ఎన్డీఏకు చెందిన యశ్వంత్‌సిన్హా, జశ్వంత్‌సింగ్ కూడా ఇదే సంప్రదాయాన్ని పాటించారు. 2019 ఎన్నికలకు ముందు ఇప్పుడు అరుణ్‌జైట్లీ కొత్త విధానాన్ని ఎంచుకున్నారు.

నవభారత నిర్మాణానికి ఊతం

ఆకాంక్షాలకు ప్రతిబింబం.. రైతులకు, వ్యాపారులకు ప్రయోజనకారి



న్యూఢిల్లీ: ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్ 125 కోట్ల మంది భారతీయుల ఆకాంక్షలను ప్రతిబింబించేవిధంగా ఉన్నదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. జైట్లీ బడ్జెట్ ప్రసంగం పూర్తయిన అనంతరం పార్లమెంట్ ఆవరణలో మాట్లాడిన మోదీ 'నవ భారత' నిర్మాణ లక్ష్యానికి ఈ బడ్జెట్ మరింత శక్తినిచ్చిందని ప్రశంసించారు. 2018-19 బడ్జెట్ అభివృద్ధి అనుకూలమైనదని ఆయన వ్యాఖ్యానించారు. '125 కోట్ల మంది భారతీయుల ఆశలను, ఆకాంక్షలను బడ్జెట్ మరింత బలోపేతం చేస్తున్నది. ఇది సామాన్యుడి అనుకూల బడ్జెట్, వ్యాపారుల అనుకూల బడ్జెట్, సులభతర వాణిజ్యం ద్వారా సులభతర జీవన విధానానికి దారిచూపే విధంగా ఉన్నది. మన రైతులు రికార్డు స్థాయిలో ధాన్యాలు, కూరగాయలు పండించారు. వారిని మరింత బలోపేతం చేసేందుకు చాలా ముఖ్యమైన చర్యలను తీసుకొన్నాం.' అని మోదీ తెలిపారు. దేశంలో అత్యంత నిరుపేదల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు అనేక సంక్షేమ పథకాలను బడ్జెట్‌లో ప్రతిపాదించారని పేర్కొన్నారు. 'మా సంక్షేమ పథకాలు నేరుగా దళితులకు, పేదలకు, వెనుకబడిన ప్రజలకు ప్రయోజనం కల్గిస్తాయి.' అని మోదీ పేర్కొన్నారు. చిన్న, మధ్యతరహా, సూక్ష్మ పరిశ్రమ రంగం చాలాకాలంగా పన్ను భారంతో కునారిల్లుతున్నదని, ఈ బడ్జెట్‌లో ఎంఎస్ఎంఈల కార్పొరేట్ పన్నుల శాతాన్ని 30 నుంచి 25శాతానికి తగ్గించామని చెప్పారు. మొండిబకాయిలకు సంబంధించి కూడా బడ్జెట్‌లో చర్యలను ప్రతిపాదించారన్నారు. వానకాలం పంటలన్నింటికీ కనీస మద్దతు ధరను ఒకటిన్నర రెట్లు పెంచడంపట్ల జైట్లీని అభినందిస్తున్నానని ప్రధాని మోదీ పేర్కొన్నారు. జైట్లీ బడ్జెట్ అన్ని రంగాలలో సమతుల్యత పాటించడంవల్ల దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని తెలిపారు.

పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్తాయి

సంక్షేమ, సులభ వాణిజ్య విధానానికి ఊతం

అభివృద్ధికి అనుకూలం

జైట్లీ బడ్జెట్‌పై ప్రధాని మోదీ స్పందన

ఐదు లక్షల వై-ఫై హాట్‌స్పాట్లు

మెరుగైన సేవల కోసం రూ. 14,500 కోట్లు కేటాయింపు



టెలికం రంగ సేవలను మెరుగు పరుచడానికి వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.14,500 కోట్ల నిధులను వెచ్చించనున్నట్లు అరుణ్ జైట్లీ ప్రకటించారు. వీటిలో రూ.10 వేల కోట్లను మౌలిక సదుపాయాల కోసం కేటాయించనుండగా...మరో రూ.4,500 కోట్లను నెట్‌వర్క్ స్పెక్ట్రం ప్రాజెక్టులకోసం ఖర్చు చేయనున్నది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన భారత్ నెట్ ప్రాజెక్టులో భాగంగా ఈ నిధులను ఖర్చు చేయనున్నది. ఈ ప్రాజెక్టులో భాగంగా మార్చి 2019 నాటికి 2.5 లక్షల గ్రామ పంచాయతీలకు అత్యంత వేగవంతమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్న విషయం తెలిసిందే. వీటిలో ఇప్పటి వరకు లక్ష గ్రామ పంచాయతీలకు బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న 5 కోట్ల మందిని బ్రాడ్‌బ్యాండ్ సేవల పరిధిలోకి తీసుకొచ్చేందుకు 5 లక్షల వై-ఫై హాట్‌స్పాట్‌లను ఏర్పాటు చేయనున్నట్లు జైట్లీ ప్రకటించారు. తద్వారా ప్రజల్లో టెక్నాలజీ గురించి తెలియనున్నదని, ముఖ్యంగా 5వ జనరేషన్ టెక్నాలజీ పరిధిలోకి వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం కూడా ఉన్నదని ఆయన పేర్కొన్నారు. డిజిటల్ రంగంలో వస్తున్న పెనుమార్పులకు అనుగుణంగా కృత్రిమ మేధస్సు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సేవలను మెరుగుపరుచడానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(డీఎస్‌టీ) కోసం రూ.3,073 కోట్ల నిధులను కేటాయిస్తున్నట్లు జైట్లీ ప్రకటించారు. ఈ నిధులతో పరిశోధనకు సంబంధించి శిక్షణ, రోబోటిక్స్‌లో నైపుణ్యత, డిజిటల్ తయారీ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ డిజిటల్ ఎకానమీగా రూపాంతరం చెందుతున్న ఈ క్రమంలో డిజిటల్ ఇండియా, స్టార్టప్-ఇండియా, మేక్ ఇన్ ఇండియాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని జైట్లీ వెల్లడించారు. అలాగే వచ్చే ఆర్థిక సంవత్సరంలో టెలికం రంగం నుంచి రూ.48,661.42 కోట్ల ఆదాయం రావచ్చునని కేంద్రం అంచనావేస్తున్నది. ప్రస్తుతేడాది రానున్న రూ.30,736.47 కోట్లతో పోలిస్తే 58 శాతం పెరుగనున్నది. లైసెన్స్ ఫీజు, స్పెక్ట్రం వినియోగించుకున్నందుకుగాను టెలికం సంస్థలు కేంద్రానికి భారీ స్థాయిలో చెల్లింపులు జరుపుతున్నాయి.

రైతులు, పేదల నామస్మరణ



అరుణ్‌జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో రైతులు, పేదల నామస్మరణ చేశారు. మొత్తం 17,991 పదాలతో బడ్జెట్ ప్రసంగాన్ని పూర్తిచేసిన ఆయన మునుపెన్నడూ లేని రీతిలో ఈసారి రైతుజపం చేశారు. 2015 బడ్జెట్‌లో కేవలం ఏడుసార్లు మాత్రమే రైతులు అన్న పదాన్ని ఉపయోగించిన జైట్లీ ఈసారి ఏకంగా 30 సార్లు ఉచ్చరించారు. గతబడ్జెట్‌లో ఈ పదాన్ని 23సార్లు పలికారు. అరుణ్ జైట్లీ ప్రసంగంలో నరేంద్రమోదీ ప్రభుత్వం, రైతులు, ట్యాక్స్, మౌలికవసతులు, ఆరోగ్యం, మహిళలు అనే పదాలను ఎక్కువగా వినియోగించడం విశేషం. బడ్జెట్ బడ్జెట్‌కీ ట్యాక్స్ అనే పద ప్రయోగాన్ని పెంచుకుంటూ వస్తున్న ఆర్థిక మంత్రి ఈసారి ఆ పదాన్ని 116 సార్లు ప్రయోగించారు. మొత్తం ప్రసంగంలో ఎక్కువసార్లు ధ్వనించిన పదం ఇదే. 2014లో 84సార్లు, 2015లో 86సార్లు, 2016లో 97సార్లు ట్యాక్స్ అనేపదాన్ని వాడిన జైట్లీ ఆనామ స్మరణ మరింత పెంచారు. ఆ తర్వాత మౌలిక వసతులు అనే పదాన్ని 65సార్లు ఉపయోగించారు. గత బడ్జెట్‌లో ఈ పదాన్ని కేవలం 15సార్లు వాడారు. ఆ తర్వాతి వరుసలో విద్య అనే పదప్రయోగం ఎక్కువగా వినిపించింది. ఈ పదాన్ని ఆయన 43సార్లు ఉచ్చరించారు. ఆరోగ్యానికి ప్రాధాన్యమిచ్చిన ఈ బడ్జెట్‌లో ఈ పదాన్ని 39సార్లు ఉచ్చరించారు. గత బడ్జెట్‌లో ఈపదాన్ని ఎనిమిదిసార్లు మాత్రమే పలికారు. మహిళలు అనే పదాన్ని 13సార్లు పలుకగా, యువత అనే పదాన్ని కేవలం మూడుసార్లకే పరిమితం చేశారు. ఏటా కోటి ఉద్యోగాలు అనే నినాదంతో అధికారంలోకి వచ్చినప్పటికీ ఈసారి బడ్జెట్ ప్రసంగంలో ఉద్యోగాలు అనే పదాన్ని ఆరుసార్లతోనే సరిపెట్టారు. మోదీ నామస్మరణ 14సార్లు చేశారు. అయితే ప్రధాని మోదీ డిజిటల్ లావాదేవీల గురించి ఎక్కువగా మాట్లాడుతుండగా, జైట్లీ మాత్రం ఈ పదవాడకాన్ని తగ్గించారు. గత బడ్జెట్‌లో 16సార్లు డిజిటల్ స్మరణచేసిన జైట్లీ.. ఈసారి 12సార్లే ఉచ్చరించడం గమనార్హం. ఆయన ఉపన్యాసంలో పేదలు అనే పదం కూడా ఎక్కువసార్లు వినిపించింది. తన తొలిబడ్జెట్‌లో పేదలు అన్నపదాన్ని కేవలం నాలుగుసార్లు మాత్రమే వాడిన జైట్లీ ఈసారి ఏకంగా 21సార్లు స్మరించారు.

బడ్జెట్ ప్రసంగంలో తగ్గిన డిజిటల్ పదప్రయోగం

'ట్యాక్స్'ను మాత్రమే పెంచేసిన జైట్లీ

పద్నాలుగు సార్లు మోదీ నామస్మరణ

అరుణ్‌జైట్లీ ఎక్కువగా వాడినపదాలు

ట్యాక్స్ 116 సార్లు	మౌలికవసతులు 65 సార్లు
విద్య 43సార్లు	ఆరోగ్యం 39 సార్లు
రైతులు 30 సార్లు	

4.29 కోట్లు


అవినీతి నిరోధక వ్యవస్థ లోక్‌పాల్‌కు నయాపైసా నిధులు పెంచలేదు. గతం మాదిరిగానే ఈసారి బడ్జెట్‌లో కూడా రూ.4.29 కోట్లు మాత్రమే కేటాయించారు. అయితే, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌కు మాత్రం రూ.1.58 కోట్లు పెంచి, రూ.32.61 కోట్లు కేటాయించారు.



ఇక ప్రతి కంపెనీకి ఆధార్!

త్వరలో కొత్త పథకం: కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ

దేశవ్యాప్తంగా ఉన్న ప్రతి కంపెనీకి ఇకపై ఆధార్‌తరహాలో ప్రత్యేక గుర్తింపు నంబర్ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నది. అన్ని ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు ఆధార్‌నంబర్ అనుసంధానం చేసిన విధం గానే.. పరిశ్రమలను దాని పరిధిలోకి తీసుకురావాలని యోచిస్తున్నట్టు అరుణ్‌జైట్లీ చెప్పారు. ఆధార్ అనుసంధానం ద్వారా మన ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం సులభమైందని తెలిపారు. దేశంలోని ప్రతిఒక్క సంస్థకు యునీక్ గుర్తింపు నంబర్ ఇవ్వాలనే ఉద్దేశంతో ఒక పథకాన్ని రూపొందిస్తున్నదని వెల్లడించారు. ఇప్పటివరకు సుమారు 119 కోట్ల మంది నుంచి బయోమెట్రిక్ ద్వారా సమాచారం సేకరించి ఆధార్‌కార్డులు జారీచేశామని, వివిధ ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు ఆధార్‌కార్డును గుర్తింపు పత్రంగా భావిస్తున్నాయని చెప్పారు.



సామాన్యులకు ప్రయోజనకారి

ఇది ఒక పురోగామి బడ్జెట్, దేశానికి అనుకూలమైన బడ్జెట్. గ్రామీణ, పట్టణ భారతాల మధ్య అంతరాన్ని ఈ బడ్జెట్ తగ్గించింది. ముఖ్యంగా మౌలికరంగంలో భారీ కేటాయింపులు జరుపడం విశేషం. రైతులు, సామాన్యులకు ఈ బడ్జెట్ ప్రయోజనకారిగా ఉంది. కోట్లాది పేద ప్రజలకు వార్షిక ఆరోగ్య బీమా పథకాన్ని వర్తింపజేయడం అద్భుతం.

- రాజ్‌నాథ్‌సింగ్, కేంద్ర హోంమంత్రి

నల్లధన నివారణకు మరిన్ని చర్యలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: దేశంలో నల్లధన నివారణ చర్యలను మరింత ముమ్మరం చేయనున్నట్టు ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ చెప్పారు. ఇప్పటివరకు నల్లధన తనిఖీల కోసం చేపట్టిన వివిధ రకాల కార్యక్రమాలు సక్సెస్ కావడంతో వాటిని మరింత తీవ్రం చేయనున్నామన్నారు. సంపన్నులు పన్ను ఎగవేయకుండా చేపట్టిన చర్యల కారణంగా గడిచిన రెండు ఆర్థికసంవత్సరాల్లో ప్రభుత్వం రూ.90 వేల కోట్లు వసూలు చేసిందని తెలిపారు. 2016 నవంబర్‌లో పాత పెద్దనోట్లు రద్దుచేయడాన్ని 'పారదర్శక ప్రజల ఉత్సవం'గా జైట్లీ అభివర్ణించారు. 'నల్లధనాన్ని వెలికి తీసేందుకు ఇప్పటివరకు తీసుకొన్న వివిధ కార్యక్రమాలు విజయవంతం కావడంతో ఉత్సాహంగా ఉన్నాం. భవిష్యత్తులో ఇలాంటిచర్యలు మరింత ముమ్మరం చేయనున్నాం. నిజాయితీగా పన్నులు చెల్లించే వారికి ప్రోత్సాహకాలు అందిస్తాం' అని జైట్లీ చెప్పారు. నగదు ఆర్థికలావాదేవీలు తగ్గించేందుకు కేంద్రం చేపట్టిన చర్యలు ఆయన ప్రస్తావించారు. పన్ను చెల్లింపుదారుల కూడా పెరిగారని, దీంతో ప్రభుత్వ ఆదాయం పెరిగిందన్నారు.

సులభ వాణిజ్యానికి 372 సూత్రాలు

సులభ వాణిజ్య విధానాన్ని మరింత మెరుగుగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్రాలకు 372 కార్యాచరణ అంశాలను కేంద్రం రూపొందించింది. వీటిని రాష్ట్రాలు ఉద్యమ ప్రాతిపదికపై అమలు చేయాలని సూచించింది. పరిశ్రమ వర్గాల నుంచి సేకరించే సమాచారం ఆధారంగా రాష్ట్రాల పనితీరును కేంద్రం అంచనా వేస్తుందని అరుణ్‌జైట్లీ వెల్లడించారు. సులభ వాణిజ్య విధాన సంస్కరణలను మరింత లోతుగా విస్తరించి ప్రతి రాష్ట్రంలోనూ అమలు చేసేందుకు ఈ సూత్రాలను రూపొందించినట్టు ఆయన గురువారం పార్లమెంటులో చేసిన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. రాష్ట్రాలు ఈ సంస్కరణలను ఉద్యమ ప్రాతిపదికపై చేపట్టి తమలో తాము నిర్మాణాత్మకంగా పోటీపడాలని చెప్పారు. సులభ వాణిజ్య విధానాన్ని మెరుగుపరిస్తే మరింతగా పెట్టుబడులు వస్తాయని చెప్పారు. సులభ వాణిజ్య విధానంలో 2016 సంవత్సరంలో తెలంగాణ అగ్రభాగంలో నిలిచిన సంగతి తెలిసిందే.

మహిళలకు వరాలు

ముద్రా యోజన రుణాల మొత్తం రూ.3 లక్షల కోట్లు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1:

అరుణ్‌జైట్లీ ఈ బడ్జెట్‌లో ఆదాయపన్ను స్లాబుల్లో మార్పులు చేయకుండా వేతన జీవులను నిరాశపర్చినా.. మహిళా ఉద్యోగులు, సాధారణ మహిళలకు ఒక మేరకు సంతోషం కలిగించే ప్రకటనలు చేశారు. గ్రామీణ, పట్టణ, పేదవర్గాల మహిళలకు, ఉద్యోగినులకు ముద్రా యోజన కింద దాదాపు రూ.3 లక్షల కోట్ల రుణాలు పొందే అవకాశం కల్పించారు. ఈ రుణాలతో మహిళలు కొత్త వ్యాపారాలు, పనులు ప్రారంభించవచ్చు. రుణఖాతాలలో దాదాపు 76 శాతం మహిళలకు చెందినవే. అందులోనూ 50 శాతం ఖాతాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందినవారివి ఉన్నాయి. ఉద్యోగాలు చేసే మహిళల ఈపీఎఫ్ చందాను జైట్లీ తగ్గించారు. ఉద్యోగినులు 12 శాతానికి బదులు 8 శాతం మొత్తం చెల్లిస్తే సరిపోతుందని ప్రకటించారు. ప్రభుత్వం 12శాతం మొత్తాన్ని ఈపీఎఫ్‌కు చెల్లిస్తుందని ఆయన తెలిపారు. అన్ని రంగాల్లోని మహిళా ఉద్యోగులకు రానున్న మూడేండ్లపాటు ఈ సౌకర్యం వర్తిస్తుందని పేర్కొన్నారు. యాజమాన్య సంస్థలు మాత్రం తమవంతుగా 10 లేదా 12 శాతం ఈపీఎఫ్ చందాలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ విధంగా ఈపీఎఫ్ చందా శాతం తగ్గించడం వల్ల వివిధ సంస్థలు ఎక్కువ సంఖ్యలో మహిళలను ఉద్యోగాల్లోకి తీసుకునే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఉద్యోగాల్లో మహిళల శాతం బాగా తగ్గిపోతున్నది. 2005-06లో 36 శాతంగా ఉన్న మహిళా ఉద్యోగుల సంఖ్య 2015-16 నాటికి 24శాతానికి పడిపోయినట్లు కొద్దిరోజుల క్రితం ఆర్థిక సర్వే వెల్లడించింది. దీంతో కేంద్రం ఈ ప్రకటన చేసింది. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే రుణాలశాతాన్ని కూడా ఆర్థిక మంత్రి జైట్లీ 37 శాతానికి పెంచారు. ఇంతేగాక ప్రధాన మంత్రి ఉజ్వల యోజన కింద పేదవర్గాల మహిళలకు ఉచితంగా ఇచ్చే వంటగ్యాస్ కనెక్షన్ల సంఖ్యను బడ్జెట్‌లో ఇప్పుడున్న 5 కోట్ల నుంచి 8 కోట్లకు పెంచారు. ఇది చారిత్రక నిర్ణయమని బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా అన్నారు. మహిళా సాధికారతకు, పేద, గ్రామీణ, పట్టణ మహిళల జీవన ప్రమాణాలు పెంచడానికి కృషి చేయడంలో ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు.

> **ఉచిత వంటగ్యాస్ కనెక్షన్ల సంఖ్య 5 కోట్ల నుంచి 8 కోట్లకు పెంపు**
>
> **మహిళా ఉద్యోగులకు మూడేండ్లపాటు ఈపీఎఫ్ చందా తగ్గింపు**




రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, గవర్నర్ల వేతనాలు భారీగా పెరుగుదల

- ఎంపీల వేతనం ఐదేండ్లకోసారి పెంపునకు చట్టం ప్రతిపాదించిన జైట్లీ
- సవరించిన ఎంపీల వేతనం ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, గవర్నర్ల వేతనాన్ని 2018-19 బడ్జెట్‌లో కేంద్రప్రభుత్వం భారీగా పెంచింది. ప్రస్తుతం రాష్ట్రపతి నెల వేతనం రూ.1.5 లక్షలు ఉండగా దానిని రూ.5 లక్షలకు పెంచినట్టు లోక్‌సభలో ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించారు. ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ వేతనం రూ.1.25 లక్షల నుంచి రూ.4.5 లక్షలకు, రాష్ట్రాల గవర్నర్ల వేతనం రూ.1.10 లక్షల నుంచి 3.5 లక్షలకు పెంచినట్టు పేర్కొన్నారు. ఎంపీల వేతనాలు ఐదేండ్లకోసారి పెంచేందుకు వీలుగా లోక్‌సభలో చట్టం ప్రతిపాదించినట్టు అరుణ్‌జైట్లీ పేర్కొన్నారు. ఎంపీల వేతనాలు ద్రవ్యోల్బణానికి అనుగుణంగా ఉంటాయని చెప్పారు. దీంతోపాటు ఎంపీల వేతనాలపై బహిరంగ చర్చ జరుగాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఎంపీల వేతనాన్ని వారే నిర్ణయించడం విమర్శలకు తావిస్తున్నదని చెప్పారు. సవరించిన వేతనం, నియోజకవర్గ భత్యం, కార్యాలయ ఖర్చులు, సమావేశాల భత్యం ఏప్రిల్ 1 నుంచి సవరిస్తామని పేర్కొన్నారు. ఐదేండ్లకోసారి వేతనాల పెంపును ఎంపీలు స్వాగతించాలని కోరారు. ప్రస్తుతం ఎంపీల జీతం రూ.50 వేలు ఉండగా రూ.45 వేలు నియోజకవర్గ భత్యం అందజేస్తున్నది. దీనితోపాటు ప్రతి ఒక్క ఎంపీకి కేంద్రప్రభుత్వం నెలకు దాదాపుగా రూ.2.7 లక్షలు ఖర్చుచేస్తున్నట్టు వెల్లడించారు. ప్రస్తుత లోక్‌సభ్‌కు చెందిన సంపన్న ఎంపీలు తమ వేతనాలను వదులుకోవాలని ఇటీవల బీజేపీ ఎంపీ వరుణ్‌గాంధీ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి లోక్‌సభ స్పీకర్ సుమిత్రామహాజన్‌కు ఆయన లేఖ కూడా రాశారు. ఎంపీల వేతనాలు వదులుకొనేందుకు స్వచ్ఛందంగా ముందుకొస్తే దేశవ్యాప్తంగా మంచి సంకేతం ఇచ్చినట్టు అవుతుందని లేఖలో ఆయన కోరారు.

వైద్యం, విద్యపై 4శాతం సెస్సు



ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత విద్యతోపాటు వైద్యం కోసం ప్రభుత్వం విధిస్తున్న సెస్సును నాలుగు శాతానికి పెంచుతూ కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ ప్రతిపాదించారు. వ్యక్తిగత ఆదాయ పన్ను, కార్పొరేషన్ పన్నుపై వైద్యం, విద్య కోసం ఇప్పటివరకు మూడుశాతం సెస్సు విధిస్తున్నారు. 'దారిద్ర్యరేఖకు దిగువనున్న, గ్రామీణ ప్రాంత కుటుంబాలకు మెరుగైన విద్య, వైద్యం అందించేందుకు ఇప్పటివరకు ఉన్న మూడుశాతం సెస్సును ఒకశాతం పెంచి నాలుగుశాతం చేయాలని నిర్ణయించాం. పెరిగిన ఒకశాతం సెస్సు వల్ల రూ.11వేల కోట్లు అదనంగా వసూలు అవుతాయని అంచనా వేస్తున్నాం' అని జైట్లీ చెప్పారు. ప్రాథమిక విద్యకు రెండుశాతం సెస్సు, ప్రాథమికోన్నత, ఉన్నతవిద్యకు ఒకశాతం కలిపి ఇప్పటివరకు మూడుశాతం సెస్సు విధిస్తున్నారు.

మొబైల్స్‌పై దిగుమతి సుంకం 20శాతానికి పెంపు



న్యూఢిల్లీ: దేశీయ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి రంగానికి ఊతం ఇచ్చేవిధంగా కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ మొబైల్ ఫోన్లపై దిగుమతి సుంకాన్ని 20 శాతానికి పెంచారు. గతంలో ఇది 15 శాతంగా ఉండేది. సాధారణంగా కొనసాగుతున్న దిగుమతి సుంకాల తగ్గింపు ప్రక్రియ నుంచి క్రమంగా వెనుకకు తగ్గుతున్నట్టు జైట్లీ వెల్లడించారు. మేకిన్ ఇండియాలో భాగంగా దేశీయంగా ఆహార శుద్ధి, ఎలక్ట్రానిక్స్, ఆటో విడిభాగాలు, పాదరక్షల ఉత్పత్తి రంగాలకు అదనపు విలువను జత చేయడానికి, ఆయా రంగాలను బలోపేతం చేయడానికి చర్యలు చేపడుతున్నట్టు వివరించారు. ఈ నిర్ణయం ద్వారా దేశంలో భారీగా ఉద్యోగాల కల్పన జరుగుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఇందులో భాగంగానే మొబైల్ ఫోన్లపై దిగుమతి సుంకాన్ని 20 శాతానికి, ఇతర మొబైల్ పరికరాలపై 7.5- 10 శాతం నుంచి 15 శాతానికి పెంచుతున్నామని స్పష్టం చేశారు.

ముడి జీడిపప్పుపై కస్టమ్స్ డ్యూటీ తగ్గింపు



ముడిజీడిపప్పుపై ప్రస్తుతమున్న ఐదు శాతం కస్టమ్స్ డ్యూటీని 2.5 శాతానికి తగ్గించారు. జీడిపప్పు ప్రాసెసింగ్ పరిశ్రమకు దీని వల్ల మేలు కలుగుతుందని ఆర్థికమంత్రి అరుణజైట్లీ పేర్కొన్నారు. 14 రాష్ట్రాల్లో నాలుగువేలకు పైగా జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్లున్నాయి. కర్ణాటక, తమిళనాడు, గోవా, మహారాష్ట్ర, కేరళ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఒడిషా, పశ్చిమబెంగాల్, గుజరాత్, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని జీడిపప్పు పరిశ్రమలకు లబ్ధి చేకూరనున్నది.

ఎల్‌సీడీ, ఎల్‌ఈడీ టీవీలు ప్రియం

దిగుమతి చేసుకున్న ఎల్‌సీడీ, ఎల్‌ఈడీ ప్యానెల్స్ సుంకాన్ని 7.5 శాతం నుంచి 15 శాతానికి పెంచనున్నట్టు 2018-19 బడ్జెట్‌లో ప్రతిపాదించారు. దీంతో విదేశీ ప్యానెల్స్ ధరలు భారీగా పెరిగే అవకాశముంది. స్వదేశీ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. టీవీల్లో ఉపయోగించే ప్యానెల్స్‌తోపాటుగా మరికొన్ని విడిభాగాలపై దిగుమతి సుంకాన్ని ప్రస్తుత 7.5 శాతం నుంచి 15 శాతానికి పెంచాలని ప్రతిపాదించారు. ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్, వాహనాల విడిభాగాలు, పాదరక్షలు, ఫర్నిచర్ తయారీ రంగాల్లో స్వదేశీ ఉత్పత్తికి ఎన్నో అవకాశాలున్నాయని అన్నారు. దీనివల్ల ఉద్యోగాలు కూడా పెరుగుతాయని జైట్లీ చెప్పారు.

ఎవరికి లాభం.. ఎవరికి నష్టం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: వచ్చే ఏడాది జరుగనున్న లోక్‌సభ ఎన్నికలు ఈ ఏడాది చివరిలోనే దూసుకొస్తాయన్న సంకేతాల మధ్య కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 2018 – 19 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను గురువారం పార్లమెంట్‌కు సమర్పించారు. నిరాశానిస్పృహల్లో చిక్కుకున్న అన్నదాతను ఆదుకునేందుకు, గ్రామీణులకు చేయూతనిచ్చేందుకు పెద్దపీట వేశారు. వృద్ధిరేటు పెంచడానికి, ఉద్యోగాల కల్పన, ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రాధాన్యం ఇచ్చారు. ఈ బడ్జెట్‌లో రైతులు, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు, హెల్త్‌కేర్ సంస్థలు భారీ లబ్ధిదారులు. బాండ్ ఇన్వెస్టర్లు భారీగా నష్టపోయిన వారిలో ఉన్నారు.



రైతులు

రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ) కల్పిస్తామని జైట్లీ హామీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా వ్యవసాయ మార్కెట్ల నిర్మాణానికి భారీగా పెట్టుబడులు పెడుతామని వాగ్దానం చేశారు. దీనివల్ల నీటి పారుదల, ఆక్వా కల్చర్ ప్రాజెక్టులతోపాటు వివిధ గ్రామీణ పథకాలకు భారీగా నిధులు సమకూరుతాయి. వ్యవసాయ పంప్‌సెట్ల కోసం రైతులు ఏర్పాటు చేసుకున్న సౌర విద్యుత్ యూనిట్ల నుంచి ఉత్పత్తిచేసే అదనపు విద్యుత్‌ను రాష్ట్ర ప్రభుత్వాలు కొనుగోలు చేయాలని మార్గదర్శకాలు జారీ చేసింది. దీని వల్ల వ్యవసాయ అనుబంధ కంపెనీలు లబ్ధి పొందవచ్చు.

హెల్త్‌కేర్ ప్రొవైడర్లు

కేంద్ర ప్రభుత్వం నూతనంగా జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకాన్ని ప్రతిపాదించింది. దీని ద్వారా ప్రతి ఒక్కరికి రూ.5 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం లభిస్తుంది. 50 కోట్ల మందికి లబ్ధి చేకూరనున్నది. తద్వారా దేశంలోనే అతిపెద్ద హాస్పిటల్ కంపెనీ 'అపోలో హాస్పిటల్స్'తోపాటు ఫోర్టిస్ హెల్త్‌కేర్‌లకు ప్రయోజనం చేకూరవచ్చు.

వినియోగ ఉత్పత్తుల సంస్థలు

మారుమూల గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నిధులు పెరుగనుండటంతో ప్రజల వినియోగ సామర్థ్యం ఎక్కువవుతుంది. దీనివల్ల 'ఎఫ్‌ఎంసీజీ' వస్తువుల తయారీ సంస్థలు, ఆటోమొబైల్, ద్విచక్ర వాహనాల తయారీ సంస్థలు లబ్ధి పొందనున్నాయి.

ఆభరణాలు

గ్రామీణ భారతం నుంచే పసిడికి 60 శాతం డిమాండ్ ఉంటుంది. బడ్జెట్‌లో గ్రామీణ, వ్యవసాయ ఆదాయాభివృద్ధిపై దృష్టి పెట్టిన నేపథ్యంలో రైతులకు లభించే ఆదాయం వల్ల దేశంలోని ప్రముఖ ఆభరణాల తయారీ సంస్థలకు లబ్ధి చేకూరనున్నది.

విమానాశ్రయాలు

దేశవ్యాప్తంగా ప్రాంతీయ విమానాశ్రయాల నిర్మాణాన్ని విస్తరిస్తామని ప్రభుత్వం ప్రతిజ్ఞ చేసిన నేపథ్యంలో జీఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, జీవీకే పవర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి సంస్థలకు ప్రయోజనం లభిస్తుంది.



మొబైల్ ఫోన్ సంస్థలు

దేశీయ పారిశ్రామిక ఉత్పత్తిని పెంపొందించేందుకు ఆర్థిక మంత్రి జైట్లీ ఊతమిచ్చే చర్యలు చేపట్టారు. ఇందులో మొబైల్ ఫోన్లపై కస్టమ్స్ సుంకాన్ని 15 నుంచి 20 శాతానికి పెంచారు. దీనివల్ల యాపిల్, సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ సంస్థల లాభాలు తగ్గుముఖం పట్టనున్నాయి. ప్రపంచంలోనే శరవేగంగా పెరుగుతున్న మొబైల్ ఫోన్ల మార్కెట్ గల భారత్‌లో లాభాలు పొందాలంటే స్థానికంగా ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

బాండ్ ఇన్వెస్టర్లు

ఊహించిన దానికంటే ప్రభుత్వ వ్యయ పరిమితి తక్కువగా ఉన్న నేపథ్యంలో బాండ్ ఇన్వెస్టర్లకు ఈసారి బడ్జెట్‌లో స్వల్ప ఊరటే లభించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు లక్ష్యం 3.2 శాతాన్ని అందుకోవడం కష్టతరంగా మారిన నేపథ్యంలో బాండ్ల ఇన్వెస్టర్లకు ఆశించిన స్థాయిలో లాభాలు చేకూరే అవకాశాలు లేవు. ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వ రంగ బ్యాంకుల వంటి భారీ బాండ్ ఇన్వెస్టర్ల ఆదాయం ప్రభావితం కానున్నది.

ఆర్థిక రంగం

ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్లలో దీర్ఘకాలిక పెట్టుబడి లాభాలపై పన్ను (క్యాపిటల్ గెయిన్స్ టాక్స్) విధించాలని కేంద్రం తీసుకున్న నిర్ణయం వల్ల ఆర్థిక సేవల సంస్థల్లో పెట్టుబడిదారుల సెంటిమెంట్ దెబ్బ తినే అవకాశం ఉన్నది. దీనివల్ల ఐడీఎఫ్‌సీ లిమిటెడ్, రిలయన్స్ క్యాపిటల్, ఆదిత్య బిర్లా క్యాపిటల్ వంటి మ్యూచువల్ ఫండ్ సంస్థలు.. ఐసీఐసీఐ ప్రూడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్, హెచ్‌డీఎఫ్‌సీ స్టాండర్డ్ లైఫ్ ఇన్సూరెన్స్, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థలపై ప్రతికూల ప్రభావం పడనున్నది.



రక్షణ రంగం

ఆర్థిక మంత్రి జైట్లీ సైనిక బలగాలను ప్రశంసించారు. రక్షణ రంగ ఉత్పత్తుల తయారీ కోసం పారిశ్రామిక స్నేహపూర్వక విధానాన్ని అమలులోకి తెస్తామని హామీ ఇచ్చారు. కానీ రక్షణ రంగ వ్యయం కోసం భారీగా నిధులు కేటాయిస్తున్న సంకేతాలేమీ లేవు. దీనివల్ల భరత్ ఫోర్జ్ వంటి సంస్థలు లబ్ధి పొందే అవకాశం లేదు.



'హవాయి చెప్ప'లకు ఆకాశయానం!

పౌర విమానయానానికి మూడు రెట్లు పెరిగిన నిధులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: తాము తీసుకొంటున్న చర్యల వల్ల స్లిప్పర్స్ వేసుకొనే సామాన్యులు కూడా విమానాలలో తిరుగగలుగుతారని వ్యాఖ్యానించిన ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ.. పౌర విమానయానరంగానికి నిధుల కేటాయింపు భారీగా పెంచారు. గతం కంటే మూడు రెట్లు అధికంగా నిధులు కేటాయించారు. 2017-18 బడ్జెట్‌లో రూ.2,710.31 కోట్లు కేటాయించగా, 2018-19 బడ్జెట్‌లో ఈ మొత్తాన్ని రూ.6,602 కోట్లకు పెంచడం విశేషం. ఇందులో రూ.4,469.50 కోట్లను రెండు వీవీఐపీ విమానాల కొనుగోలుకు వినియోగించనున్నారు. ఇందులో బోయింగ్ 777-300 ఈఆర్ విమానాన్ని వీవీఐపీ ఆపరేషన్స్‌కు వినియోగిస్తారు. రీజినల్ ఎయిర్ కనెక్టివిటీ స్కీంకు కూడా దాదాపు ఐదురెట్ల నిధులు కేటాయించారు. గతంలో దీనికి రూ.200.11కోట్లు కేటాయించగా, ఈసారి ఈ మొత్తాన్ని రూ.1,014.09 కోట్లకు పెంచారు. పీకల్లోతు నష్టాల్లో మునిగి, పెట్టుబడుల ఉపసంహరణ బాటలో పయనిస్తున్న ఎయిర్ ఇండియాకు బడ్జెట్ మద్దతు బాగా తగ్గించారు. టర్న్‌ఎరౌండ్ ప్రణాళిక కింద గతం బడ్జెట్‌లో రూ.1,800 కోట్లు కేటాయించగా, ఈసారి ఈ మొత్తాన్ని కేవలం రూ.650 కోట్లకే పరిమితం చేశారు.

రీజినల్ ఎయిర్ కనెక్టివిటీ స్కీంలోకి 56 విమానాశ్రయాలు


నిరుపయోగంగా ఉన్న 56 విమానాశ్రయాలు, 31 హెలిప్యాడ్లను 'ది రీజినల్ ఎయిర్ కనెక్టివిటీ స్కీం'లో చేర్చనున్నట్టు ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించారు. నిరుపయోగంగా ఉన్న విమానాశ్రయాలను వాడకంలోకి తీసుకొచ్చి, విమాన ప్రయాణాన్ని మరింత చౌకగా అందుబాటులోకి తెచ్చేందుకు ఉద్దేశించిన ఈ పథకాన్ని ఏడాదిక్రితం ప్రారంభించారు. ఈ పథకం కింద ఇప్పటికే 16 చోట్ల ఆపరేషన్స్ మొదలైనట్టు చెప్పారు. గత మూడేండ్లలో దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్య ఏడాదికి 18 శాతం చొప్పున వృద్ధి చెందినట్టు చెప్పారు. దేశీయ విమానయాన సంస్థలు 900లకు పైగా విమానాల కొనుగోలుకు ఆర్డర్లిచ్చినట్టు వెల్లడించారు. రద్దీకి అనుగుణంగా విమానాశ్రయాల సామర్థ్యాన్ని ఐదురెట్లు పెంచనున్నట్టు ఆయన తెలిపారు. విస్తరణ ప్రణాళికలకు అవసరమైన నిధులను 'ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా' వివిధ మార్గాల్లో సమకూర్చుకుంటుందని ఆయన పేర్కొన్నారు. ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా 124 విమానాశ్రయాలను నిర్వహిస్తున్నది. మౌలిక సదుపాయాల కల్పనే దేశ ఆర్థికాభివృద్ధికి వాహకంగా పనిచేస్తుందని అరుణ్‌జైట్లీ పేర్కొన్నారు. రోడ్లు, రైల్వేలు, ఎయిర్‌పోర్టులు, పోర్టులు, లోతట్టు జలమార్గాల ద్వారా ప్రజలకు మంచి రవాణా సదుపాయాలు కల్పించేందుకు ఈ రంగంలో రూ.50 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు అవసరమని చెప్పారు.

698.38 కోట్లు

కీలకమైన కేసులను ఛేదించే సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)కు బడ్జెట్‌లో ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ రూ.698.38 కోట్లు కేటాయించారు. గతేడాది రూ.679.37 కోట్లు కేటాయించగా ఈసారి కేవలం 2.79 శాతం పెరుగుదలతో రూ.19.01 కోట్లు మాత్రమే పెంచారు. గత ఐదు బడ్జెట్‌లలో ఇదే అత్యల్పం కావడం విశేషం.



- 2018-19లో వ్యవసాయ రుణాలకు రూ. 11 లక్షల కోట్లు.
- గ్రామీణ వ్యవసాయ మార్కెట్లకు రూ.2000 కోట్లు.
- గ్రీన్‌క్లస్టర్ల కోసం రూ.500 కోట్లు. వానకాల పంటల ఉత్పత్తి ఖర్చుకు 1.5 రెట్లు అధికంగా కనీస మద్దతు ధర.
- మత్స్య, పశుసంవర్ధకశాఖలకు రూ.10వేల కోట్లతో నిధి ఏర్పాటు.
- ఉల్లి, టమాట, ఆలుగడ్డ ధరల్లో అసాధారణ వ్యత్యాసాల్ని నివారించేందుకు 'ఆపరేషన్ గ్రీన్' ప్రారంభం.
- ఇకపై చేపల పెంపకందారులు, పశువుల పెంపకందారులకు కూడా కిసాన్ క్రెడిట్ కార్డులు
- 42 మెగాఫుడ్ పార్కుల పటిష్టం. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు రూ.1400 కోట్లు.
- 585 హోల్‌సేల్ మార్కెట్లలో 470 ఈ-నామ్ (ఎలక్ట్రానికల్లీ లింక్‌డ్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్) కార్యక్రమానికి అనుసంధానం.



అసాధారణ బడ్జెట్

అన్ని రంగాల్లో ఉన్నత లక్ష్యాలు నిర్దేశిస్తూ, అత్యున్నత ఆశయాలతో రూపొందించిన ఈ బడ్జెట్ అసాధారణమైంది. మానవీయ కోణంలో ఆర్థిక ప్రగతిని నిర్దేశించినందుకు మా పార్టీ సంతోషంగా ఉన్నది. ఇంత మంచి బడ్జెట్‌ను రూపొందించినందుకు ప్రధానిని, ఆర్థిక మంత్రిని మనఃస్ఫూర్తిగా అభినందిస్తున్నా. 'ఆయుష్మాన్‌భవ' కింద 10 కోట్ల మందికి రూ.5 లక్షల ఆరోగ్య బీమా కల్పించడంతో 'అందరికీ ఆరోగ్యం' అన్న నినాదం ఇప్పుడు వాస్తవ రూపం దాల్చనున్నది.

లాల్ కృష్ణ అద్వానీ, బీజేపీ సీనియర్ నేత

రైతు ఆదాయం రెట్టింపు చేస్తాం

పంటఖర్చుకు ఒకటిన్నర రెట్లు కనీస ధర ▪ వ్యవసాయం, గ్రామీణానికి 14.34 లక్షల కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1:

వ్యవసాయాన్ని లాభసాటి పెట్టుబడి రంగంగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, పంట వ్యయానికి తగ్గ ఫలితం ఉండేలా చూస్తామని ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ అన్నారు. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేయాలని ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారని గుర్తు చేశారు. గురువారం పార్లమెంటుకు సమర్పించిన కేంద్ర బడ్జెట్‌లో జైట్లీ.. వ్యవసాయ, గ్రామీణ రంగానికి పలు పథకాలు ప్రకటించి ఆ మేరకు నిధులు కేటాయించారు. ముఖ్యంగా పంటకు మద్దతుధర విషయంలో కీలక ప్రకటన చేశారు. వానకాలం పంటల కనీస మద్దతుధరను ఉత్పత్తి వ్యయానికి ఒకటిన్నర రెట్ల మేరకు పెంచనున్నట్టు ఆర్థికమంత్రి ప్రకటిం చారు. అంటే సేద్యానికి అయిన పెట్టుబడి వ్యయంపై కనీసం 50 శాతం వరకు లబ్ధి చేకూరేలా చూడటమే దీనివెనుక గల ఉద్దేశమని చెప్పారు. మక్కజొన్న, సోయాబీన్, పప్పుదినుసులతో సహా పలు యాసంగిపంటల కనీస మద్దతు ధరలను ఉత్పత్తి వ్యయం కంటే ఒకటిన్నర రెట్లకు ఇదివరకే పెంచామని తెలిపారు. రైతులు తమ దిగుబడికి మంచిధరను పొందేలా వ్యవస్థాపరమైన యంత్రాంగం ఏర్పాటు చేసేందుకు రాష్ట్రాలతో కలిసి నీతిఆయోగ్ కసరత్తు చేస్తున్నదని వివరించారు.

గ్రామీణానికి భారీగా కేటాయింపులు

గ్రామీణ రంగంలో ఉపాధికల్పనకు భారీస్థాయిలో రూ.14.34 లక్షల కోట్లను ప్రతిపాదించారు. 2016-17 సంవత్సరంలో పంటల దిగుబడి రికార్డుస్థాయిలో 275 మిలియన్ టన్నులకు చేరుకోవడాన్ని గుర్తు చేస్తూ, వ్యవసాయ ఆదాయాలను మరింతగా పెంచడంపై, వ్యవసాయం పరిశ్రమగా రూపాంతరం చెందేలా చేయడంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి నిలిపిందని జైట్లీ తెలిపారు. ఈ లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని 2018-19లో వ్యవసాయానికి సంస్థాగత రుణాలను రూ.11 లక్షల కోట్లకు పెంచాలని ప్రతిపాదించారు. ఇది మునుపటి ఏడాది కంటే 10 శాతం ఎక్కువ. 2014-15లో 8.5 లక్షల కోట్లుగా ఉన్న సంస్థాగత రుణాలను ఎన్డీఏ సర్కారు క్రమంగా పెంచుకుంటూ వస్తున్నది. 'ఆపరేషన్ గ్రీన్'కు రూ.500 కోట్లు కేటాయించారు. వ్యవసాయ మార్కెట్ల అభివృద్ధికి రూ.2000 కోట్ల మూలనిధితో అగ్రిమార్కెట్ ఇన్‌ఫ్రా ఫండ్‌ను ఏర్పాటు చేయనున్నట్టు ఆర్థికమంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. జాతీయ వెదురు పథకానికి రూ.1290 కోట్లు కేటాయించారు. వెదురును ఆకుపచ్చ బంగారమని అభివర్ణిస్తూ, అడవుల వెలుపల పెంచిన వెదురును చెట్ల జాబితా నుంచి తొలిగిస్తున్నట్టు చెప్పారు. టమాటో, ఉల్లి వంటి కూరగాయల ధరల అస్థిరతను అదుపు చేసే ఉద్దేశంతో విడిగా రూ.500 కోట్లతో 'ఆపరేషన్ గ్రీన్' కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. రైతుకు సరైన ధర లభించేలా యంత్రాంగాన్ని సమన్వయం చేయడంలో 'ఆపరేషన్ గ్రీన్' కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ఔషధ, సుగంధ మొక్కల పెంపకానికి రూ.200 కోట్లు కేటాయించారు. నీటిపారుదల రంగాన్ని మెరుగుపర్చే లక్ష్యంతో ప్రధానమంత్రి సించాయి యోజనకు కేటాయింపులను రూ.2600 కోట్లకు పెంచారు. పశుసంవర్ధక, మత్స్యశాఖల అభివృద్ధికి రూ.10,000 కోట్ల మూలనిధిని కేటాయించారు. దీంతో ఫిషరీస్, అక్వా కల్చర్ ఇన్‌ఫ్రా ఫండ్, యానిమల్ హజ్బెండరీ ఇన్‌ఫ్రా ఫండ్ ఏర్పాటు చేయనున్నట్టు ఆర్థిక మంత్రి చెప్పారు. దేశంలోని 585 మండీలలో 470 మండీలను ఇనాం కార్యక్రమంలో జతపర్చామని, మిగిలినవాటిని వచ్చే మార్చికల్లా అనుసంధానిస్తామని పేర్కొన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రిత్వ శాఖకు రూ.1400 కోట్లు కేటాయించారు.



వ్యవసాయ ఎగుమతులకు ప్రోత్సాహం

వ్యవసాయాన్ని పరిశ్రమగా గుర్తించే ప్రభుత్వం తక్కువ వ్యయంతో ఎక్కువ పంటను పండించి అధిక లాభం పొందేలా రైతులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తుందని ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించేందుకు ప్రత్యేకచర్యలు చేపడుతుందని ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ చెప్పారు. పదివేల కోట్ల డాలర్ల (సుమారు రూ.7 లక్షల కోట్లు) ఎగుమతి లక్ష్యాన్ని సాధించే సత్తా ఈ రంగానికి ఉన్నదని ఆయన అన్నారు. ప్రస్తుతం వ్యవసాయ ఎగుమతులు మూడువేల కోట్ల స్థాయిలో (రూ.2 లక్షల కోట్లు) ఉన్నాయని చెప్పారు. వ్యవసాయ ఎగుమతుల రంగం పూర్తి స్థాయిలో సత్తా చూపేందుకు వీలుగా ఎగుమతుల నిబంధనలను సరళీకరిస్తామని పేర్కొన్నారు. 42 మెగా ఫుడ్ పార్కులలో అత్యాధునిక వసతులు కల్పిస్తామని తెలిపారు. టీ, కాఫీ, పండ్లు, కూరగాయల ఎగుమతికి సమగ్ర విధానాన్ని రూపొందించేందుకు వాణిజ్యశాఖ కసరత్తు చేస్తున్న నేపథ్యంలో జైట్లీ ప్రకటన ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నది.



పెరిగేవి

దిగుమతి చేసుకునే ఈ కింది వస్తువుల ధరలు పెరుగనున్నాయి.

- కార్లు, మోటర్‌సైకిళ్లు
- మొబైల్ ఫోన్లు,
- వెండి
- బంగారం
- కూరగాయలు, పండ్ల రసాలు
- చలువ కళ్లద్దాలు
- భోజన పదార్థాలు వండటానికి అవసరమైన పలురకాల పదార్థాలు
- సుగంధ పరిమళాలు, మరుగుదొడ్లను శుభ్రపరిచేందుకు ఉపయోగించే ద్రవ పదార్థాలు
- సన్‌స్క్రీన్, సన్‌టాన్, పెడిక్యూర్, మెనిక్యూర్
- దంతాల శుభ్రతకు, దంతవైద్యానికి ఉపయోగించే పేస్టులు, పౌడర్లు
- డియోడరెంట్లు
- టాయ్‌లెట్లలో వాడే సెంట్ స్ప్రే
- ట్రక్కులు, బస్సుల టైర్లు
- పట్టు వస్త్రాలు
- పాదరక్షలు (చెప్పులు, బూట్లు)
- రంగుల రత్నాలు
- వజ్రాలు, అనుకరణ ఆభరణాలు
- స్మార్ట్ వాచ్‌లు
- ఎల్సీడీ, ఎల్ఈడీ టీవీ ప్యానెల్
- ఫర్నీచర్
- దుప్పట్లు ▪ ల్యాంప్స్
- చేతి, పాకెట్, టేబుల్, గోడ గడియారాలు
- మూడుచక్రాల సైకిళ్లు, పిల్లలు ఆడుకొనే స్కూటర్లు, పెడల్ కార్లు, బొమ్మలు
- వీడియో గేమ్స్
- క్రీడలు లేదా ఔట్‌డోర్ గేమ్స్‌కు సంబంధించిన వస్తువులు
- సిగరెట్లు, ఇతర లైటర్లు, కొవ్వొత్తులు
- పతంగులు
- పల్లీ, ఆలివ్ వంటి వంటనూనెలు

తగ్గేవి



ధర తగ్గనున్న దిగుమతి వస్తువులు

- జీడిపప్పు
- సోలార్ ప్యానెళ్ల తయారీకి ఉపయోగించే సోలార్ టెంపర్డ్ గ్లాస్
- బధిరులు వాడే వినికిడి యంత్రాల తయారీకి అవసరమైన ముడి పదార్థాలు
- బాల్ స్క్రూలు, మోషన్ గైడ్స్ వంటి కొన్ని ఎంపిక చేసిన ఎలక్ట్రానిక్స్, మూలధన వస్తువులు

పరాజయవాద బడ్జెట్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: కాంగ్రెస్ సీనియర్ నేత పీ చిదంబరం కూడా బడ్జెట్‌పై తీవ్ర విమర్శలు సంధించారు. అంశాలవారీగా ప్రభుత్వ వైఫల్యాలను ఏకరువు పెట్టారు. పార్లమెంటులో ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం చిదంబరం మీడియాతో మాట్లా డుతూ.. ప్రభుత్వం ఆర్థికరంగంలో కీలక సమస్యలను పరిష్కరించలేక చేతులెత్తేసిందని దుయ్యబట్టారు. బడ్జెట్ ప్రతిపాదనలు ఎప్పుడూ ధైర్యంగా, విప్లవాత్మకంగా ఉండాలని అన్నారు. కానీ జైట్లీ బడ్జెట్ పరాజయ ధోరణిలో సాగి నిరాశపర్చిందని చిదంబరం పేర్కొన్నారు. 'ఇది పరాజయవాద బడ్జెట్. సర్కారు చేతులెత్తేసింది. ఆర్థికరంగం ఎదుర్కొంటున్న కీలక సమస్యలను పరిష్కరించడంలో విఫలమైనట్టు ఒప్పుకున్న సర్కారు తెచ్చిన ఈ బడ్జెట్ నిరాశపర్చింది' అని చిదంబరం అన్నారు. సర్కారు అన్నివిధాలా విఫలమైందని, ద్రవ్యలోటు పూడ్చలేకపోవడం మొదటి వైఫల్యమని ఆయన చెప్పారు. ద్రవ్య స్థిరీకరణలో ప్రభుత్వం విఫలమైందని, 3 శాతం ద్రవ్యలోటు లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం రాబోయే ఆర్థిక సంవత్సరానికి లోటును 3.3 శాతంగా సవరించిందని తెలిపారు. ఎగుమతులను ప్రోత్సహించే విషయంలో ప్రభుత్వానికి కొత్త ఆలోచనలేవీ లేవని చిదంబరం అన్నారు. మొత్తంగా మోదీ సర్కారుకు భావదారిద్ర్యం పట్టుకున్నదని దుయ్యబట్టారు.

- **నిరాశపర్చింది**

కేంద్ర బడ్జెట్ నిరాశపర్చింది. ద్రవ్యోల్బణం పెరిగేలా, సామాన్యుడి జేబుకు చిల్లుపడేలా బడ్జెట్ ప్రతిపాదనలు ఉన్నాయి. వైద్య సేవలు అందించడమనేది ప్రభుత్వం సాధారణ బాధ్యత. **-నవాబ్ మాలిక్, ఎన్సీపీ నేత**

- **పేదల వ్యతిరేకం**

మోదీ ప్రభుత్వ హయాంలోని గత బడ్జెట్‌ల తరహాలోనే ఇది కూడా పేదల వ్యతిరేక, పెట్టుబడిదారుల అనుకూల బడ్జెట్. 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు మోదీ ఇచ్చిన 'అచ్ఛేదిన్' హామీ ఏమైంది? **- బీఎస్పీ అధినేత్రి మాయావతి**

- **ప్రజలను ఏమార్చే పద్దు ఇది**

ఇది అభివృద్ధి సూచించే బడ్జెట్ కాదు. దీంతో యువతకు ఉపాధి లభించదు. లోక్‌సభకు ముందస్తు ఎన్నికల దృష్ట్యా ప్రజలను ఏమార్చే పద్దు ఇది.

-డీ రాజా, సీపీఐ నేత

- **జిమ్మిక్కుల బడ్జెట్**

ముందస్తు ఎన్నికల నేపథ్యంలో బడ్జెట్ కేటాయింపులు చేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పథకాలు ప్రవేశపెట్టారు. ఇది ముమ్మాటికీ జిమ్మిక్కుల బడ్జెట్. **- మహ్మద్ సలీం, సీపీఎం లోక్‌సభాపక్ష నేత**

- **రైతులను, బీహార్‌ను విస్మరించారు**

బడ్జెట్ కేటాయింపుల్లో బీహార్‌కు ప్రత్యేక ప్యాకేజీ, ప్రత్యేక హోదా అంశాన్ని విస్మరించారు. సీఎం నితీశ్‌కుమార్ వల్లే కేంద్రప్రభుత్వం రాష్ట్రంపై సవతి ప్రేమ చూపించింది. పద్దులో రైతులకు సరైన కేటాయింపులు చేయలేదు.

- తేజస్వియాదవ్, బీహార్ ప్రతిపక్షనేత

- కేంద్ర బడ్జెట్ ఎన్డీఏ ప్రభుత్వం రాసుకొన్న ఒక మరణ వాంగ్మూలంలాంటిది. సూపర్ ఫ్లాప్ షో ఇది. ఒక పెద్ద మోసపూరిత ప్రదర్శన ఇది. ప్రభుత్వ సమయం అయిపోయింది. **- డెరెక్ ఓ బ్రయెన్, తృణమూల్ కాంగ్రెస్ నేత**

- ఇది పూర్తిగా ఎన్నికల బడ్జెట్. అందుకే పరిశ్రమల నుంచి రైతులు, ఆరోగ్యం, విద్యవైపు ప్రభుత్వం దృష్టి మళ్లింది. **-అరవింద్ సావంత్, శివసేన**

- ఇదొక విధ్వంసకర బడ్జెట్. పెట్టుబడిదారులకు మాత్రమే అనుకూలమైనది. వ్యాపారులు, మహిళలు, ఉద్యోగులు, సామాన్యులు, పేదలపాలిట చెంపపెట్టు. సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది.

- అఖిలేశ్ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు



పెట్రోల్, డీజిల్ ధరలు యథాతథం

అంతర్జాతీయ మార్కెట్‌లో భగ్గుమంటున్న ముడిచమురు ధరల నేపథ్యంలో బడ్జెట్ ద్వారా దేశీయంగా ఇంధన ధరలను జైట్లీ శాంతింపజేస్తారన్న ఆశలు అడియాసలే అయ్యాయి. బడ్జెట్‌లో పెట్రోల్, డీజిల్‌పై పన్నుల భారం తగ్గించాలన్న డిమాండ్‌ను జైట్లీ ఏమాత్రం పట్టించుకోలేదు. ఎక్సైజ్ సుంకాన్ని అటు ఇటు మార్చిన ఆర్థిక మంత్రి.. చివరకు పన్ను విలువను మాత్రం యథాతథంగానే ఉంచారు. లీటర్ పెట్రోల్, డీజిల్‌పై రూ.2 చొప్పున కనీస ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించిన జైట్లీ.. అదనంగా వేస్తున్న ఎక్సైజ్ పన్నులోనూ రూ.6 చొప్పున తగ్గిస్తున్నట్టు పేర్కొన్నారు. అయితే రహదారులు, మౌలిక రంగ సెస్సు లెవీగా లీటర్ పెట్రోల్, డీజిల్‌పై రూ.8 చొప్పున వడ్డింపులు చేశారు. దీంతో మార్కెట్‌లో ఇంధన ధరలు మాత్రం అలాగే ఉండనున్నాయి. ఢిల్లీలో ప్రస్తుతం లీటర్ పెట్రోల్ ధర రూ.73గా ఉంటే, డీజిల్ ధర రూ.64.11 పలుకుతున్నది. కేవలం గడిచిన నెలన్నర రోజుల్లో లీటర్ పెట్రోల్ ధర దాదాపు రూ.4 పెరుగగా, డీజిల్ ధర రూ.5.77 ఎగిసింది.

మౌలిక రంగానికి రూ.6 లక్షల కోట్లు




దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి చోదక శక్తిగా చూపిస్తూ ఈసారి బడ్జెట్‌లో మౌలిక రంగానికి పెద్ద పీట వేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2018-19)గాను గురువారం కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించిన బడ్జెట్‌లో మౌలిక రంగానికి రూ.5.97 లక్షల కోట్ల నిధులు కేటాయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017-18)లో దక్కిన నిధుల కంటే ఇవి రూ. లక్ష కోట్లు ఎక్కువ కావడం విశేషం. స్వయంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీనే మౌలిక రంగ ప్రాజెక్టు లక్ష్యాలను పర్యవేక్షిస్తున్న నేపథ్యంలో ఈ రంగానికి బడ్జెట్‌లో సహజంగానే అధిక ప్రాధాన్యత లభించింది. 'ఆర్థిక వ్యవస్థ వృద్ధిని నడిపించేది మౌలిక రంగమే. రహదారులు, రైల్వేలు, విమానాశ్రయాల అభివృద్ధి, సాగు, తాగునీటి వసతుల కల్పన, ప్రజలకు మెరుగైన సేవల కోసం, జీడీపీ బలోపేతానికి మౌలిక రంగంలో భారీగా రూ.50 లక్షల కోట్ల పెట్టుబడులు అవసరం' అని జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో అన్నారు. ఉద్యోగ, ఉపాధి కల్పన, వృద్ధిరేటు పురోగతి కోసమే ఈసారి బడ్జెట్‌లో మౌలిక రంగానికి రూ.5.97 లక్షల కోట్ల నిధులను కేటాయించామని జైట్లీ వివరించారు. గత బడ్జెట్‌లో రూ.4.94 లక్షల కోట్లను ఇచ్చినట్లు గుర్తుచేశారు. ఈ రంగానికి ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా ప్రధాని మోదీనే మౌలిక ప్రాజెక్టుల అభివృద్ధిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారన్నారు. రైల్వేలు, రోడ్డు రవాణాకు అత్యధిక నిధులను తప్పక అందిస్తామన్న ఆయన మౌలిక రంగాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.



క్రిప్టో కరెన్సీలు చట్టవిరుద్ధమే

బిట్‌కాయిన్‌సహా అన్నిరకాల క్రిప్టో కరెన్సీలు చట్టవిరుద్ధమైనవేనని బడ్జెట్‌లో జైట్లీ ప్రకటించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ అదృశ్య కరెన్సీని చట్టసమ్మతంగాగానీ, నాణేలుగాగానీ పరిగణించబోమన్న జైట్లీ.. వీటి లావాదేవీలను అంగీకరించేది లేదన్నారు. ఈ వర్చువల్ కరెన్సీ వినియోగాన్ని నియంత్రించేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. గతేడాది ఒక్కో బిట్‌కాయిన్ విలువ ఏకంగా రూ.13 లక్షల (20,000 డాలర్లు) వరకు పలికిన విషయం తెలిసిందే. ప్రస్తుతం దీని విలువ సగానికి పడిపోగా, ఈ దృష్ట్యానే అమాయక మదుపరులు పెట్టుబడులు పెట్టి నష్టపోకుండా అటు ప్రభుత్వం, ఇటు రిజర్వ్ బ్యాంక్ ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీచేస్తూనే ఉన్నాయి. దేశంలో ఈ డిజిటల్ కరెన్సీకి ప్రభుత్వం నుంచైనా, ఆర్బీఐ నుంచైనా ఎలాంటి గుర్తింపు, నియంత్రణ లేదన్న విషయాన్ని గతేడాది పార్లమెంట్ సమావేశాల్లోనే జైట్లీ స్పష్టం చేశారు. కాగా, ఈ వ్యవహారంపై ఆర్థిక మంత్రిత్వశాఖల నేతృత్వంలో ఓ కమిటీని కూడా నియమించగా, అది సమర్పించిన నివేదిక పరిశీలనలో ఉన్నదని చెప్పారు. ఆదాయం పన్ను (ఐటీ)శాఖ సైతం బిట్‌కాయిన్ తదితర క్రిప్టో కరెన్సీ ఎక్స్ఛేంజ్‌ల్లో తనిఖీలు నిర్వహించగా, భారీగా పెట్టుబడులు పెట్టినవారిని గుర్తించిన విషయం తెలిసిందే. దీంతో వీరందరికి నోటీసులను పంపించే పనిలో ఇప్పుడు ఆదాయం పన్ను అధికారులు నిమగ్నమయ్యారు.



దిగుమతి వస్తువులపై సామాజిక సంక్షేమ సర్‌చార్జి

విదేశాల నుంచి దిగుమతి చేసుకునే సరుకులపై విధించే విద్యాసెస్సును తొలిగించి దాని బదులుగా సామాజిక సంక్షేమ సర్‌చార్జిని ప్రవేశపెట్టనున్నారు. ఈ విషయాన్ని ఆర్థికమంత్రి జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. దిగుమతి వస్తువులపై విధించే కస్టమ్స్‌డ్యూటీలో 10 శాతం మొత్తాన్ని సామాజిక సంక్షేమ సర్‌చార్జిగా అదనంగా వసూలు చేస్తామని చెప్పారు.

2022 నాటికి విద్యారంగంలో 'రైజ్'

- **రూ.85,010 కోట్ల కేటాయింపు**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1:

వచ్చే ఆర్థిక సంవత్సరంలో విద్యారంగానికి అధిక ప్రాధాన్యమివ్వనున్నట్టు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. సంస్కరణల ద్వారా విద్యార్థులకు, విద్యారంగానికి అనేక సదుపాయాలు కల్పించనున్నట్టు ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ పేర్కొన్నారు. 2022 నాటికి 'రీవైటలైజింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ సిస్టమ్స్ ఇన్ ఎడ్యుకేషన్ (రైజ్) కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. దీనికి వచ్చే నాలుగేండ్లలో రూ. లక్ష కోట్లు వెచ్చిస్తామని, ఆరోగ్య సంస్థలతోపాటు ప్రఖ్యాత విద్యాలయాలల్లో మౌలిక సదుపాయాలు, పరిశోధనలపై పెట్టుబడులు పెట్టేందుకు దోహదపడగలదన్నారు. నాణ్యమైన విద్యను అందించడంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. విద్యారంగానికి ప్రభుత్వం రూ.85,010 కోట్లు కేటాయించింది. వీటిలో ఉన్నత విద్య కోసం రూ.35,010 కోట్లు, పాఠశాల విద్య కోసం రూ.50వేల కోట్లను కేటాయిస్తున్నట్టు అరుణ్‌జైట్లీ తెలిపారు. గిరిజనుల్లో అక్షరాస్యతను పెంపొందించేందుకు 2022 నాటికి ఎస్టీల జనాభా 50 శాతం కన్నా అధికంగా ఉన్న ప్రతి బ్లాక్‌లో, 20వేల గిరిజనులు ఉండే ప్రతి ప్రాంతంలో ఒక ఏకలవ్య పాఠశాలను నెలకొల్పుతామని ప్రకటించారు. నవోదయ విద్యాలయాలతో సమానంగా వాటికి అన్ని సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ఉపాధ్యాయుల కోసం ప్రభుత్వం సమీకృత బీఎడ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తుందని చెప్పారు. అన్ని పాఠశాలల్లో డిజిటల్ విద్యా బోధనను అందుబాటులోకి తీసుకురానున్నట్టు స్పష్టం చేశారు. ఈ ఏడాది ప్రభుత్వం 'ప్రైం మినిస్టర్స్ రీసెర్చ్ ఫెలోస్ (పీఎంఆర్ఎఫ్) పథకాన్ని ప్రారంభించనుందని తెలిపారు. ఈ పథకం కింద వెయ్యిమంది ఉత్తమ బీటెక్ విద్యార్థులను ఎంపిక చేసి వారు ఐఐటీలు, ఐఐఎస్సీలలో పీహెచ్‌డీలు చేసేందుకు మంచి ఉపకార వేతనంతోపాటు సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. గుజరాత్‌లోని వడోదరలో రైల్వే యూనివర్సిటీని నెలకొల్పేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్టు తెలిపారు. దేశంలోని ఐఐటీలు, ఎన్ఐటీల్లో 18 స్వయం ప్రతిపత్తిగల నూతన ప్లానింగ్, ఆర్కిటెక్చర్ స్కూల్స్ ఏర్పాటు చేయనున్నట్టు జైట్లీ వెల్లడించారు.

ఎస్టీల జనాభా 50శాతం ఉంటే ఏకలవ్య పాఠశాల

పీఎంఆర్ఎఫ్ కింద 1000 మంది బీటెక్ విద్యార్థులకు ఫెలోషిప్



నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
శుక్రవారం 2 ఫిబ్రవరి 2018

మహేష్‌తో జోడీగా..

'ముకుంద' 'దువ్వాడ జగన్నాథమ్' చిత్రాలతో యువతరాన్ని ఆకట్టుకుంది బెంగళూరు చిన్నది పూజా హెగ్డే. తాజాగా ఈ అమ్మడు తెలుగులో ఓ భారీ ఆఫర్‌ను సొంతం చేసుకుంది. మహేష్‌బాబు 25వ చిత్రంలో పూజాహెగ్డే కథానాయికగా నటించనుంది. వంశీ పైడిపల్లి దర్శకత్వం వహించే ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాతలు దిల్‌రాజు, అశ్వనీదత్ సంయుక్తంగా నిర్మించబోతున్నారు. గత ఏడాది ఆగస్టులో ఈ సినిమాను లాంఛనంగా ప్రారంభించారు. త్వరలో సెట్స్‌మీదకు వెళ్లనుంది. ఈ చిత్రానికి దేవిశ్రీప్రసాద్ సంగీతాన్నందిస్తారు. గత ఏడాది 'దువ్వాడ జగన్నాథమ్' చిత్రంలో పూజా హేగ్డే కథానాయికగా నటించింది. తన అందచందాలతో కుర్రకారులో మంచి క్రేజ్ సంపాదించుకుంది. తాజాగా ఈ వయ్యారి మహేష్‌బాబు సరసన లక్కీ ఛాన్స్ కొట్టేయడం విశేషం. సుకుమార్ దర్శకత్వంలో రామ్‌చరణ్ నటిస్తున్న తాజా చిత్రం 'రంగస్థలం'లో పూజాహెగ్డే ఓ ఐటెమ్‌సాంగ్‌లో నర్తిస్తున్నది. వరుసగా క్రేజీ ప్రాజెక్టులలో అవకాశాలు సంపాదిస్తూ తారాపథంలో దూసుకుపోతున్నది పూజా హెగ్డే.



పూజా హెగ్డే



త్రిష




డిజిటల్ సమస్యలపై పోరాటం


సినిమాలపై వస్తున్న ప్రతిఫలం నిర్మాతలు అందుకోకుండా ఎక్కడినుంచో వచ్చిన డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ అన్యాయంగా దోచుకుంటున్నారని తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి సభ్యులు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. బుధవారం తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి(టీఎఫ్‌సీసీ) నిర్వహించిన అత్యవసర సమావేశంలో డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలపై సభ్యులు చర్చించారు. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ ఇష్టారీతిగా ఛార్జీలు వసూలు చేస్తున్నారని, ఈస్ట్ ఇండియా కంపెనీలా తయారై అధికంగా డబ్బు గుంజుతున్నారని ఆరోపించారు. తక్కువ ధరకు సర్వీస్‌లను అందిస్తున్న వారిని అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్‌తో వారంలోగా సమావేశాన్ని ఏర్పాటుచేసి ధరల తగ్గింపుతో పాటు ఇతరత్రా అంశాలపై చర్చించాలని నిర్ణయించారు. ఈ సమస్యకు పరిష్కారం లభించని పక్షంలో మార్చి 1 నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో థియేటర్లను మూసివేయాలని సభ్యులు నిర్ణయించారు. ఈ అత్యవసర సమావేశంలో టీఎఫ్‌సీసీ అధ్యక్షుడు పి.కిరణ్, సెక్రటరీలు ఎమ్.రామదాసు, కె. శివప్రసాదరావు, తెలంగాణ రాష్ట్ర ఫిలిం ఛాంబర్ అధ్యక్షులు కె. మురళీమోహన్‌రావు, సెక్రటరీ సునీల్ నారంగ్, దక్షిణాది ఫిలిం ఛాంబర్ అధ్యక్షులు ఎల్.సురేష్, జాయింట్ సెక్రటరీ శ్రీ రవి కొట్టరాకర, తమిళ సినిమా నిర్మాతల సంఘం అధ్యక్షుడు విశాల్‌కృష్ణతో పాటు దక్షిణాది చిత్రపరిశ్రమ విభాగాల వారు పాల్గొన్నారు.

గూఢచారి బయోపిక్‌లో..

ప్రస్తుతం భారతీయ చిత్రసీమలో బయోపిక్‌ల (జీవిత కథా చిత్రాలు) ట్రెండ్ నడుస్తోంది. ప్రముఖ వ్యక్తుల జీవిత కథలు వెండితెరపై దృశ్యమానం అవుతున్నాయి. తాజాగా చెన్నై సోయగం త్రిష తొలిసారిగా ఓ బయోపిక్‌లో నటించబోతున్నది. వివరాల్లోకి వెళితే.. తొలి భారత మహిళా గూఢచారి రజనీపండిట్ జీవిత కథ ఆధారంగా తమిళంలో 'కుట్రాప్పయిర్చి' పేరుతో ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇందులో రజనీపండిట్ పాత్రను త్రిష పోషిస్తున్నది. ఎనభైదశకంలో సంచలనం సృష్టించిన ఓ హత్యా రహస్యాన్ని ఛేదించే యుక్తిపరురాలైన మహిళ డిటెక్టివ్ పాత్రలో త్రిష కనిపించనుంది. వెర్నిక్ దర్శకుడు. ఇందులో ప్రియమణి మరో కీలక పాత్రలో నటించనుంది. ఓ శక్తివంతమైన మహిళా డిటెక్టిక్ పాత్రను పోషించడం ఆనందంగా వుందని, తన కెరీర్‌లో గుర్తిండిపోయే చిత్రవుతుందని త్రిష ఆశాభావాన్ని వ్యక్తం చేసింది.







ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీకి అస్వస్థత

అపోలో దవాఖానలో చేరిక

హైదరాబాద్/బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ: ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ గురువారం రాత్రి స్వల్ప అస్వస్థతకు గురికావడంతో జూబ్లీహిల్స్‌లోని అపోలో దవాఖానలో చేరారు. రాత్రి 8గంటల ప్రాంతంలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతిలో నొప్పి ఉందని మహమూద్ అలీ చెప్పడంతో మంత్రుల నివాస సముదాయం నుంచి హుటాహుటిన తరలించారు. ఈసీజీ, యాంజియోగ్రామ్ పరీక్షలు నిర్వహించారు. అలసట వల్ల స్వల్పమైన సమస్యలు వచ్చినట్టు తెలుస్తున్నది. గుండె సమస్యలు లేనట్టు వైద్య పరీక్షల్లో తేలాయి. మహమూద్ అలీ ఆరోగ్యం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కుటుంబసభ్యులు తెలిపారు.

వేరుశనగ కొనుగోలుకు కేంద్రం అంగీకారం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో వేరుశనగ కొనుగోలుకు కేంద్రప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు గురువారం కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వానికి లేఖరాసింది. రాష్ట్రంలో రైతులు 1.28 లక్షల హెక్టార్లలో వేరుశనగ పంట సాగు చేశారని.. 2.40 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఈ నేపథ్యంలో వేరుశనగ కొనుగోలుకు సహకరించాలని మార్కెటింగ్‌శాఖ మంత్రి హరీశ్‌రావు జనవరి 8న, వ్యవసాయ కార్యదర్శి సీ పార్థసారథి జనవరి 28న కేంద్రానికి లేఖ రాశారు. తెలంగాణలో పండించిన వేరుశనగను 96 వేల టన్నుల మేరకు సేకరిస్తామని కేంద్రప్రభుత్వం గురువారం తెలిపింది. కేంద్రప్రభుత్వ కనీస మద్దతు పథకం (పీఎస్‌ఎస్) కింద నాఫెడ్, ఆయిల్‌ఫెడ్ సంస్థల ద్వారా కొనుగోలు జరుగనున్నది. కేంద్రం నిర్ణయం పట్ల మంత్రి హరీశ్‌రావు గురువారం హర్షంవ్యక్తంచేశారు.

తెలంగాణ ప్రభుత్వ పథకాలు భేష్

డబుల్ బెడ్‌రూం ఇండ్లు, ప్రాజెక్టుల నిర్మాణం అద్భుతం.. కేంద్రగ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ సెక్రటరీ అపరాజిత సారంగి

సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ: 'దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో అమలవుతున్న వివిధ పథకాలు భేషుగ్గా ఉన్నాయి.. రాష్ట్ర ప్రభుత్వ పనితీరు బాగుంది.. డబుల్ బెడ్‌రూం ఇండ్లు, హరితహారం, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం అద్భుతం.. సీఎం కేసీఆర్ దత్తత గ్రామం అభివృద్ధి చెందిన తీరు ఆదర్శ'మని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ సెక్రటరీ అపరాజిత సారంగి అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని సంగాపూర్‌లో డబుల్ బెడ్‌రూం ఇండ్లను పరిశీలించారు. అక్కడే ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ దత్తత గ్రామమైన ఎర్రవెల్లిని సందర్శించారు. సిద్దిపేట నియోజకవర్గంలోని బక్రిచెప్యాల, ఎల్లుపల్లి, వెంకటాపూర్, ఇర్కోడు, బూర్గుపల్లి గ్రామాల్లో ఉపాధిహామీ పనులను రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ జాయింట్ కమిషనర్ నీతూకుమారి ప్రసాద్, కలెక్టర్ పీ వెంకట్రామ్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అపరాజిత సారంగి మాట్లాడుతూ.. గజ్వేల్‌లో నిర్మిస్తున్న డబుల్‌బెడ్‌రూం ఇండ్ల పథకం అద్భుతంగా ఉన్నదని, విశాలమైన ప్రదేశంలో ఒకేచోట ఇండ్ల నిర్మాణం ఎంతో బాగున్నదన్నారు. వికారాబాద్, కామారెడ్డి జిల్లాల్లో బుధవారం పర్యటించి ఉపాధి హామీ పథకం అమలు తీరును తెలుసుకున్నానని, రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ఎర్రవల్లిలోని డబుల్ బెడ్‌రూం ఇండ్లల్లో నివాసముంటున్న వారి జీవన స్థితిగతులను, కల్యాణ మండపం కట్టిన తీరును కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టిన గ్రామ పంచాయతీ భవనాలు, సీసీ రోడ్ల నిర్మాణాలు, పండ్ల తోటల పెంపకం, పశువుల షెడ్లు, వర్మీ కంపోస్టు, శ్మశాన వాటికల నిర్మాణం తదితర అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి బాగున్నాయని మెచ్చుకున్నారు. ఆయా గ్రామాల్లో రైతులు సాగు చేసిన మామిడి తోటల ద్వారా వచ్చే రాబడిని రైతుల మాట్లాడి తెలుసుకున్నారు. ఆమె వెంట ఉపాధి హామీ పథకం డైరెక్టర్ ఆర్పీ సింగ్, అసిస్టెంట్ కమిషనర్ మోతీరామ్, ఎకానమిక్ ఆఫీసర్ అవిరిష్‌కుమార్, డీఆర్‌డీఏ జాయింట్ కమిషనర్లు సైదులు, ఆశ, పీడీ దాసరి ఏగొండ స్వామి, ప్రోగామ్ అధికారులు జితేందర్‌ఆనంద్, గజానన్‌రాంట్, అనిల్‌కుమార్‌కట్ట, శ్రుతిసింగ్, దవుల్‌దాస్పత్‌నాయక్, గడా ఓఎస్డీ హన్మంతరావు తదితరులు ఉన్నారు.



సిద్దిపేట అర్బన్ మండలం ఎల్లుపల్లిలో ఉపాధిహామీ పనుల ద్వారా చేపడుతున్న రైతు షెడ్డును పరిశీలిస్తున్న కేంద్రగ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ సెక్రటరీ అపరాజిత సారంగి



గురువారం జలసౌధలో కాళేశ్వరం పనులపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ప్రభుత్వ విప్ సునీత

వానకాలం నాటికి యాదాద్రికి కాళేశ్వరం నీళ్లు

- గంధమల్ల, బస్వాపూర్ రిజర్వాయర్ల పనులు వేగవంతం చేయాలి
- మంత్రి హరీశ్‌రావు ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరువు పీడిత యాదాద్రి భువనగిరి జిల్లాకు వచ్చే వానకాలం నాటికి కాళేశ్వరం జలాలు అందుతాయని రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు ప్రకటించారు. ఇందుకోసం గంధమల్ల, బస్వాపూర్ రిజర్వాయర్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆయన అధికార యంత్రాంగాన్ని, ఏజెన్సీలను ఆదేశించారు. గురువారం జలసౌధలో యాదాద్రి జిల్లాలో చేపడుతున్న కాళేశ్వరం ప్యాకేజీ 15,16 పనులపై మంత్రి సమీక్ష నిర్వహించారు. రిజర్వాయర్ పూర్తికాకపోయినా మూడు డిస్ట్రిబ్యూటరీలను పూర్తి చేస్తే వాటి ద్వారా 100 చెరువులు నింపి జిల్లాలోని 21 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వొచ్చని చెప్పారు. ఇంకా కృషి చేస్తే దాదాపు 40 వేల ఎకరాలకు కూడా సాగునీరిచ్చే అవకాశాలున్నాయని తెలిపారు. డిస్ట్రిబ్యూటరీల కోసం భూసేకరణ ప్రక్రియను వెంటనే పూర్తిచేయాలని ఆదేశించారు. వచ్చే మూడునెలల్లో యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి.. స్ట్రక్చర్ల నిర్మాణాలు పూర్తిచేయాలన్నారు. గంధమల్ల చుట్టుపక్కల ఎన్ని గొలుసుకట్టు చెరువులు ఉన్నాయి? ఎంత ఆయకట్టుకు సాగునీటిని అందించవచ్చో ఇరిగేషన్ అధికారులు వివరాలు ఇవ్వాలని సూచించారు. మల్లన్నసాగర్ నుంచి గంధమల్ల వరకు 35 కిలోమీటర్ల పొడవునా కాల్వ తవ్వకం జరుగాల్సి ఉన్నదన్నారు. ఇందులో 20 కిలోమీటర్లు సిద్దిపేట జిల్లా పరిధిలో ఉండగా, మరో 15 కిలోమీటర్లు యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉన్నదని చెప్పారు. మల్లన్నసాగర్, గంధమల్ల మధ్య త్వరలో తాను పర్యటిస్తానని వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, కలెక్టర్ అనితా రామచంద్రన్, ఈఎన్సీ మురళీధర్‌రావు, కాళేశ్వరం చీఫ్ ఇంజినీర్ హరిరాం తదితరులు పాల్గొన్నారు.

మల్లావఝుల కలల సాకారం

సదాశివుడి ఆశలను, స్వప్నాలను తెలంగాణ ప్రభుత్వం నిజం చేస్తున్నది ■ సాహిత్య అవార్డు సభలో మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

మల్లావఝుల సదాశివుడి ఆశలను, ఆశయాలను, ఆకాంక్షలను, స్వప్నాలను తెలంగాణ ప్రభుత్వం నిజం చేస్తున్నదని రాష్ట్రమంత్రి తన్నీరు హరీశ్‌రావు చెప్పారు. తలాపున పారుతుంది గోదావరి – నీ చేనూచెలక ఎడారి.. అంటూ తెలంగాణ గోసను పాటకట్టిన కవి సదాశివుడు కోరుకున్నట్టుగా తెలంగాణ ప్రాంతమంతటినీ మాగాణిగా మార్చేందుకు రేయింబవళ్లు శ్రమిస్తున్నామని అన్నారు. సదాశివుడు బతికి ఉంటే తలాపున పారుతున్న గోదావరి – నీ చేనూచెలక మాగాణి.. అని పాడుకునేవారని ఆయన పేర్కొన్నారు. గురువారం రవీంద్రభారతి పైడి జయరాజ్ ప్రివ్యూ థియేటర్‌లో కవి మల్లావఝుల సదాశివుడి అవార్డు సభ జరిగింది. తెలంగాణ వికాస సమితి సారథ్యంలో ఈ సభ నిర్వహించారు. సమితి అధ్యక్షుడు, సీఎంఓ కార్యాలయం ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్ సభకు అధ్యక్షత వహించారు. మల్లావఝుల సదాశివుడి పేరిట ఏర్పరిచిన పురస్కారాన్ని ప్రముఖ కవి వఝుల శివకుమార్‌కు అందజేశారు. ఈ సభలో మంత్రి హరీశ్‌రావుతోపాటు తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి, తెలంగాణ గ్రంథాలయ పరిషత చైర్మన్ అయాచితం శ్రీధర్, శాసనసభ్యులు ఏనుగు రవీందర్ రెడ్డి, బాబూమోహన్, అంజయ్య యాదవ్, తెలుగు యూనివర్సిటీ వీసీ ఎస్వీ సత్యనారాయణ, అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ సీతారామారావు, భాష, సాంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సదాశివుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. పీ చంద్ రాసిన సదాశివుడి జీవితచరిత్ర గ్రంథం 'తలాపున పారుతున్న పాట' పుస్తకాన్ని ఆవిష్కరించారు.



గురువారం రవీంద్రభారతిలో కవి మల్లావఝుల సదాశివుడి అవార్డును వఝుల శివకుమార్‌కు అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యేలు బాబూమోహన్, రవీందర్‌రెడ్డి, అంజయ్యయాదవ్, సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి, తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ అయాచితం శ్రీధర్ తదితరులు

ప్రతి నీటి చుక్క పంట చేల కోసమే

ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దిశానిర్దేశంతో నీటిపారుదల పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. మహారాష్ట్ర సరిహద్దు ఆదిలాబాద్ నుంచి, కర్నాటక సరిహద్దు మహబూబ్‌నగర్ వరకు ప్రతి పొలానికి నీటిని ప్రవహింపజేసేందుకు ప్రయత్నిస్తున్నామని, ప్రాణహిత, ఇంద్రావతి, పెనుగంగలోని ప్రతి నీటిచుక్కను పంటచేల కోసం వినియోగిస్తున్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఒక్క మహబూబ్‌నగర్ జిల్లాలోనే కొత్తగా ఆరులక్షల ఎకరాల వరకు సాగులోకి తీసుకురాగలిగామని తెలిపారు. ఎల్బీనగర్‌లో అడ్డాకూలీగా పనిచేసి, మహబూబ్‌నగర్‌కు తిరిగివచ్చిన రైతుల కండ్లల్లో ఆనందాన్ని తాను స్పష్టంగా చూశానని మంత్రి చెప్పారు. కరంట్ ఫుల్.. నీళ్లు ఫుల్... చేపలు ఫుల్... అని బుద్దారం రైతు రాములు చెప్పినప్పుడు తాను నిజంగా ఆశ్చర్యానికి గురయ్యానని, తమ శ్రమ ఫలిస్తున్నందుకు చాలా ఆనందపడ్డానని తన స్వీయ అనుభవాన్ని వెల్లడించారు. సిధారెడ్డి మాట్లాడుతూ, సదాశివుడి జీవితం, కవిత్వం, పాట సమున్నతమైనవని చెప్పారు. సభాధ్యక్షత వహించిన దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ, సదాశివుడి సాహిత్యం గురించి ప్రత్యేక అధ్యయనం జరుగాల్సిన అవసరం ఉన్నదన్నారు. త్యాగాల వారసత్వాన్ని నెలకొల్పిన గొప్ప సాహిత్యయోధుడు సదాశివుడని అన్నారు. అయాచితం శ్రీధర్ మాట్లాడుతూ, సదాశివుడి పేరిట ఏర్పాటు చేసిన అవార్డును అంతే గొప్ప కవిగా, మంచి కవిత్వాన్ని, ప్రజలకు అవసరమైన కవిత్వాన్ని అందిస్తున్న వఝుల శివకుమార్‌కు ఇవ్వడం సముచితంగా ఉందని అన్నారు. అవార్డు గ్రహీత వఝుల శివకుమార్ మాట్లాడుతూ, తన స్నేహితుడు, మార్గదర్శి సదాశివుడి పేరిట ఏర్పాటు చేసిన అవార్డును అందుకోవడం తనను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నదని అన్నారు. సదాశివుడి కుమారుడు విజయానంద్, తదితరులు ఆయన పాటలను ఆలపించారు. గ్రంథ రచయిత చంద్ మాట్లాడుతూ కవిత్వం, ఆచరణ ఏవిధంగా ఉండాలో తన జీవితం ద్వారా చెప్పిన గొప్ప వ్యక్తి సదాశివుడని అన్నారు. ఎస్వీ సత్యనారాయణ మాట్లాడుతూ, రాబోయే తరాలకు, ఎప్పటికీ సదాశివుడు ఆదర్శంగా ఉంటారని అన్నారు.

హజ్రత్ నిజాముద్దీన్ దర్గాలో ప్రార్థనలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ (టీఎస్‌ఎంఎఫ్‌సీ) చైర్మన్ సయ్యద్ అక్బర్ హుస్సేన్ గురువారం ఢిల్లీలోని హజ్రత్ నిజాముద్దీన్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాష్ట్రం బంగారు తెలంగాణగా అభివృద్ధి చెందాలని, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు.

కేటాయింపులపై చంద్రబాబు అసంతృప్తి

- కేంద్రంతో అమీతుమీకి సిద్ధమంటున్న టీడీపీ ఎంపీలు

హైదరాబాద్/ అమరావతి, నమస్తే తెలంగాణ: ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌పై గంపెడాశలు పెట్టుకున్న ఆంధ్రప్రదేశ్‌కు నిరాశే ఎదురైంది. కేంద్ర బడ్జెట్‌పై ఏపీ సీఎం చంద్రబాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసినట్టు తెలుస్తున్నది. గురువారం మంత్రులతో ఆయన టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రులందరూ కేంద్ర ప్రభుత్వం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏపీ విభజన హామీలపై కేంద్ర ప్రభుత్వం తీరు సరిగా లేదని అభిప్రాయపడ్డారు. ఏపీకి అన్యాయం జరిగిందన్న విషయాన్ని కేంద్ర ప్రభుత్వానికి అర్థమయ్యేలా చెప్పాలని చంద్రబాబు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలోనే అందుబాటులో ఉన్న సీనియర్ మంత్రులతో చంద్రబాబు సమావేశమయ్యారు. కేంద్రంపై ఒత్తిడి ఎలా పెంచాలనే అంశంపై ఈ భేటీలో చర్చించినట్లు సమాచారం. కేంద్ర మంత్రి సుజనాచౌదరి సహా పలువురు ఎంపీలతో మాట్లాడినట్టు తెలిసింది. పదవులకు రాజీనామా చేద్దామని ఎంపీలు సీఎంకు తేల్చిచెప్పినట్లు పార్టీవర్గాల సమాచారం.

గూగుల్ కోడ్ ఇన్‌లో నారాయణ విద్యార్థి ప్రతిభ

హైదరాబాద్: గూగుల్ సంస్థ కోడ్ ఇన్–2017 (ఓపెన్‌సోర్స్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్)లో నారాయణ విద్యార్థి మెహంత్ ఉత్తమ ప్రతిభకనబరిచాడు. నవంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 72 దేశాల నుంచి వేలాది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో ప్రతిభావంతులైన 50 మంది విద్యార్థుల్లో మెహంత్ ఉండటంపై నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పీ శరణి హర్షం వ్యక్తంచేశారు. దేశవ్యాప్తంగా మొత్తం 16 మంది ఎంపిక కాగా తెలుగురాష్ట్రాల నుంచి మెహంత్‌కు చోటుదక్కడంపై ఆమె ఆనందం వ్యక్తంచేశారు.

చెరువుల్లో కాలనీలపై హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అభివృద్ధి పేరిట చెరువులు, నీటి కొలనుల పూడ్చివేతపై ఉమ్మడి హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. నగరశివార్లలోని హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జంట జలశయాలను కాపాడేందుకు గతంలో జారీ అయిన జీవో–111 అమలుపై దాఖలైన వ్యాజ్యాలపై విచారణ సందర్భంగా జస్టిస్ వీ రామసుబ్రమణ్యన్, జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించింది. జంట జలశయాల పరిధిలో10 కిలోమీటర్ల మేర ఎత్తైన భవనాలు, ఇతరత్రా కట్టడాలు నిర్మించకుండా ఉమ్మడి రాష్ట్రంలో జీవో–11 జారీఅయ్యింది. అయితే ఆ జీవోను ఉల్లంఘిస్తూ అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయని, జీవో ఉపసంహరణకు లేదా కమిటీల పేరిట జీవో పరిధిలోని 84 గ్రామాల్లో కొన్నింటిని మినహాయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పిటిషనర్లు తెలిపారు. జీవోను అమలుచేయడానికి వీల్లేదంటూ కొన్ని వ్యాజ్యాలు దాఖలయ్యాయి.ఇరుపక్షాల వాదనను విన్న ధర్మాసనం కేసును ఈ నెల 15కు వాయిదా వేసింది.

టీటీడీ హిందూయేతరుల రూల్‌పై వ్యాజ్యం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తిరుమల తిరుపతి దేవస్థానంతోపాటు, టీటీడీ ఆర్థికసహాయంచేసే దేవాలయాల్లో హిందూయేతరులను ఏ పోస్టుల్లోనూ నియమించడానికి వీల్లేదంటూ జారీచేసిన టీటీడీ రూల్స్‌ను సవాల్ చేస్తూ హైకోర్టులో వ్యాజ్యం దాఖలైంది. రూల్ 9(4)పై టీటీడీ పరిధిలో పనిచేస్తున్న 36 మంది క్రిస్టియన్, ముస్లిం ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు.

'ఆర్టీఐ' పట్ల సానుకూలంగా వ్యవహరించాలి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సమాచారహక్కు చట్టం (ఆర్టీఐ) కింద వచ్చే దరఖాస్తుల పట్ల ప్రజాసమాచార అధికారులు (పీఐవో)లు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని రాష్ట్ర ఆర్టీఐ ప్రధాన కమిషనర్ ఎస్ రాజాసదారాం పేర్కొన్నారు. వీలైనంత త్వరగా దరఖాస్తుదారుడికి సమాచారం అందించాలని సూచించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారులకు ఆర్టీఐ చట్టంపై మర్రిచెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థలో గురువారం ఏర్పాటు చేసిన శిక్షణకు రాజాసదారాం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఉద్యాన పంటలకు భారీ సబ్సిడీ

- ఉద్యాన, సేద్య రంగాలకు ప్రాధాన్యం
- గార్డెనింగ్‌పై ప్రజల్లో అవగాహన పెంచాలి
- జాతీయ ఉద్యాన, వ్యవసాయ ప్రదర్శన ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: రాష్ట్రంలో ఉద్యాన, వ్యవసాయరంగాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తున్నదని ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ తెలిపారు. గురువారం నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో అసోసియేషన్ ఆఫ్ ఈవెంట్ ఆర్గనైజర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఐదురోజుల జాతీయ ఉద్యాన, వ్యవసాయ ప్రదర్శనను డిప్యూటీ సీఎం ప్రారంభించారు. తెలంగాణలో వ్యవసాయరంగాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో భూ రికార్డుల ప్రక్షాళన అనంతరం 1.42 లక్షల ఎకరాల సాగుభూమి ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందని, ఈ భూముల యజమానులకు మార్చి 11న పట్టాదార్ పాస్‌పుస్తకాలను అందిస్తామని చెప్పారు. సాగురైతులకు పెట్టుబడి పథకం కింద ఎకరానికి రూ.4వేల చొప్పున అందించనున్నట్టు చెప్పారు. ఉద్యానరంగాన్ని ప్రోత్సహించేందుకు పెద్ద ఎత్తున సబ్సిడీలు అందజేస్తున్నామని మహమూద్ అలీ చెప్పారు. రాష్ట్రంలో ముస్లింలు వ్యవసాయానికి దూరమయ్యారని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలతో ముస్లింలు కూడా వ్యవసాయ అనుబంధ రంగాలైన ఉద్యాన, పశువుల పెంపకం చేపట్టడానికి ముందుకు వస్తున్నారని వివరించారు. గడచిన రెండేండ్లుగా ప్రభుత్వం హరితహారం కింద పెద్దఎత్తున మొక్కలు నాటిందని వివరించారు. మొక్కలు, గార్డెనింగ్‌పై ప్రజల్లో ఇప్పుడిప్పుడే అవగాహన పెరుగుతున్నదని పేర్కొన్నారు. తోటపంటలు, పూలసాగుపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరం ఉన్నదని డిప్యూటీసీఎం అభిప్రాయపడ్డారు. వివిధ రాష్ట్రాల నుంచి గార్డెనింగ్‌కు అవసరమైన పూలు, పండ్లు, కూరగాయల నర్సరీలను నగర ప్రజలకు ఈ మేళా ద్వారా అందుబాటులోకి తెచ్చిన అసోసియేషన్ ఆఫ్ ఈవెంట్ ఆర్గనైజర్స్ అధ్యక్షుడు ఖాలిద్ అహ్మద్‌ను డిప్యూటీ సీఎం అభినందించారు. మేళాలో 75 స్టాల్స్ ఏర్పాటు చేశారు. నగర ప్రజలు మేళాను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ సీఎం మహమూద్‌అలీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఖాలిద్, అనంత రెడ్డి, ప్రసాద్ రెడ్డి, వివిధ నర్సరీల యజమానులు పాల్గొన్నారు.



గురువారం నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో జాతీయ ఉద్యాన, వ్యవసాయ ప్రదర్శనను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం మహమూద్ అలీ

మనకేం దక్కింది?

మొదటిపేజీ తరువాయి...

యూనివర్సిటీకి కేవలం రూ.10 కోట్లు మాత్రమే కేటాయించారు. తూతూ మంత్రంగా పెద్దపల్లి–లింగంపేట మధ్య 83 కిలోమీటర్లు, నల్లగొండ–లింగంగుట్ట మధ్య 129 కిలోమీటర్ల రైల్వేలైన్లను విద్యుదీకరణ చేస్తామని తెలిపారు. వీటికి కూడా నిధుల కేటాయింపుపై స్పష్టత ఇవ్వలేదు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ డిమాండ్‌ను పట్టించుకోలేదు. బడ్జెట్‌లో దీని ప్రస్తావనే లేదు. రాష్ట్ర విభజన సందర్భంగా బయ్యారంలో ఉక్కు కర్మాగారం ఏర్పాటుచేస్తామని కేంద్ర ప్రభుత్వం చెప్పిన విషయం తెలిసిందే. దీనిపై ఇప్పటికీ ఎలాంటి స్పష్టతలేదు. సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్ అని ఆకర్షణీయమైన నినాదం అందుకున్న మోదీ ప్రభుత్వం.. దేశ వికాసానికి దోహదపడే రాష్ట్రాల అభ్యున్నతి గురించి ఏమాత్రం పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తున్నది.

ఏ ప్రాజెక్టులూ కనిపించడం లేదా..

ప్రపంచం మెచ్చుకున్న ఇంటింటికి తాగునీటిని ఇచ్చే పథకం మిషన్ భగీరథ. తెలంగాణ రూపొందించి సొంత నిధులతో ఎన్నికష్టాలు వచ్చినా అమలు చేస్తున్న ఈ పథకాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సైతం ఎంతగానో ప్రశంసించారు. ఇది ఇతర రాష్ట్రాలకు ఆదర్శమని కొనియాడారు. ఈ పథకాన్ని దేశమంతా విస్తరించాలని కేంద్రం నిర్ణయం తీసుకొని ఈ బడ్జెట్‌లో పెట్టింది కానీ తెలంగాణకు నిధుల అంశాన్ని మాత్రం పట్టించుకోలేదు. దేశ ప్రజల మన్ననలు పొందిన మిషన్ కాకతీయకూ కేటాయింపుల్లేవు. ప్రపంచ ఇంజినీరింగ్ అద్భుతం కాళేశ్వరం ప్రాజెక్టు. కోటి ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదు. ఆర్థిక సహాయం అడిగినా స్పందన లేదు. బయ్యారం ఉక్కు కర్మాగారం ప్రస్తావన కూడా బడ్జెట్‌లో తీసుకురాలేదు. తెలంగాణకు ఎయిమ్స్.. అందనంత దూరం అయిపోతున్నది. హైదరాబాద్‌కు మణిహారంలాంటి మెట్రోరైల్ ప్రాజెక్టుకు నయాపైసా కేటాయించలేదు. కానీ.. కర్ణాటకలో రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బెంగళూరు మెట్రోకు మాత్రం ఏకంగా రూ.17వేల కోట్లను ప్రతిపాదించారు. హైదరాబాద్ ఎంఎంటీఎస్ రెండో దశకు కూడా పైసలు ఇవ్వలేదు. ఇలా తెలంగాణ రాష్ట్రానికి నిధుల కేటాయింపులో తీవ్ర అన్యాయం చేసింది. రాష్ట్రం నుంచి కేంద్రానికి పన్నుల వసూళ్ల రూపంలో ఏటా రూ.30వేల కోట్లకు పైగా చేరుతున్నాయి. రాష్ట్రం నుంచి భారీ ఎత్తున పన్నులు వసూళ్లు చేస్తున్న కేంద్రం.. రాష్ట్రంలోని కీలకమైన ప్రాజెక్టులకు నిధులు కేటాయించకుండా తీరని అన్యాయం చేస్తున్నదన్న విమర్శలు వస్తున్నాయి. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కర్ణాటకకు నిధులు కేటాయించడం చూస్తుంటే.. సబ్‌కా వికాస్ అందరి కోసం కాదు.. కొందరి కోసమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

శాఖల పేరుతో బురిడీ

బడ్జెట్ కేటాయింపులు శాఖలవారీగా ఉన్నాయని, దాంట్లోనే అవసరాలకు అనుగుణంగా రాష్ట్రాలకు కేటాయింపులు ఉంటాయని చెప్తున్నారు. కానీ శాఖలవారీ కేటాయింపుల పేరుతో జరిగేది అంతా దగానే అని తెలంగాణవాదులు అంటున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీలు తమ రాజకీయ లబ్ధి కోసం ఆయా కేటాయింపులు చేసే ధోరణి కొనసాగుతున్నదని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. శాఖలవారీగానే నిధులు అంటున్నప్పుడు బెంగళూరు మెట్రో రైల్ ప్రాజెక్టుకు రూ.17వేల కోట్లు ఎలా కేటాయించారు.. ప్రధానమంత్రి స్వస్థలం గుజరాత్‌లోని వడోదరలో రైల్వే యూనివర్సిటీ లాంటివి ఎలా ప్రకటించారని ప్రశ్నిస్తున్నారు. ప్రజలకు కనీస అవసరమైన తాగునీళ్లకు ఉద్దేశించిన పథకానికి నిధులు ఇవ్వకపోతే ఇంకా దేనికి ఇస్తారని అడుగుతున్నారు. తెలంగాణ బీడుభూములను సస్యశ్యామలం చేసే కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్రం పట్టీపట్టనట్లుగా వ్యవహరించడాన్ని తెలంగాణవాదులు తప్పుపడుతున్నారు. తెలంగాణ రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది ఈ బడ్జెట్‌లో కేటాయింపులను సవరించాలని కేంద్రాన్ని కోరుతున్నారు.

హోంగార్డుల భత్యం జనవరి 1 నుంచే అమలు

- ఉత్తర్వులు జారీచేసిన హోంశాఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హోంగార్డులకు పెంచిన రోజువారీ భత్యాలు 1–1–2018 నుంచే అమలులోకి వస్తాయని హోంశాఖ ముఖ్య కార్యదర్శి రాజీవ్ త్రివేది తాజాగా గురువారం ఉత్తర్వులు జారీచేశారు. హోంగార్డులకు రోజువారి భత్యం రూ.400 నుంచి రూ.675కు పెంచడంతోపాటు పోలీసు కానిస్టేబుళ్లతో సమానంగా పలు సదుపాయాలు కల్పిస్తూ హోంశాఖ బుధవారం ఉత్తర్వు జారీ చేసిన విషయం తెలిసిందే. పెంచిన భత్యాన్ని జనవరి ఒకటో తేదీ నుంచే పరిగణనలోకి తీసుకోవాలని డీజీపీకి సూచనలు చేస్తూ తాజా ఉత్తర్వుల్లో పేర్కొన్నది.

జీఎస్టీ ఆదాయం రూ.9063.90 కోట్లు

- వాణిజ్య పన్నులశాఖ ముఖ్య కార్యదర్శి సోమేశ్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో వస్తువులు, సేవల పన్ను (జీఎస్టీ) రాబడి ఆశించినంత మెరుగ్గా పెరుగుతున్నదని వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖ ముఖ్యకార్యదర్శి సోమేశ్‌కుమార్ చెప్పారు. గురువారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో జనవరి నెలను ఉత్తమంగా నిర్ణయించామన్నారు. డిసెంబరులో రూ.1,490.50 కోట్లు రాగా, జనవరిలో రూ.1,656.14కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. కాగా, రాష్ట్రంలో ఆగస్టు నుంచి జనవరి వరకు ఎస్‌జీఎస్టీ రూ.4825.22 కోట్లు, ఐజీఎస్టీ రూ.4238.68 కోట్లు కలిపి మొత్తం జీఎస్టీ రూ.9063.90 కోట్లు వసూలైనట్టు సోమేశ్‌కుమార్ వెల్లడించారు. ఫిబ్రవరి 1 నుంచి ఈ వేబిల్లు విధానం అమల్లోకి తెచ్చామన్నారు.

తెలుగు వర్సిటీ 2016 పురస్కారాలు

తెలుగుయూనివర్సిటీ: తెలుగు భాషా సాహిత్యం, సంస్కృతి, కళాప్రక్రియల్లో విశిష్ట సేవలందించిన 12 మంది ప్రముఖులకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారాలను గురువారం ప్రకటించింది. కే శ్రీనివాస రెడ్డి మన తెలంగాణ (పత్రికారంగం), వసంతరావు దేశ్‌పాండే (నవల), వేణు సంకోజు (కవిత్వం), నియోగి (విమర్శ), మాసురామ్ రవికాంత్ (చిత్రలేఖనం), శివరామాచారి (శిల్పం), వనజాఉదయ్ (కూచిపూడి నృత్యం), కేఎస్ ఆర్ బాలకృష్ణశాస్త్రి (సంగీతం), అయ్యదేవర పురుషోత్తమరావు (నాటక రంగం), అంగళకుర్తి రామమూర్తి (జానపద కళారంగం), జీఎం రామశర్మ (అవధానం), అయినంపూడి శ్రీలక్ష్మి (ఉత్తమ రచయిత్రి)లను తెలుగువర్సిటీ వీసీ ఆచార్య ఎస్వీ సత్యనారాయణ అధ్యక్షతన గల ఎంపిక సంఘం ప్రతిభా పురస్కారాలకు ఎంపికచేసింది. త్వరలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో పురస్కార గ్రహీతలను రూ.20,116, పురస్కారపత్రం, శాలువాతో ఘనంగా సత్కరించినున్నట్టు రిజిస్ట్రార్ అలేఖ్య పుంజాల తెలిపారు.

5న నేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే

- పదోతరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యంపై అంచనా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశవ్యాప్తంగా పదోతరగతి విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను అంచనా వేయడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. దీనికి సంబంధించి ఈ నెల 5న జాతీయస్థాయిలో నేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే (ఎన్‌ఏఎస్) పరీక్ష నిర్వహించనున్నారు. ఈ సర్వే పరీక్షను కేవలం పదోతరగతి విద్యార్థులకు మాత్రమే నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో ఒక్కో జిల్లాకు సుమారు 80 పాఠశాలల చొప్పున ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లను కలిపి ఎంపిక చేశారు. ఆంగ్లం, గణితం, సామాన్యశాస్త్రం, సాంఘికశాస్త్రాలతోపాటు ఆధునిక భారతీయ భాషల్లో సర్వే పరీక్ష నిర్వహించనున్నారు. ప్రతి పాఠశాల నుంచి గరిష్ఠంగా 45 మంది విద్యార్థులను.. ప్రతి సబ్జెక్టుకు తొమ్మిదిమంది విద్యార్థులను ఎంపికచేశారు. పరీక్షతోపాటు పాఠశాల వివరాలు, ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాలు, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులు, వారి సామాజిక స్థితిగతుల ఆధారంగా అభ్యసన ఫలితాలను అంచనా వేస్తారని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్ తెలిపారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

- దివ్యాంగులశాఖ కమిషనర్ బీ శైలజ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని దివ్యాంగులశాఖ కమిషనర్ బీ శైలజ పేర్కొన్నారు. గురువారం రవీంద్రభారతిలో జాతీయ దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర్‌రావు అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. 40 మందితో తెలంగాణ నూతనకమిటీని ఎన్నుకొన్నారు. అధ్యక్షురాలిగా జుబేదా బేగం, సహాధ్యక్షులుగా ఏడు కొండలు, రజని, పీ శ్రీనివాస్, గోకులు, స్వామిలను ఎన్నుకున్నారు.

గంగదేవిపల్లిని ఆదర్శంగా తీసుకోవాలి

- సర్పంచులకు మరిన్ని నిధులు, బాధ్యతలు
- పెట్టుబడులకు విదేశీ పరిశ్రమలను ఆహ్వానించాం
- ఏడాదిలోగా లక్షా ఇరువై వేల ఉద్యోగాల భర్తీ
- మున్సిపల్ పట్టణాభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్


ముస్తాబాద్ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్, పక్కన టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తేతెలంగాణ: 'ప్రభుత్వం ఎన్ని నిధులు ఇచ్చినా ప్రజల భాగస్వామ్యం లేనిదే అభివృద్ధి జరగదు. సమష్టి కృషితోనే గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం వస్తుంది. గంగదేవిపల్లిని ఆదర్శంగా తీసుకొని ముందుకుపోయినప్పుడే మనం ఆశించిన బంగారు తెలంగాణను సాధించుకుంటాం' అని మున్సిపల్ పట్టణాభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. త్వరలో కొత్త పంచాయతీ రాజ్ చట్టం రాబోతున్నదని, దీంతో సర్పంచులకు నిధులు, విధులు, బాధ్యతలు మరింత పెరుగుతాయని తెలిపారు. సిరిసిల్ల మున్సిపాలిటీలో 11 గ్రామాలను విలీనం చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం కింద భారీగా నిధులు వచ్చే అవకాశం ఉన్నదని సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలో గురువారం మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముస్తాబాద్‌లో నిర్మించిన మోడల్ గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన అనంతరం సభలో ప్రసంగించారు. తెచ్చుకున్న తెలంగాణలో మూడున్నరేండ్ల పరిపాలనలో నీళ్ల విషయంలో అద్భుతమైన ప్రగతి సాధించామన్నారు.

ఉపాధి, ఉద్యోగాల కల్పనకు శ్రమిస్తున్న ప్రభుత్వం

పెట్టుబడులను ఆహ్వానించేందుకు వివిధ దేశాలు పర్యటిస్తున్నానని మంత్రి కేటీఆర్ తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం తీవ్రంగా శ్రమిస్తున్నదని, వచ్చే ఏడాదిలోగా లక్షా ఇరువై వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. ప్రైవేటు పరిశ్రమలను తెప్పించే ప్రయత్నాలు గట్టిగా చేస్తున్నామని, ఇందు లో భాగంగా రెండు వారాలపాటు సింగాపూర్, సౌత్‌కొరియా, జపాన్, స్విట్జర్లాండ్, అబుదాబిలో పర్యటించినట్టు తెలిపారు. వివిధ కంపెనీల ప్రతినిధులతో చర్చలు జరిపి, మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించినట్టు చెప్పారు. ఉద్యోగ అవకాశాలలో సింహభాగం తెలంగాణకే వచ్చేలా కృషి చేస్తున్నామన్నారు. తెలంగాణ అకాడమీ ఆధ్వర్యంలో యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్టు తెలిపారు. రూ.2 కోట్లతో సిరిసిల్లలో అంబేద్కర్ స్టడీ సర్కిల్ మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు.

ఆత్మహత్యలొద్దు... అన్నగా నేనున్నా...

తల్లి, తండ్రి మందలించారనో, పరీక్షల్లో ఫెయిలయ్యాననో, ప్రేమ విఫలమైందన్న కారణాలతో యువత ఆత్మహత్యలు చేసుకోవడం అత్యంత బాధాకరమని మంత్రి కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచంతో పోటీపడుతూ ముందుకెళితే భవిష్యత్ బంగారమవుతుందని హితవు పలికారు. పోటీ ప్రపంచంలో ప్రతికూల పవనాలు, అవరోధాలు అనేకం వస్తాయని, వాటిని ఎదుర్కొంటూ అభివృద్ధి వైపు అడుగులు వేయాలని సూచించారు. ముస్తాబాద్‌లోని మాతృశ్రీ గార్డెన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి కేటీఆర్ యువతనుద్దేశించి ప్రసంగించారు. సమస్యలను ధైర్యంతో ఎదుర్కొన్నప్పుడే లక్ష్యానికి చేరువవుతామని, అధైర్యపడొద్దని, అన్నగా అండగా ఉంటానని యువతకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సెస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, వైస్ చైర్మన్ లగిశెట్టి శ్రీనివాస్, డైరెక్టర్ విజయరామారావు, సర్పంచ్ నల్ల నర్సయ్య, జెడ్పీటీసీ జనగామ శరత్‌రావు పాల్గొన్నారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యం

భారీ నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటలో రూ.5 కోట్లతో నిర్మించిన స్విమ్మింగ్‌పూల్ ప్రారంభం


సిద్దిపేటలో అడ్వెంచర్ స్పోర్ట్స్ పార్కును ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట కలెక్టరేట్, నమస్తే తెలంగాణ: 'ఆరోగ్య తెలంగాణ కోసం ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నది. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా సిద్దిపేటలో క్రీడా సౌకర్యాలను కల్పించాం. రూ.5 కోట్లతో స్విమ్మింగ్‌పూల్ నిర్మించాం. పొన్నాల, మర్పడగ శివారులో 150 ఎకరాల్లో ఫారెస్ట్ రిక్రియేషన్ జోన్‌ను ఏర్పాటు చేస్తున్నాం' అని భారీ నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. సిద్దిపేటలో రూ.38.5 లక్షలతో బీజేఆర్ చౌరస్తాలో నిర్మించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జిని, రూ.70లక్షలతో నిర్మించిన అడ్వెంచర్ స్పోర్ట్స్ పార్కు, మినీ స్టేడియంలో రూ.5 కోట్లతో నిర్మించిన స్విమ్మింగ్‌పూల్‌ను గురువారం మంత్రి ప్రారంభించి మాట్లాడారు. సిద్దిపేటలో క్రీడలను ప్రోత్సహిస్తున్నామని, హైదరాబాద్ తర్వాత తొలిసారిగా టీటీఎల్ రెండో దశ పోటీలు సిద్దిపేటలోనే నిర్వహిస్తున్నామని చెప్పారు. డే అండ్ నైట్ మ్యాచ్‌ల నిర్వహణకు రూ.60 లక్షలతో మినీ స్టేడియంలో ఫ్లడ్‌లైట్ల ఏర్పాటు, రూ.80 లక్షలతో ఇండోర్ స్టేడియంలో మరో నాలుగు షటిల్ కోర్టులను నిర్మిస్తామన్నారు. కోమటి చెరువు వద్ద త్వరలో మల్టీప్లెక్స్ థియేటర్ నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో జేసీ పద్మాకర్, ఇరిగేషన్ ఈఈ రవీందర్‌రెడ్డి, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ ఈడీలు చరణ్‌దాస్, రాంరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, ఆర్డీవో ముత్యంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అక్తర్‌పటేల్ పాల్గొన్నారు.

టీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు


టీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎంపీ కవిత. చిత్రంలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: అధికార టీఆర్‌ఎస్‌లోకి ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తలు, భారీగా వలస వస్తున్నారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు, యువకులు భారీ సంఖ్యలో టీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి మంత్రి కేటీఆర్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. నిజామాబాద్ జిల్లా నందిపేట్‌కు చెందిన 400మంది ఇతర పార్టీల నేతలు ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌లో వీరికి ఎంపీ కవిత కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఆకుల నరేందర్‌తో పాటు 350మంది కార్యకర్తలు, కమ్మర్‌పల్లికి చెందిన యాదవ పెద్ద సంఘం సభ్యులు 52 మంది బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో, నల్లగొండ జిల్లా చిట్యాలలో టీడీపీ, కాంగ్రెస్, సీపీఎం, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడులో 150 మంది కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంపీ మంద జగన్నాథం సమక్షంలో పార్టీలో చేరారు. జనగామ జిల్లా తరిగొప్పుల మండలంలో పలు పార్టీలకు చెందిన సుమారు 100 మంది ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.

నాగం.. తప్పు ఒప్పుకొన్నట్టేనా?

అభివృద్ధిపై చర్చకు మరోసారి సిద్ధం: ఎమ్మెల్యే మర్రి


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే బాలరాజు

నాగర్‌కర్నూల్, నమస్తే తెలంగాణ ప్రతినిధి: 'నాపై అవినీతి ఆరోపణలు చేశావ్. నిరూపించమంటే అనుచరులతో మాట్లాడించి తప్పించుకుపోయావ్. తప్పుడు ఆరోపణలు చేస్తే ప్రజలు క్షమించరు' అంటూ నాగం జనార్దన్‌రెడ్డిపై నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ధ్వజమెత్తారు. తనపై నాగం చేసిన ఆరోపణలు నిరూపించాలని నాలుగు రోజుల కిందట చేసిన సవాల్ మేరకు మర్రి జనార్దన్‌రెడ్డి గురువారం అచ్చంపేట మండలం ఉమామహేశ్వర క్షేత్రానికి చేరుకున్నారు. మధ్యాహ్నం వరకు వేచిచూసినా నాగం రాకపోవడంతో ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ.. తాను ప్రజలకు సేవచేయాలనే రాజకీయాల్లోకి వచ్చానని, ఇప్పటివరకు రూ.12కోట్లు వెచ్చించి 300కు పైగా పేద జంటలకు వివాహాలు జరిపించానన్నారు. నాగం మూడు దశాబ్దాల్లో చేసిన ప్రత్యేక అభివృద్ధి ఏంటని ప్రశ్నించారు. తన సవాల్‌ను స్వీకరించకుంటే తనపై చేసిన ఆరోపణలు తప్పు అని నాగం ఒప్పుకున్నట్టేనని, ఓటమిని అంగీకరించినట్టే భావించాల్సి వస్తుందన్నారు. అభివృద్ధిపై మాట్లాడేందుకు మరో అవకాశం ఇస్తానని ఏరోజు, ఏ ఊరికి రమ్మన్నా వస్తానని మరో సవాల్ విసిరారు. మర్రి జనార్దన్‌రెడ్డిని విమర్శించే స్థాయి నాగంకు లేదని అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మండిపడ్డారు.

విద్యార్థినులపైకి దూసుకెళ్లిన కారు

స్కూల్ ప్రిన్సిపాల్ నిర్వాకం

ఒకరి మృతి, ఇద్దరి పరిస్థితి విషమం

జడ్చర్ల, నమస్తే తెలంగాణ: మహబూబ్‌నగర్ జిల్లా బాదేపల్లి పట్టణంలో ఓ ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా కారు నడిపి అదే పాఠశాలకు చెందిన ముగ్గురు వి ద్యార్థులను ఢీకొట్టాడు. ఇందు లో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. డీఎస్పీ భాస్కర్ కథనం ప్రకారం.. పట్టణంలోని అక్షరశ్రీ స్కూల్‌లో పదోతరగతి చదువుతున్న రమ్యశ్రీ(15), గాయత్రి(15), మనీషా(14) గురువారం ఉదయం పాఠశాల ఆవరణలో నిల్చున్నారు. అదేసమయంలో ప్రిన్సిపాల్ మురళి కారును తీసేందుకు ప్రయత్నించగా అదుపుతప్పి విద్యార్థినులపైకి దూసుకెళ్లింది. వారు తీవ్రంగా గాయపడటంతో జిల్లా కేంద్రంలోని ఎస్‌వీఎస్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ రమ్యశ్రీ మృతి చెందగా గాయత్రి, మనీషా పరిస్థితి విషమంగా ఉన్నదని వైద్యులు తెలిపారు. ప్రిన్సిపాల్ మురళీపై కేసు నమోదు చేసినట్టు డీఎస్పీ తెలిపారు. విషయం తెలుసుకున్న వైద్యారోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి దవాఖానకు చేరుకొని బాధితులను పరామర్శించారు. గాయపడిన విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

అనుమానంతోనే రమేశ్ హత్య

నల్లగొండలో సంచలన హత్య

కేసును ఛేదించిన పోలీసులు

నీలగిరి: నల్లగొండ జిల్లాకేంద్రంలో ఇటీవల సంచలనం సృష్టించిన పాలకూరి రమేశ్ హత్య కేసును ఛేదించామని డీఎస్పీ సుధాకర్ గురువారం తెలిపారు. తల, మొండెం వేరు చేసిన కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు. డీఎస్పీ విలేకరులకు వెల్లడించిన వివరాల ప్రకారం.. జిల్లాలోని కనగల్‌కు చెందిన పాలకూరి రమేశ్, నల్లగొండ పట్టణంలోని అబ్బాసియా కాలనీకి చెందిన మహ్మద్ మోసిన్ ఖాన్ మూడేండ్లుగా స్నేహితులు. మోసిన్ తన అక్క విషయంలో రమేశ్‌పై అనుమానం పెంచుకొని హత్య చేయాలని ప్రణాళిక రచించాడు. తన అన్న అక్బర్‌కు కామెర్ల మందు తెచ్చి ఇవ్వాలనే నెపంతో రమేశ్‌ను నల్లగొండకు రప్పించాడు. మోసిన్ ఖాన్ బీటీఎస్‌కు చెందిన తన స్నేహితుడు మహ్మద్ దుర్వేశ్ మొహినొద్దీన్‌తో కలిసి రమేశ్‌కు మద్యం తాగించి భారత్ గ్యాస్ సమీపంలో కత్తితో పొడిచి చంపేశారు. అ తర్వాత తల వేరుచేసి బొట్టుగూడ చౌరస్తాలోని గ్యార్మీ జెండాపై ఉంచారు. తద్వారా ఇతర వర్గం వారు హత్య చేసినట్టు పోలీసులు భావిస్తారని, ఒకవేళ దొరికినా తమను చూసి ప్రజలు భయభ్రాంతులకు గురవుతారని, తర్వాత డాన్‌గా ఎదుగవచ్చనే ఆలోచనతో ఇలా చేశారని డీఎస్పీ తెలిపారు. నిందితులు మహ్మద్ మోసిన్ ఖాన్, మొహినొద్దీన్‌లు వాడిన కత్తి, బైక్, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

నమస్తే తెలంగాణ
ఆట
[హైదరాబాద్]
శుక్రవారం 2 ఫిబ్రవరి 2018



సూర్యాపేట జిల్లాకు చెందిన పారా అథ్లెట్ నరేశ్ యాదవ్‌కు రూ.లక్ష ఆర్థికసాయం అందించిన సినీ నటుడు సాయిధరమ్‌తేజ్.. ఈ నెల 24 నుంచి 26వరకు భారత్,థాయిలాండ్,శ్రీలంక దేశాల మధ్య సిట్టింగ్ వాలీబాల్ టోర్నీలో నరేశ్ యాదవ్ పాల్గొంటున్నాడు. పలు జాతీయటోర్నీలలో పాల్గొని పతకాలు సాధిస్తున్న దివ్యాంగ క్రీడాకారుడు నరేశ్..అంతర్జాతీయటోర్నీలో పాల్గొనే సమయంలో ఆపన్నహస్తం అందించిన సాయిధరమ్‌తేజ్‌కు కృతజ్ఞతలు తెలిపాడు. ఈ సందర్భంగా పతకం సాధించి దేశానికి పేరు తేవాలంటూ సాయి కోరారు.

'ఖేలో ఇండియా'కు రూ.1262.7కోట్లు

- రూ.258 కోట్లు పెరుగుదలతో 2018-19 ఏడాదికి రూ.2196 కోట్లతో క్రీడల బడ్జెట్
- సాయ్‌కు రూ.66 కోట్ల కోత..
- జాతీయ క్రీడల సంఘాలకు రూ.342 కోట్లు

న్యూఢిల్లీ: ఈ ఏడాదికి క్రీడలకు బడ్జెట్‌లో రూ.258 కోట్లు పెంచుతున్నట్లు కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. గతేడాది రూ.1938.16 కోట్లుగా ఉన్న క్రీడల బడ్జెట్‌ను 2018-19 ఏడాదికి రూ.2196 కోట్లకు పెంచుతూ దేశంలో క్రీడలకు ఆదరణ పెంచడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు గురువారం లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా చెప్పారు. ఈ ఏడాది బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వ మానసపుత్రిక 'ఖేలో ఇండియా' కార్యక్రమానికి రూ.1262.7కోట్ల భారీ కేటాయింపులు చేయడం విశేషం. 2016లో ప్రకటించిన ఈ కార్యక్రమానికి గతేడాది కేటాయింపులు రూ.352 కోట్లు కాగా.. ఈ ఏడాది చివరకు రూ.520.09 కోట్లు విడుదల చేయడం గమనార్హం. దేశంలో పాఠశాల స్థాయినుంచే క్రీడలలో ప్రతిభను గుర్తించేందుకు, క్రీడల దిశగా యువతను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమానికి భారీగా నిధులు కేటాయించినట్లు జైట్లీ తెలిపారు. భారీ కేటాయింపులతో ఈ ఏడాదికి గాను కేంద్ర బడ్జెట్‌లో రూ.2196 కోట్ల కేటాయింపులు ప్రకటించారు. 2017-18లో జాతీయ క్రీడల సంఘాలకు కేటాయింపులు రూ.302.9 కోట్లు ఉండగా ఈ ఏడాదిలో కామన్‌వెల్త్ గేమ్స్, ఆసియా క్రీడలు ఉండడంతో రూ.41.2 కోట్లకు పెంపును ప్రకటిస్తూ మొత్తం రూ.342 కోట్లను కేటాయించారు. ఈ నిధుల నుంచి జాతీయ డోపింగ్ నిరోధకసంస్థకు గతంలో రూ.1కోటి విడుదల చేయగా ఈ ఏడాదికి గాను రూ.2కోట్లకు పెంచారు.క్రీడాకారులకు ప్రకటించే ప్రోత్సాహకాలనూ రూ.5 కోట్ల మేర పెంచుతూ రూ.23 కోట్లను కేటాయించడం శుభపరిణామం.

సాయ్‌కు కోత: కాగా, భారత క్రీడా ప్రాధికార సంస్థ(సాయ్)కు రూ. 66.17కోట్లు కోత పెడుతూ ఆర్థికమంత్రి షాకిచ్చారు. 2017-19 ఏడాదికి రూ.495.73 కోట్లుగా ఉన్న సాయ్ కేటాయింపులు 2018-19 ఏడాదికి 429.56 కోట్లకు తగ్గించారు. జమ్ముకశ్మీర్ రాష్ట్రంలో క్రీడల మౌలిక సదుపాయాల కల్పనకోసం చేస్తున్న కేటాయింపులను రూ. 25 కోట్లను తగ్గిస్తూ రూ.50 కోట్లకు పరిమితం చేశారు.

చెస్ చాంప్ రాహుల్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: 2వ నీతం ఓపెన్ ఫిడె రేటెడ్ చెస్ టోర్నీ-2018లో విజేతగా నిలిచిన రాహుల్ శ్రీవాత్సవకు ట్రోఫీని బహూకరిస్తున్న నీతం డైరెక్టర్ డాక్టర్ ఎస్ చిన్నంరెడ్డి, ఆర్ఆర్‌డీసీఏ అధ్యక్షుడు మేజర్ శివప్రసాద్, టోర్నీ నిర్వాహక కార్యదర్శి షక్ ఫయాజ్. హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలిలోని హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఈ టోర్నీ గతనెల 28న ప్రారంభమై గురువారం ముగిసింది.

క్విటోవా ముందంజ



పీటర్స్‌బర్గ్: సెయింట్ పీటర్స్‌బర్గ్ ట్రోఫీలో పెట్రా క్విటోవా ముందంజ వేసింది. గురువారం జరిగిన మహిళల మొదటి రౌండ్‌లో క్విటోవా 6-2, 6-0 తేడాతో ఎలీనా వెస్నినాపై అలవోక విజయం సాధించింది. వైల్డ్‌కార్డ్ ఎంట్రీ ద్వారా టోర్నీలోకి ప్రవేశించిన క్విటోవా తన తదుపరి రౌండ్‌లో ఇరినా కామెలియాతో తలపడే అవకాశముంది. మరోవైపు కరోలిన్ గార్సియా 4-6, 7-6(6), 7-6(5)తేడాతో రష్యా క్వాలిఫయర్ ఎలీనా రైబ్‌కీనా చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది.

అవినీతి జరిగింది: ఐసీసీ

దుబాయ్: అజ్మన్ ఆల్ స్టార్స్ టోర్నీలో భారీ అవినీతి జరిగిందని ఐసీసీ దర్యాప్తు బృందం వెల్లడించింది. ఇందుకు సంబంధించి బలమైన ఆధారాలు ఉన్నాయని చెప్పింది. అయితే ఈ టోర్నీకి ఎలాంటి అనుమతి లేకపోవడంతో నిర్వాహకులపై ఎమిరైట్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) చర్యలు తీసుకునే అవకాశం లేదని వెల్లడించింది. ఈ టోర్నీపై సుదీర్ఘంగా విచారణ చేపట్టిన ఐసీసీ అవినీతి నిరోధక బృందం ఈ మేరకు ఓ నివేదికను అంతర్జాతీయ బాడీకి అందజేసింది. 'ఈసీబీ నుంచిగానీ ఐసీసీ నుంచి గానీ ఈ టోర్నీకి ఎలాంటి అనుమతి లేదు. నిబంధనలను ఉల్లంఘించారు. అవినీతికి సంబంధించిన ఆధారాలున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్‌కు ఉన్న పేరును చెడగొట్టారు' అని ఐసీసీ జనరల్ మేనేజర్ అలెక్స్ మార్షల్ పేర్కొన్నాడు.

భారత్‌కు అదిరిపోయే బోణీ దక్కింది. డర్బన్‌లో గత చరిత్రను తిరగరాస్తూ కోహ్లీసేన కొత్త అధ్యాయాన్ని లిఖించింది. చాహల్, కుల్దీప్ మణికట్టు స్పిన్ తంత్రంతో సఫారీలను కట్టడి చేయగా, సహచరులు విఫలమైన చోట డుప్లెసిస్ శతకంతో దక్షిణాఫ్రికాకు పోరాడే స్కోరు అందుకుంది. లక్ష్యఛేదనలో కోహ్లీ, రహానే వీరవిహారంతో ఆరు వన్డేల సిరీస్‌లో భారత్‌కు శుభారంభం దక్కింది.

- కోహ్లీ, రహానే వీరవిహారం
- దక్షిణాఫ్రికాపై భారత్ ఘనవిజయం
- సిరీస్‌లో 1-0తో ముందంజ

బోణీ అదుర్స్



కోహ్లీ (112)

1 డర్బన్‌లో భారత్‌కు ఇదే తొలి విజయం

20 ఛేజింగ్‌లో కోహ్లీ సాధించిన శతకాలు. ఇందులో 2 సార్లు మాత్రమే భారత్ ఓడింది

5 వన్డేలో రహానే వరుసగా సాధించిన అర్ధసెంచరీలు. కోహ్లీ,సచిన్ రెండు సార్లు ఈ ఫీట్ సాధించారు

డర్బన్: వన్డేల్లో టాప్ జట్టుగా కొనసాగుతున్న భారత్, దక్షిణాఫ్రికా మధ్య రసవత్తర పోరు అభిమానులను కట్టిపడేసింది. గురువారం జరిగిన తొలి వన్డేలో భారత్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆరు వన్డేల సిరీస్‌లో 1-0తో ముందంజ వేసింది. దక్షిణాఫ్రికా నిర్దేశించిన 270 పరుగుల లక్ష్యాన్ని టీమ్‌ఇండియా 45.3 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి విజయాన్నందుకుంది. కోహ్లీ(107 బంతుల్లో 112, 10 ఫోర్లు) సూపర్ సెంచరీకి తోడు రహానే(86 బంతుల్లో 79, 5 ఫోర్లు, 2సిక్స్‌లు) సమయోచిత అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. ఫెల్కువాయో(2/42)కు రెండు వికెట్లు దక్కాయి. తొలుత డుప్లెసిస్(112 బంతుల్లో 120, 11 ఫోర్లు, 2సిక్స్‌లు) సెంచరీతో దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 269/8 స్కోరు చేసింది. కుల్దీప్(3/34), చాహల్(2/45) రాణించారు. సెంచరీతో కదంతొక్కిన కోహ్లీకి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

కోహ్లీ, రహానే జోరు: దక్షిణాఫ్రికా నిర్దేశించిన 270 పరుగుల లక్ష్య ఛేదనలో భారత్‌కు మెరుగైన ఆరంభమే దక్కింది. మోర్నీ మోర్కెల్ వేసిన ఇన్నింగ్స్ 7వ ఓవర్లో ఆఫ్‌స్టంప్ మీదుగా వెళ్తున్న బంతిని అనవసరంగా ఆడి వికెట్‌కీపర్ డికాక్‌కు రోహిత్ చిక్కాడు. దీంతో 33 పరుగులకు భారత్ తొలి వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత క్రీజులోకొచ్చిన కెప్టెన్ కోహ్లీ..ధవన్‌కు జతకలిశాడు. ఇన్నింగ్స్ జోరు అందుకుంటున్న తరుణంలో ధవన్ రనౌటయ్యాడు. కీలకమైన నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన రహానే..కోహ్లీకి అండగా నిలిచాడు. ముఖ్యంగా కోహ్లీ..తనదైన షాట్లతో అభిమానులను అలరించాడు. తనదైన శైలిలో బౌండరీలతో హోరెత్తించిన కోహ్లీ..తన కెరీర్‌లో 33వ సెంచరీని ఖాతాలో వేసుకున్నాడు. రహానే కూడా జోరు పెంచడంతో లక్ష్యం అంతకంతకు కరిగిపోయింది. విజయానికి చేరువవుతున్న క్రమంలో ఫెల్కువాయో(1/40) బౌలింగ్‌లో రహానే ఔట్ కావడంతో మూడో వికెట్‌కు 189 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. కోహ్లీ(112) ఫెల్కువాయోకు వికెట్‌కు ఇచ్చుకున్నాడు. హార్దిక్(3), ధోనీ(4) గెలుపు లాంఛనాన్ని పూర్తిచేశారు.

డుప్లెసిస్ శతక పోరాటం: సహచరులు విఫలమైన చోట డుప్లెసిస్(120) నాయకునిలా నిలబడి పోరాడటంతో దక్షిణాఫ్రికా నిర్ణీత ఓవర్లలో గౌరవప్రదమైన స్కోరు 269/8 అందుకుంది. ఓపెనర్లు ఆమ్లా(34), డీకాక్(16) మెరుగైన శుభారంభాన్ని అందించారు. మణికట్టు స్పిన్నర్లు చాహల్(2/45), కుల్దీప్(3/34) సఫారీలను కట్టడిచేయడంలో కీలకమయ్యారు. ఇన్నింగ్స్ 15వ ఓవర్లో డీకాక్‌ను చాహల్ ఎల్బీడబ్ల్యూ చేశాడు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన మర్క్రామ్(9), డుమిని(12), మిల్లర్(7) చాహల్, కుల్దీప్(3/34)ధాటికి వెంటవెంటనే పెవిలియన్ చేరుకున్నారు.

స్కోరుబోర్డు..

దక్షిణాఫ్రికా: డీకాక్(ఎల్బీ)చాహల్ 34, ఆమ్లా(ఎల్బీ)బుమ్రా 16, డుప్లెసిస్ (సి)హార్దిక్(బి)భువనేశ్వర్ 120, మర్క్రామ్ (సి)హార్దిక్(బి)చాహల్ 9, డుమిని(బి)కుల్దీప్ 12, మిల్లర్(సి)కోహ్లీ(బి)కుల్దీప్ 7, మోరిస్(బి)కుల్దీప్ 37, ఫెల్కువాయో 27 నాటౌట్, రబాడ(రనౌట్) 1, మోర్కెల్ 0 నాటౌట్; **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 50 ఓవర్లలో 269/8; వికెట్ల పతనం:** 1-30, 2-83, 3-103, 4-122, 5-134, 6-208, 7-264, 8-268; **బౌలింగ్:** భువనేశ్వర్ 10-1-71-1, బుమ్రా 10-0-56-1, హార్దిక్ 7-0-41-0, చాహల్ 10-0-45-2, కుల్దీప్ 10-0-34-3, జాదవ్ 3-0-19-0.

భారత్: రోహిత్‌శర్మ(సి)డికాక్(బి)మోర్కెల్ 20, ధవన్(రనౌట్) 35, కోహ్లీ (సి)రబాడ(బి)ఫెల్కువాయో 112, రహానే (సి)తాహిర్(బి)ఫెల్కువాయో 79, హార్దిక్ 3 నాటౌట్, ధోనీ 4 నాటౌట్; **ఎక్స్‌ట్రాలు:** 17; **మొత్తం:** 45.3 ఓవర్లలో 270/4; **వికెట్ల పతనం:** 1-33, 2-67, 3-256, 4-262;

బౌలింగ్: మోర్కెల్ 7-0-35-1, రబాడ 9.3-0-48-0, మోరిస్7-0-52-0, తాహిర్ 10-0-51-0, ఫెల్కువాయో 8-0-42-2, డుమిని 2-0-16-0, మర్క్రామ్ 2-0-20-0.

'స్వర్ణ' మేరీ

- ఇండియా ఓపెన్ బాక్సింగ్ టోర్నీ



న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ బాక్సింగ్ టోర్నీ మహిళల 48 కేజీల ఫైనల్ బౌట్‌లో స్టార్ బాక్సర్ ఎంసీ మేరీకోమ్ 4-1తో జోసీ గబుకో (ఫిలిప్పీన్స్)పై గెలిచి స్వర్ణంతో మెరిసింది. 64 కేజీల టైటిల్ పోరులో అస్సాం బాక్సర్ ప్వీలా బాసుమంత్రే 3-2తో సుడాపోర్న్ సీసోండి (థాయ్‌లాండ్)ని ఓడించి తొలి స్వర్ణాన్ని అందించింది. 69 కేజీల కేటగిరీలో లోవ్లీనా బోర్గోహెన్ (అస్సాం).. పూజపై గెలిచి స్వర్ణాన్ని చేజిక్కించుకుంది. 51 కేజీల విభాగంలో పింకీ జాంగ్రా.. ఏకపక్ష పోరులో జర్గ్లాన్ ఒచిర్‌బాట్ (మంగోలియా)పై, 54 కేజీల కేటగిరీలో మనీషా.. మీనాకుమారిపై గెలిచి స్వర్ణాలను సాధించారు. 60 కేజీల విభాగంలో సరితా దేవి 2-3తో పాట్కొనోన్ (ఫిన్‌లాండ్) చేతిలో ఓడి రజతంతో సరిపెట్టుకుంది.

సంజీత్‌కు స్వర్ణం

పురుషుల 91 కేజీల్లో సంజీత్ 3-2తో తుర్సునోవ్ (ఉజ్బెకిస్థాన్)పై గెలిచి తొలి స్వర్ణాన్ని అందించాడు. 60 కేజీల బౌట్‌లో మనీష్ కౌశిక్.. బట్టుమర్ మిషిల్ట్ (మంగోలియన్)కు వాకోవర్ ఇచ్చి రజతంతో సంతృప్తిపడ్డాడు. 91కేజీల్లో సతీశ్ కుమార్ 1-4తో బాఖోడిర్ (ఉజ్బెకిస్థాన్) చేతిలో ఓడి రెండోస్థానంలో నిలిచాడు. దినేశ్ డాగర్ (69 కేజీలు).. బుటరోవ్ (ఉజ్బెకిస్థాన్) చేతిలో ఓడి రజతాన్ని దక్కించుకున్నాడు. 81 కేజీల కేటగిరీలో దేవాన్ష్ జైస్వాల్ 1-4తో డేవిడ్ గుటిరెజ్ (క్యూబా) చేతిలో, 75 కేజీల్లో స్వీటీ బూర.. ఎస్సాని క్లోటిల్డే (కామెరూన్) చేతిలో ఓడి రెండోస్థానంలో నిలిచారు.

'సుప్రీం'లో శ్రీశాంత్ కేసు

- ఈనెల 5న విచారణ



న్యూఢిల్లీ: తనపై బీసీసీఐ విధించిన జీవితకాల నిషేధం ఎత్తివేయాలంటూ అలుపెరుగని పోరాటం చేస్తున్న శ్రీశాంత్..ఇప్పుడు సుప్రీం కోర్టును ఆశ్రయించాడు. ఈ కేరళ పేసర్ అప్పీల్‌ను ఫిబ్రవరి 5న సుప్రీం కోర్టు విచారణకు స్వీకరించనున్నది. క్రికెట్ ఆడటం తన ప్రాథమిక హక్కు అని, తాను హుందాగా బతికేందుకు అవకాశం ఇవ్వాలంటూ ఈ స్పీడ్‌స్టర్ అప్పీల్‌లో పేర్కొన్నాడు. అంతేకాదు ఐపీఎల్ స్పాట్ ఫిక్సింగ్ కేసుకు సంబంధించి గతంలో ముద్గల్ కమిటీ సమర్పించిన నివేదికలోని 13మంది పేర్లను వెల్లడించాలని అత్యున్నత న్యాయస్థానాన్ని అభ్యర్థించినట్టు తెలుస్తున్నది.

క్వార్టర్స్‌లో సైనా, సింధు

- ఇండియా ఓపెన్ సూపర్ సిరీస్






న్యూఢిల్లీ: భారత స్టార్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ ఇండియా ఓపెన్ నుంచి నిష్క్రమించగా.. పీవీ సింధు, సైనా నెహ్వాల్, పరుపల్లి కశ్యప్ క్వార్టర్ ఫైనల్‌కు చేరారు. గురువారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌ల్లో పురుషుల సింగిల్స్‌లో శ్రీకాంత్ 19-21, 17-21తో ఇస్కందర్ (మలేషియా) చేతిలో ఓడిపోయాడు. మరో మ్యాచ్‌ల్లో కశ్యప్ 21-19, 19-21, 21-12తో శ్రేయాన్స్‌పై, సాయి ప్రణీత్ 21-10, 21-15 తో హు యున్ (చైనా)పై, సమీర్‌వర్మ 21-18, 19-21, 21-17తో టామీ (ఇండోనేషియా)పై గెలిచి క్వార్టర్స్‌కు దూసుకెళ్లారు. ఇక మహిళల సింగిల్స్‌లో సింధు 21-10, 21-14తో లిండా(బల్గేరియా)పై, సైనా 21-12, 21-11తో లిన్ హజ్‌మార్క్ (డెన్మార్క్)పై గెలువగా..మిక్స్‌డ్ డబుల్స్‌లో సాత్విక్, పొన్నప్ప జోడి 21-16, 15-21, 23-21తో టాన్ మెంగ్, లై జింగ్‌పై..ప్రణవ్, సిక్కిరెడ్డి జోడి 21-10, 21-19తో ప్రజక్తా, యోగేంద్రన్‌పై విజయం సాధించి క్వార్టర్ ఫైనల్లో ప్రవేశించారు.

మూడో స్థానంలో పాక్

క్వీన్స్‌టౌన్(న్యూజిలాండ్): అండర్-19 ప్రపంచకప్ టోర్నీని మాజీ చాంపియన్ పాకిస్థాన్ మూడో స్థానంతో ముగించింది. గురువారం మూడు, నాలుగు స్థానాల కోసం జరిగిన వర్గీకరణ మ్యాచ్ ఎడతెరిపిలేని వర్షం కారణంగా బంతి పడకుండానే రద్దయ్యింది. దీంతో గ్రూపు-డిలో టాప్‌లో నిలిచిన పాక్‌కు మూడో స్థానం ఖరారైంది. అండర్-19 ప్రపంచకప్‌లో 2000, 2010 తర్వాత పాక్ మూడులో నిలువడం ఇది మూడోసారి. మరోవైపు ఆఫ్ఘనిస్థాన్‌కు ఇదే అత్యుత్తమ ప్రదర్శన.

ప్రైవేటు స్కూల్ వేధింపులకు ఆరిన దీప్తి

- ఫీజు కట్టలేదంటు పరీక్షకు అనుమతించని యాజమాన్యం
- మనస్తాపంతో తొమ్మిదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య



విద్యార్థిని సాయిదీప్తి(ఫైల్)

మల్కాజిగిరి, నమస్తే తెలంగాణ: ఫీజు కట్టలేదని స్కూల్ యాజమాన్యం పరీక్షకు అనుమతించపోవడంతో తొమ్మిదో తరగతి విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. 'నన్ను పరీక్ష రాయనివ్వలేదు. సారీ మామ్' అంటూ సూసైడ్‌నోట్ రాసిపెట్టింది. హైదరాబాద్ మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం ఈ ఘటన చోటుచేసుకున్నది. జేఎల్ఎస్ నగర్‌కు చెందిన బాలకృష్ణ, సునీత దంపతుల కుమార్తె సాయిదీప్తి(14) జ్యోతినగర్‌లోని జ్యోతి హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నది. గురువారం ఉదయం యూనిట్ టెస్టు రాసేందుకు పాఠశాలకు వెళ్లింది. స్కూల్ ఫీజు చెల్లిస్తేనే పరీక్షకు అనుమతిస్తామని యాజమాన్యం తేల్చిచెప్పడంతో.. పరీక్ష రాయకుండానే ఇంటికొచ్చింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో 'నన్ను పరీక్ష రాయనివ్వలేదు సారీమామ్' అని సూసైడ్ నోటో రాసిన దీప్తి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు.

సినిమా థియేటర్‌లో లైంగికదాడి.. నిందితుడి అరెస్ట్



నిందితుడు భిక్షపతి

బేగంపేట: ఫేస్‌బుక్‌లో పరిచయమైన యువతిని సినిమాకు తీసుకువెళ్లిన ఓ యువకుడు థియేటర్‌లోనే లైంగికదాడికి పాల్పడ్డాడు. సికింద్రాబాద్ మార్కెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగురోజుల క్రితం జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జనగామ నర్మెట్టకు చెందిన కే భిక్షపతి (23) జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సికింద్రాబాద్‌కు చెందిన యువతి(19)తో రెండునెలల క్రితం ఫేస్‌బుక్‌లో పరిచయమైంది. గత నెల 29న నగరానికి వచ్చిన భిక్షపతి ఆ యువతిని సినిమాకు తీసుకెళ్లాడు. సినిమా చూస్తుండగానే లైంగికదాడికి పాల్పడ్డాడు. ఇంటికెళ్లిన ఆ యువతికి రక్తస్రావం కావడంతో తల్లిదండ్రులకు తెలిపింది. వారు మార్కెట్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. గురువారం నిందితుడిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు.

లంచం తీసుకుంటూ పట్టుబడిన లైన్‌మన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విద్యుత్‌శాఖలో లైన్‌మన్‌గా పనిచేస్తున్న సతీశ్ కుమార్ గురువారం సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. హైదరాబాద్‌కు చెందిన సంతోష్‌రెడ్డి టెంపుల్ అల్వాల్‌లోని ఓ కమర్షియల్ కాంప్లెక్స్‌లోని సంస్థలో మూడు విద్యుత్ మీటర్లు ఏర్పాటుకోసం ఆర్పీ నిలయం సెక్షన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. అక్కడ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న సతీశ్‌కుమార్ వాటిని బిగించడానికి రూ. 25వేలు లంచం డిమాండ్ చేశాడు. గురువారం అతడి నుంచి సతీశ్‌కుమార్ రూ.25వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.



తెలంగాణ లెక్చరర్స్ ఫోరం దశాబ్ది ఉత్సవసభలో ప్రసంగిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, బేవరేజెస్ చైర్మన్ దేవీప్రసాద్ తదితరులు

ప్రైవేట్ లెక్చరర్ల కనీస వేతనం అమలుకు కృషి

- టీఎల్‌ఎఫ్ దశాబ్ది ఉత్సవాల్లో మంత్రి హరీశ్‌రావు

చిక్కడపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని భారీ నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న 6 లక్షల మంది లెక్చరర్లకు కనీస వేతనం అందేవిధంగా చూస్తామని ఆయన హామీఇచ్చారు. తెలంగాణ లెక్చరర్స్ ఫోరం (టీఎల్‌ఎఫ్) దశాబ్ది ఉత్సవసభ గురువారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ తమ ప్రయోజనాలు పక్కనబెట్టి తెలంగాణ ప్రజల కోరిక మేరకు టీఎల్‌ఎఫ్‌ను స్థాపించిన లెక్చరర్లు.. ఉద్యమంలో పాలుపంచుకున్నారని గుర్తుచేశారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో కూడా లెక్చరర్లు తమవంతు పాత్ర పోషించాలన్నారు. లెక్చరర్లకు అండగా ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. సీఎం కేసీఆర్ కాంట్రాక్టు లెక్చరర్లు, ఎయిడెడ్ టీచర్ల సమస్యలు పరిష్కరించారని వివరించారు. ప్రభుత్వం జూనియర్ కళాశాల అభివృద్ధికి రూ.250 కోట్లు కేటాయించడం ద్వారా పక్కాభవనాలతోపాటు లెక్చరర్ల సమస్యలు పరిష్కారం అయ్యాయని తెలిపారు. టీఎల్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మురళీమనోహర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండలిలో ప్రభుత్వ చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వీ ప్రకాశ్, టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేందర్, టీఎల్‌ఎఫ్ ప్రధాన కార్యదర్శి సిద్ధేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదా బడ్జెట్

మొదటిపేజీ తరువాయి...

పెంచారు. ఇది గత ఏడాది (రూ.10 లక్షల కోట్లు) కన్నా లక్ష కోట్లు అధికం. కిసాన్ క్రెడిట్ కార్డును మత్స్యకారులకు, పశుపోషణ రంగంలోని రైతులకు కూడా వర్తింపజేస్తామన్నారు. వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి రూ.2000 కోట్లను కేటాయించారు. వ్యవసాయోత్పత్తుల ఎగుమతులను సరళీకరిస్తామని చెప్పారు. రూ.100 కోట్లు, అంతకంటే ఎక్కువ టర్నోవర్‌ను నమోదు చేసే వ్యవసాయోత్పత్తుల కంపెనీలకు తొలి ఐదేండ్లపాటు వందశాతం పన్ను మినహాయింపును ప్రకటించారు. ఉచిత వంటగ్యాస్ (ఎల్పీజీ) కనెక్షన్ లబ్ధిదారుల సంఖ్యను ఇప్పుడున్న 5 కోట్ల నుంచి 8 కోట్లకు పెంచాలని నిర్ణయించారు. నాలుగు కోట్ల కుటుంబాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్‌ను అందించనున్నామని తెలిపారు. విద్య, ఆరోగ్య, సామాజిక పరిరక్షణ రంగాలకు రూ.1.38 లక్షల కోట్లను కేటాయించారు. బ్లాక్‌బోర్డు నుంచి డిజిటల్‌బోర్డుకు పరివర్తన చెందే విధంగా దేశ విద్యారంగాన్ని మార్చాలన్నది ప్రభుత్వ లక్ష్యమని జైట్లీ చెప్పారు. ఈ మేరకు ప్రి-నర్సరీ నుంచి 12వ తరగతి వరకూ ఒక సమగ్ర విద్యావిధానాన్ని తీసుకొస్తామన్నారు. అయితే దీని గురించి వివరాలు వెల్లడించలేదు.

వేతన వర్గాలకు లభించని ఊరట

వేతన వర్గాలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే పన్నుశ్లాబుల్లో జైట్లీ ఎటువంటి మార్పులను చేయలేదు. కాకపోతే, వేతన ఉద్యోగులు, పింఛనుదారుల రవాణా, వైద్య ఖర్చులకు సంబంధించి రూ.40 వేల స్టాండర్డ్ డిడక్షన్‌ను మంత్రి ప్రవేశపెట్టారు. ప్రస్తుతం రూ.19,200 వరకూ రవాణా అలవెన్సు మీద, రూ.15,000 వరకూ వైద్య ఖర్చుల మీద పన్ను విధించటం లేదు. ఈ రెండింటినీ కలిపి ప్రస్తుతం రూ.40 వేలకు పెంచారు. దీనివల్ల కలిగే ప్రయోజనం స్వల్పమే అయినా, దీనివల్ల రూ.2.5 కోట్ల మందికి లబ్ధి చేకూరనుంది. సీనియర్ సిటిజన్లకు బ్యాంకు, పోస్టాఫీసు డిపాజిట్లపై ఇచ్చే వడ్డీ మీద విధించే పన్ను మినహాయింపును ఇప్పుడున్న రూ.10 వేల నుంచి రూ.50 వేలకు పెంచారు. తీవ్రమైన అస్వస్థతకు లోనైనప్పుడు చికిత్సకు చేసిన వ్యయంపై విధించే పన్ను మినహాయింపును రూ.లక్షకు పెంచారు.

సెస్సు పెంపు

పన్ను వర్తించే అన్ని రకాల ఆదాయంపై విధిస్తున్న విద్య, ఆరోగ్యం సెస్సును ఇప్పుడున్న మూడు శాతం నుంచి నాలుగు శాతానికి పెంచారు. సామాజిక సంక్షేమ పథకాలకు అవసరమైన నిధుల కోసం పదిశాతం సామాజిక సంక్షేమ సర్‌చార్జీని ప్రవేశపెట్టారు. రూ.250 కోట్ల వరకు టర్నోవర్ ఉన్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వ్యాపారసంస్థలపై విధిస్తున్న కార్పొరేట్ పన్నును ఇప్పుడున్న 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గించారు. ఈ పన్నును 25 శాతానికి తగ్గిస్తామని జైట్లీ 2015లో హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో, ప్రస్తుత తగ్గింపును రూ.2016-17 ఆర్థికసంవత్సరం నుంచి వర్తింపజేశారు. ఎక్సైజ్‌డ్యూటీ, సేవాపన్నులను జీఎస్టీలోనే కలిపిన నేపథ్యంలో కస్టమ్స్‌డ్యూటీలో మాత్రమే జైట్లీ మార్పులను ప్రకటించారు. దీనివల్ల విదేశాల నుంచి దిగుమతి చేసుకునే సెల్‌ఫోన్లు, పర్ఫ్యూమ్‌లు, వాచీలు, ఆటోమొబైల్ పరికరాలు, సన్‌గ్లాసెస్, ట్రక్కు టైర్లు, పాదరక్షలు, వజ్రాలు తదితర సరుకులపై కస్టమ్స్‌డ్యూటీ పెరిగింది. ఫలితంగా వీటి ధరలు పెరుగనున్నాయి. ఏడాదికిపైగా అట్టిపెట్టుకున్న షేర్ల విక్రయం ద్వారా అర్జించే రూ.లక్షకుపైగా ఆదాయం (లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్)పై పన్నును పునరుద్ధరించారు. ఈ పన్నును రద్దు చేసిన 14 ఏండ్ల తర్వాత తిరిగి తీసుకొచ్చారు. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ నుంచి పంపిణీ చేసిన ఆదాయంపై 10 శాతం పన్నును విధిస్తున్నట్లు ప్రతిపాదించారు.

ఐదో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఆవిర్భవిస్తాం

జీఎస్టీ, పెద్ద నోట్లరద్దు ప్రభావంతో జీడీపీ గత మూడేండ్లలోనే అత్యంత కనిష్ఠానికి చేరుకున్న నేపథ్యంలో, జీడీపీని 8 శాతానికి పైగా త్వరలోనే సాధిస్తామని జైట్లీ ధీమా వ్యక్తం చేశారు. 'భారత ఆర్థిక వ్యవస్థ 2.5 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరుకున్నది. ప్రపంచంలో ఏడోస్థానంలో ఉన్నాం. త్వరలోనే ఐదోస్థానానికి చేరుకోనున్నాం' అని ప్రకటించారు. రక్షణరంగానికి రూ.2.95 లక్షల కోట్లను జైట్లీ కేటాయించారు. ఇది గత ఏడాది (రూ.2.74 లక్షల కోట్లు) కన్నా 7.81 శాతం అధికం. రైల్వేలకు రూ.1.48 లక్షల కోట్లను కేటాయించారు. ఈ ఆర్థిక సంవత్సరం ఖర్చును రూ.21.57 లక్షల కోట్లకు సవరిస్తూ, 2018-19 సంవత్సరం ఖర్చును రూ.24.42 లక్షల కోట్లుగా ఆర్థికమంత్రి అంచనా వేశారు. చిన్న, మధ్యతరహా వ్యాపారసంస్థలు తీసుకున్న బ్యాంకు రుణాలను రాబట్టటం కోసం త్వరలోనే కార్యాచరణను ప్రకటిస్తామని చెప్పారు. నేషనల్ ఇన్సూరెన్స్, యునైటెడ్ ఇన్సూరెన్స్, ఓరియెంటల్ ఇన్సూరెన్స్ – ఈ మూడు ప్రభుత్వ కంపెనీలను ఒకే కంపెనీగా కలిపివేస్తామన్నారు. ఎయిరిండియా ప్రైవేటైజేషన్‌తోపాటు 24 ప్రభుత్వరంగ సంస్థల అమ్మకం ప్రక్రియ ప్రారంభమైందన్నారు.

నిధులెలా?

ఎన్నికల నేపథ్యంలో వివిధ వర్గాలను ప్రసన్నం చేసుకోవటానికి జైట్లీ ఘనంగా పథకాలు ప్రకటించినప్పటికీ వాటికి అవసరమైన నిధుల సమీకరణ మాత్రం అంత సులభంగా జరిగేట్లు లేదు. అందువల్లే, ప్రస్తుత ఆర్థిక సంవత్సర ద్రవ్యలోటును ముందు అనుకున్న దానికన్నా పెంచారు. ద్రవ్యలోటును జీడీపీలో 3.2 శాతానికి కట్టడి చేయాలని తొలుత నిర్ణయించినప్పటికీ, ఇప్పుడు దానిని 3.5 శాతానికి పెంచారు. అదేవిధంగా వచ్చే ఆర్థిక సంవత్సరం (2018-19) ద్రవ్యలోటును కూడా తొలుత మూడు శాతానికే పరిమితం చేయాలని భావించినప్పటికీ ఇప్పుడు 3.3 శాతానికి పెంచారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయం, ఖర్చు మధ్య ఉండే వ్యత్యాసమే ద్రవ్యలోటు. ఖర్చుకు తగిన ఆదాయ వనరులు లేనప్పుడు ద్రవ్యలోటు పెరుగుతుంది.

ప్రముఖుల వేతనాలు పెంపు

రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న వారికి వేతనాలను పెంచాలని నిర్ణయించినట్లు జైట్లీ తెలిపారు. రాష్ట్రపతి వేతనాన్ని రూ.5 లక్షలకు, ఉపరాష్ట్రపతి వేతనాన్ని రూ.4 లక్షలకు, గవర్నర్ల వేతనాన్ని రూ.3.5 లక్షలకు పెంచారు. ఎంపీల విషయంలో ప్రతీ ఐదేండ్లకోసారి ద్రవ్యోల్బణాన్ని బట్టి వేతనాలను సవరించే విధంగా చట్టాన్ని రూపొందించనున్నట్లు వెల్లడించారు.

ఈ సర్కారుకిదే ఆఖరి పూర్తిస్థాయి బడ్జెట్

వచ్చే ఏడాది జరిగే సాధారణ ఎన్నికలకు ముందు ప్రవేశపెట్టే చివరి పూర్తిస్థాయి బడ్జెట్‌ను జైట్లీ ప్రవేశపెట్టారు. వచ్చే ఏడాది వోట్ ఆన్ ఎకౌంట్‌ను ప్రవేశపెడుతారు. కొత్త పూర్తిస్థాయి బడ్జెట్‌ను లోక్‌సభ ఎన్నికల అనంతరం వచ్చే నూతన ప్రభుత్వం తీసుకొస్తుంది.

ఉప ఎన్నికల్లో బీజేపీకి ఎదురుదెబ్బ

రాజస్థాన్‌లో రెండు ఎంపీ, ఒక ఎమ్మెల్యే సీటు గల్లంతు • భారీ మెజారిటీతో గెలుపొందిన కాంగ్రెస్ • బెంగాల్‌లో తృణమూల్‌దే విజయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: రెండు రాష్ట్రాలలో జరిగిన ఉప ఎన్నికలలో బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రాజస్థాన్‌లో సిట్టింగ్ స్థానాలను కోల్పోయిన బీజేపీ, బెంగాల్‌లో సైతం ఓటమి చవిచూసింది. రాజస్థాన్‌లో బీజేపీ అధికారంలో ఉన్నప్పటికీ రెండు ఎంపీల స్థానాలను, ఒక శాసనస్థానాన్ని నిలబెట్టుకోలేకపోయింది. ఈ మూడు స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలుపొందారు. ఈ ఏడాది డిసెంబర్‌లో రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఈ ఓటమి బీజేపీకి తీవ్ర నిరాశను మిగిల్చింది. పక్కనే ఉన్న గుజరాత్‌లో బీజేపీకి గట్టి పోటీనిచ్చిన కాంగ్రెస్ రాజస్థాన్‌లో విజయం కోసం తీవ్రంగా శ్రమించింది. ఆ పార్టీకి చెందిన అభ్యర్థులు ఆల్వార్, అజ్మీర్ లోక్‌సభ స్థానాలతోపాటు మండల్‌గఢ్ అసెంబ్లీ సీటులో విజయ ఢంకా మోగించారు. ఆల్వార్‌లో కాంగ్రెస్‌కు చెందిన కరణ్‌సింగ్ యాదవ్ తన బీజేపీ ప్రత్యర్థి జస్వంత్ యాదవ్‌పై 1,96,496 ఓట్ల మెజారిటీని సాధించారు. అజ్మీర్‌లో కాంగ్రెస్‌కు చెందిన రఘుశర్మ బీజేపీకి చెందిన స్వరూప్ లాంబాపై 84 వేల ఓట్ల మెజారిటీని సాధించారు. మండల్‌గఢ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ ధాకడ్ తన బీజేపీ ప్రత్యర్థి శక్తీసింగ్‌పై 13 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఈ స్థానంలో కాంగ్రెస్ నాయకుడు గోపాల్ మాలవీయ రెబల్‌గా బరిలోకి దిగినప్పటికీ ఫలితాన్ని మార్చలేకపోయారు. రాజస్థాన్‌లో గోరక్షణ ఉద్యమం, పద్మావత్ సినిమాకు వ్యతిరేక ఆందోళనలు మిన్నంటినప్పటికీ బీజేపీ ఓటమిపాలు కావడం పరిశీలకులను విస్మయపరుస్తున్నది. పద్మావత్ సినిమాకు వ్యతిరేకంగా ఉద్యమించిన రాజ్‌పుత్ కర్ణిసేనకు బీజేపీ మద్దతునిచ్చినప్పటికీ ఆ వర్గం వారు అధికంగా ఉన్న అజ్మీర్‌లో అధికార పార్టీ ఓటమి చెందడం గమనార్హం. ఇక ఆల్వార్‌లో ఆవులను దొంగిలిస్తున్నాడన్న ఆరోపణపై పెహ్లూఖాన్ అనే ముస్లింను గోసంరక్షణ కార్యకర్తలు కొట్టి చంపిన సంగతి తెలిసిందే. ఈ ఘటన నేపథ్యంలో నియోజకవర్గంలోని ముస్లింలందరూ సంఘటితంగా కాంగ్రెస్ వెనుక నిలిచినట్టు తెలుస్తున్నది. రెండు లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని మొత్తం 17అసెంబ్లీ సెగ్మెంట్లలో ఏ ఒక్క స్థానంలోనూ బీజేపీ ఆధిక్యతను చూపలేకపోయింది. బీజేపీకి చెందిన సిట్టింగ్ అభ్యర్థులు మరణించిన కారణంగానే ఈ మూడు స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించారు. సానుభూతి పనిచేయకపోవడం, పార్టీతోపాటు ప్రభుత్వ యంత్రాంగం మొత్తాన్ని వినియోగించినప్పటికీ విజయం లభించకపోవడంతో ముఖ్యమంత్రి వసుంధర రాజే నాయకత్వంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 2014లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో రాజస్థాన్‌లోని మొత్తం 25 స్థానాలను బీజేపీ గెలుచుకుంది. తాజాగా రెండు సీట్లు గెలుపొందడంతో లోక్‌సభలో కాంగ్రెస్ బలం 48 స్థానాలకు పెరిగింది.



ఉప ఎన్నికల ఫలితాల అనంతరం విజయచిహ్నం చూపుతున్న రాజస్థాన్ పీసీసీ చీఫ్ సచిన్ పైలట్, నేతలు

ఉలుబెరియాలో తృణమూల్‌కు భారీ మెజారిటీ

పశ్చిమ బెంగాల్‌లోని ఉలుబెరియా లోక్‌సభ, నౌపరా అసెంబ్లీ స్థానాలను తృణమూల్ నిలబెట్టుకుంది. ఉలుబెరియాలో తృణమూల్ అభ్యర్థి సజ్దా అహ్మద్ బీజేపీ ప్రత్యర్థి అనుపం మాలిక్‌పై 4.74 లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. సజ్దాకు 7.67 లక్షల ఓట్లు పోలయ్యాయి. ఈ స్థానంలో సీపీఎం, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతయ్యాయి. అయితే క్రితంసారి కన్నా బీజేపీ తన ఓట్ల శాతాన్ని పెంచుకోవడం విశేషం. ఇక నౌపరా అసెంబ్లీ సీటులో తృణమూల్‌కు చెందిన సునీల్ సింగ్ 60 వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఇక్కడ బీజేపీ అభ్యర్థికి 38 వేల ఓట్లు పోలవగా, సీపీఎం 35వేల ఓట్లతో మూడోస్థానంలో నిలిచింది.

వసుంధర రాజీనామాకు సచిన్ డిమాండ్

ఉప ఎన్నికల్లో ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి వసుంధర రాజే తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ నాయకుడు సచిన్ పైలట్ డిమాండ్ చేశారు. ప్రజలు బీజేపీ ప్రభుత్వాన్ని తిరస్కరిస్తున్నారనడానికి ఈ ఫలితాలే నిదర్శనమని పేర్కొన్నారు. మరోవైపు రాజస్థాన్ ఉపఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీకి తృణమూల్ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీ అభినందనలు తెలిపారు.

పాట్నా ఫ్యాక్టరీలో గ్యాస్ లీక్: ముగ్గురు దుర్మరణం

పాట్నా, ఫిబ్రవరి 1: బీహార్ రాజధాని పాట్నా నగర పరిధిలోని పాటలీపుత్రలో ఉన్నా నేచురల్ డెయిరీ ఫ్యాక్టరీలో గ్యాస్ లీక్ కావడంతో గురువారం ముగ్గురు కార్మికులు మృతి చెందారు. బుధవారం గ్యాస్ లీకవగా అస్వస్థతకు గురైన కార్మికులను దవాఖానలో చేర్చినా ప్రయోజనం లేకపోయింది. వారు మరణించడంతో గురువారం ఈ ఘటన వివరాలు బయటకు వచ్చాయి. మృతుల కుటుంబాలు తమకు న్యాయం చేయాలని కోరుతూ పోలీసుల ముందు నిరసన తెలిపారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే ఫ్యాక్టరీ యజమాని పరారయ్యారు. గ్యాస్ లీక్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు.. మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం తరలించారు. గ్యాస్ లీకేజీకి కారణాలు తెలియాల్సి ఉన్నదని, మృతులంతా బెంగాలీలేనని పాట్నా నగర ఎస్పీ డీ అమర్‌కేశ్ చెప్పారు.



సోనియా అధ్యక్షతన జరిగిన భేటీలో కాంగ్రెస్, ఇతర విపక్ష పార్టీల నేతలు

పార్లమెంట్‌లోనూ, బయటా ఐక్యంగా వ్యవహరిద్దాం

- విపక్షాలను కోరిన సోనియా, రాహుల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: పార్లమెంట్ లోపల, వెలుపలా ఐక్యంగా పనిచేద్దామని విపక్షపార్టీలను కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియాగాంధీ, పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కోరారు. రాష్ట్రాల్లోని విభేదాలు పక్కనబెట్టి జాతీయ ప్రయోజనాలకోసం ఏకమవుదామని సూచించారు. గురువారం సాయంత్రం యూపీఏ చైర్‌పర్సన్ కూడా అయిన సోనియాగాంధీ అధ్యక్షతన పార్లమెంట్ లైబ్రరీ భవనంలో విపక్ష పార్టీల సమావేశం జరిగింది. 17 పార్టీల నేతలు హాజరవగా, బీఎస్పీ నుంచి ఎవరూ పాల్గొనలేదు. కాంగ్రెస్ అధ్యక్ష పదవి నుంచి తప్పుకున్న తర్వాత సోనియా అధ్యక్షతన జరిగిన తొలి సమావేశం ఇదే. 'పార్లమెంట్‌లోపల, వెలుపల ఉమ్మడి వ్యూహాన్ని అమలు చేయాల్సిన అవసరముంది. రాష్ట్రాలవారీగా పార్టీల మధ్య అనేక భిన్నాభిప్రాయాలున్నా, జాతీయఅంశాల్లో ఒకే వైఖరికి కట్టుబడడం అవసరం' అని సోనియా విపక్షనేతలకు సూచించినట్లు కాంగ్రెస్ నేత గులాంనబీ ఆజాద్ వెల్లడించారు. ట్రిపుల్ తలాక్, సుప్రీంకోర్టు సంక్షోభం, కాస్‌గంజ్ మతకల్లోలాలు కూడా వీరిమధ్య చర్చకు వచ్చినట్లు తెలిసింది.

సుప్రీంకోర్టులో కొత్త రోస్టర్ విధానం

ఇకపై న్యాయమూర్తులకు విభాగాల వారీగా కేసుల కేటాయింపు

నలుగురు సీనియర్ జడ్జీల తిరుగుబాటు నేపథ్యంలో చీఫ్ జస్టిస్ నిర్ణయం

సీజేఐకి పిల్స్, ఎస్సెల్పీలు, ఎన్నికలు, క్రిమినల్, సామాజిక న్యాయం, రాజ్యాంగ పదవుల కేసులు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: ఏ న్యాయమూర్తికి ఎలాంటి కేసులు అప్పగించాలన్న విషయమై సుప్రీంకోర్టు ఒక నిర్ణయానికి వచ్చింది. ఇందుకు రోస్టర్ విధానాన్ని అవలంబిస్తామని భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) దీపక్‌మిశ్రా గురువారం ప్రకటించారు. తాను ప్రజాప్రయోజన వ్యాజ్యాలు(పిల్స్), ఇతర కేసుల విచారణ జరుపుతానని తెలిపారు. ఈ విషయాన్ని 13 పేజీల నోటిఫికేషన్ ద్వారా సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. ఇకపై సుప్రీంకోర్టుకు వచ్చే కేసులను ప్రధాన న్యాయమూర్తి ఉత్తర్వుల ప్రకారం రోస్టర్ విధానంలో నిర్ణీత విభాగాలు, అంశాల వారీగా జడ్జీలకు కేటాయిస్తారు. ఈ నెల 5వ తేదీ నుంచి తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యేంతవరకు ఈ విధానం అమలులో ఉంటుందని నోటిఫికేషన్ తెలిపింది. సుప్రీంకోర్టుకు చెందిన నలుగురు సీనియర్ న్యాయమూర్తులు ఇటీవల తిరుగుబాటు చేసినంత పని చేయడంతో సీజేఐ ఈ మేరకు నిర్ణయించారు. తనతోపాటు 12 మంది సీనియర్ జడ్జీల్లో ఎవరెవరు ఎలాంటి అంశాలకు సంబంధించిన కేసుల విచారణ జరుపాల్సి ఉంటుందన్న విషయాన్ని నోటిఫికేషన్‌లో జస్టిస్ దీపక్‌మిశ్రా వివరించారు.అన్ని రకాల పిల్స్, ఎస్సెల్పీలతోపాటు ఎన్నికలు, క్రిమినల్, సామాజిక న్యాయం, రాజ్యాంగపదవుల నియామకానికి సంబంధించిన కేసులను ఆయన విచారిస్తారు సీజేఐ తరువాత రెండో సీనియర్ జడ్జి అయిన జస్టిస్ చలమేశ్వర్‌కు కార్మిక, పరోక్ష పన్నులు, భూవివాదాలు, కంపెనీ చట్టాలు, ఎంఆర్టీపీ, ట్రాయ్, సెబీ, ఆర్బీఐ, కోర్టు అభిశంసనలు, పర్సనల్ లా, మతం, నేర సంబంధిత వివాదాలు, ఇతరత్రా విషయాల కేసులను కేటాయిస్తారు.జస్టిస్ లోకుర్‌కు సేవారంగం, సామాజిక న్యాయం, వినియోగదారుల రక్షణ, పర్సనల్ లా, భూసేకరణ తదితర అంశాల కేసులు అప్పగిస్తారు. జస్టిస్ జోసఫ్‌కు కార్మిక, అద్దెల నియంత్రణ, కుటుంబచట్టాలు, కోర్టు అభిశంసనలు తదితర వ్యవహారాల కేసులను అప్పగిస్తారు. మిగతా సీనియర్ జడ్జీల్లో జస్టిస్‌లు గొగోయ్, ఏకే సిక్రీ, ఎస్ఏ బాబ్డే, ఆర్కేఅగర్వాల్, ఎన్వీరమణ, అరుణ్‌మిశ్రా, ఏకే గోయల్, ఆర్ఎఫ్ నారిమన్‌కు కూడా ఇదేమాదిరిగా వివిధ క్యాటగిరీల కేసులను కేటాయించారు.

ఆధార్‌తో అదనపు సమస్య ఏమిటి?

- ఆధార్ కేసులో ప్రశ్నించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : ఆధార్ పథకం కింద ప్రభుత్వం వివరాలు సేకరించడానికి, ప్రజలు స్వచ్ఛందంగా తమ వివరాలు వెల్లడించడానికి గల తేడా ఏమిటని సుప్రీంకోర్టు గురువారం ప్రశ్నించింది. ఆధార్ పథకానికున్న రాజ్యాంగ విలువను సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఈ వ్యాఖ్య చేసింది. 'మీ బ్యాంకు ఖాతా నుంచి బీమా చెల్లింపులు, వాహనం వాయిదాలు, బిల్లుల చెల్లింపులకు సంబంధించి బ్యాంకుకు మీరు నిర్దిష్టమైన సూచనలు చేస్తారు. మరి గుణాత్మకమైన తేడా ఏమిటి? మనందరం మన గుర్తింపును అప్పగించే దిశగా ప్రయాణిస్తున్నాం. అలా అప్పగించాలా వద్దా అనే నిర్ణయం మన చేతిలోనే ఉండవచ్చు. కానీ అది ఒక సెంట్రల్ డాటాబేస్. మనంతట మనం మన గుర్తింపును అప్పగించడానికి సిద్ధపడుతున్నప్పుడు, ప్రభుత్వం కూడా ఆ సమాచారాన్ని సేకరించడం వల్ల ఏమైనా తేడా ఉంటుందా? అని ధర్మాసనం ప్రశ్నించింది. ఆధార్‌కు బదులుగా పాన్‌కార్డ్‌ను ఉపయోగించినప్పుడు వచ్చే తేడా ఏమిటి అని వ్యాఖ్యానించింది. ఒక వ్యక్తి ఇంటర్నెట్‌ను ఉపయోగించినప్పుడు అతని కదలికలను తెలుసుకోగలమని, మరి ఆధార్ వల్ల వచ్చిన అదనపు సమస్య ఏమిటని ప్రశ్నించింది. కేసు తదుపరి విచారణను ఈ నెల 6వ తేదీకి వాయిదా వేసింది.

'ఫిక్స్‌డ్ టర్మ్' పాలసీపై ఆగ్రహజ్వాలలు

- నేటి నుంచి కార్మికసంఘాల ఆందోళనలు
- దేశవ్యాప్త ఉద్యమానికి ఆర్ఎస్ఎస్ అనుబంధ బీఎంఎస్ పిలుపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: 2018-19 బడ్జెట్‌లో ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ప్రతిపాదించిన 'ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్' విధానంపై కార్మికసంఘాలు భగ్గుమంటున్నాయి. వామపక్ష, ఇతర కార్మిక సంఘాలతోపాటు ఆర్ఎస్ఎస్ అనుబంధ భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) కూడా ఆగ్రహంతో రగిలిపోతున్నది. శుక్రవారం నుంచి ఆందోళనలు ప్రారంభించేందుకు సమాయత్తమవుతున్నాయి. ప్రస్తుతం దుస్తుల తయారీరంగానికి మాత్రమే పరిమితమైన 'ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్'(ఎఫ్‌టీఈ) పాలసీని పాదరక్షలు, తోలు, ఉపకరణాల తయారీరంగాలకు విస్తరింపజేయాలని ఇటీవల కేంద్ర క్యాబినెట్ నిర్ణయించింది. ఇదే విషయాన్ని బడ్జెట్ ప్రసంగంలోనూ మంత్రి పేర్కొన్నారు. ఈ విధానం ప్రకారం నిర్ణీత కాలానికి మాత్రమే ఉద్యోగులను నియమించుకొనే అవకాశం, ఎటువంటి నోటీస్ ఇవ్వకుండానే ప్రాజెక్ట్ ముగిసిన వెంటనే ఉద్యోగులను తొలిగించే అవకాశం యాజమాన్యాలకు ఉంటుంది. దీంతో కార్మికుల ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లుతుందని కార్మిక సంఘాలు ఆందోళనలు వ్యక్తంచేస్తున్నాయి. ఎటువంటి చర్చలు జరుపకుండానే ప్రభుత్వం తీసుకొచ్చిన ఎఫ్‌టీఈకి వ్యతిరేకంగా శుక్రవారం నుంచి దేశవ్యాప్త ఆందోళనలకు దిగనున్నట్టు బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి విర్జేశ్ ఉపాధ్యాయ తెలిపారు. ఈ పాలసీ కార్మికుల ఉద్యోగభద్రతకు హానికరమని, వారి పని సామర్థ్యాన్ని దెబ్బతీస్తుందని, అంతిమంగా తొలిగింపులకు దారితీస్తుందని చెప్పారు. 'ఎఫ్‌టీఈ' చట్టవిరుద్ధమని, పారిశ్రామిక వివాదాల చట్టం-1947 ప్రసాదించిన కార్మిక హక్కులను హరించే అధికారం ప్రభుత్వానికి లేదని సీఐటీయూ కార్యదర్శి వివేక్ మాన్‌టేరియో చెప్పారు. 2003లోనే అప్పటి ఎన్డీఏ ప్రభుత్వం ఈ పాలసీని ప్రవేశపెట్టేందుకు ప్రయత్నించి కార్మికుల ప్రతిఘటనతో వెనక్కి తగ్గిందని ఏఐటీయూసీ కార్యదర్శి వీఎస్ గిరి పేర్కొన్నారు. అయితే, పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగానే ఎఫ్‌టీ ఉద్యోగులకూ అన్ని బెనిఫిట్స్ ఉంటాయని ప్రభుత్వం చెబుతున్నది.

ఆంగ్‌సాన్‌సూకీ ఇంటిపై పెట్రోల్ బాంబుదాడి

మయన్మార్ : మయన్మార్ నాయకురాలు ఆంగ్‌సాన్‌సూకీ విల్లాపై గురువారం ఓ వ్యక్తి పెట్రోల్ బాంబుతో దాడి చేశాడు. ఆ సమయంలో సూకీ ఇంట్లో లేరు. ఆమె నేపిడా నగరంలో ఉన్నారు. పెట్రోల్ బాంబు విసిరింది నిజమేనని అధికారులు ధ్రువీకరించారు. నిందితుడు గులాబీరంగు టీషర్టు, నీలం రంగు లుంగీ ధరించినట్టు అధికారులు తెలిపారు.పెట్రోల్‌బాంబుతో సూకీ ఇల్లు స్వల్పంగా ధ్వంసమైందని అధికారులు పేర్కొన్నారు. సూకీ రోహింగ్యాల పక్షాన మాట్లాడకపోవడంతో ఆమెపై అంతర్జాతీయ సమాజం ఆగ్రహంగా ఉన్నది.ఆ కారణంగానే సూకీ ఇంటిపై దాడికి పాల్పడి ఉండవచ్చని భావిస్తున్నారు.

రాజౌరిలో పాక్ కాల్పులు.. 71 స్కూళ్లు మూసివేత

జమ్ము : జమ్ముకశ్మీర్‌లోని రాజౌరి జిల్లాలో సైనిక పోస్టులు, పౌర ఆవాసాలు లక్ష్యంగా గురువారం నియంత్రణ రేఖ వెంబడి పాక్ బలగాలు భారీ మోర్టార్లతో కాల్పులు జరిపాయి. ఈ నేపథ్యంలో 71 పాఠశాలలను అధికారులు మూసివేశారు. జిల్లాలోని లామ్, నౌషెరా సెక్టార్‌లలో ఉదయం నుంచి పాక్ బలగాలు కాల్పులకు తెగబడినట్టు రాజౌరి డిప్యూటీ కమిషనర్ షాహిద్ ఇక్బాల్ చౌదరి తెలిపారు. కంప్లా, పుఖారి, లామ్, అన్వాస్‌భండార్, రత్తాల్ బాసలి ప్రాంతాల్లో కాల్పులు జరిగినట్టు పేర్కొన్నారు. భారత బలగాలు ధీటుగా సమాధానం ఇచ్చాయని చెప్పారు.

డేరా బాబాపై సీబీఐ చార్జ్‌షీట్

- ఇద్దరు వైద్యులపైనా అభియోగాలు

న్యూఢిల్లీ : ప్రస్తుతం జైల్లో ఉన్న డేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ రాంరహీం సింగ్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) గురువారం చార్జ్‌షీట్ దాఖలు చేసింది. 400మంది డేరా సభ్యులను బలవంతంగా నపుంసకులుగా మార్చిన కేసులో ఆయనతోపాటు ఇద్దరు వైద్యుల పేర్లనూ చార్జ్‌షీట్‌లో చేర్చింది. సాధ్వీలపై లైంగికదాడికి పాల్పడిన కేసులో గుర్మీత్‌కు 20ఏండ్ల జైలుశిక్ష పడిన విషయం తెలిసిందే. సిర్సాలోని డేరా ఆశ్రమంలో డాక్టర్లు పంకజ్‌గార్గ్, ఎంపీ సింగ్ ద్వారా నపుంసకులుగా మార్చారన్నది రాంరహీంపై అభియోగం. వీరిపై 2015లో కేసు నమోదు చేసిన సీబీఐ.. తాజాగా పంచకుల కోర్టుకు చార్జ్‌షీట్ సమర్పించింది.